
# కథామంజరి

## పది కథల సమాహారం



కథామంజరిని ఆదరిస్తూ,
తెలుగు కథని ముందుకు తీసుకువెళ్తున్న
కథాప్రియులకు, శ్రేయోభిలాషులకు,
రచయితలకు, రచయిత్రులకు
ఓ చిన్న విన్నపం లోపలి పేజీలో ఉంది.
కథల్లోకి వెళ్లేముందు..
ఓ రెండు నిమిషాలు  కేటాయించి,
మా విన్నపాలు చదివి,
మీ సలహాలు అందచేయ ప్రార్థన!

డిసెంబర్ 2022

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

డిసెంబర్ 2022

సంపుటి : 3 ♦ సంచిక : 12

# విన్నపాలు వినవలె ...

కథామంజరి నేటికి సరిగ్గా రెండున్నర సంవత్సరాల వయస్సు, ముప్పై సంచికల అనుభవంతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టడానికి సిద్ధమౌతోంది. జూలై 2020 లో ఇద్దరం కలిసి, అడుగులో అడుగు వేసుకుంటూ ప్రారంభించిన ఈ కథాయానంలో, తర్వాత కాలంలో ఒకరు, ఇద్దరు, ముగ్గురు వచ్చి చేరారు. ఇప్పుడు మేం పద్నాలుగు మందిమి. అందరూ స్వచ్ఛందంగా శ్రమదానం చేసి, తెలుగు కథను ముందు తరాలకి అందించే తపనతో ఉన్నవాళ్లే! ఇదే మా బలం! అలాగే మాకు ఇతరత్రా ఎన్నో విధాల.. ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం అందిస్తున్న ఎంతోమంది మహానుభావులు ఉన్నారు. ఇందులో సాహిత్యపరమైన సమాచారాన్ని అందిస్తున్నవారు వున్నారు, ఆర్థికపరమైన సహాయాన్ని అందిస్తున్నవారూ ఉన్నారు. వారందరికీ మరోసారి ధన్యవాదాలు.

కథామంజరిలో కేవలం తెలుగు కథలని మాత్రమే ప్రచురిస్తూ, ఇతరత్రా ఏ విధమైన వ్యాపార ప్రకటనలు లేకుండా, వ్యాపారాత్మక ఆలోచనలకు కూడా తావు ఇవ్వకుండా.. సంచికను నడపాలన్న మా ఉద్దేశం మంచి ఫలితాలనే ఇచ్చింది. ప్రతినెలా రచయితలకు ఇచ్చే కొద్దిపాటి పారితోషికాలు, కథల పోటీలు నిర్వహించినప్పుడు ఇచ్చే బహుమతులకు, అలాగే.. సాంకేతిక సహాయం అందిస్తున్న సంస్థకు ఇచ్చే ఖర్చులకు సరిపడా ఆర్థిక సహాయం ఇప్పటి వరకు దాతలు అందిస్తూనే వున్నారు. ఇది నెలకు కేవలం ₹5,000/– మాత్రమే. ఈ మధ్యే ఓ పెద్దాయన రచయితలకు ఇచ్చే పారితోషికం పెంచమని సలహా ఇవ్వడమే కాకుండా, పెరిగిన వ్యయానికి సరిపడా తన వంతు ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు. ఇలా.. ఏ నెలకానెల ఏదో విధంగా వనరులు అందుతూ, పత్రిక మనుగడకు ఇబ్బంది ఇప్పటి వరకు రాలేదు. కాని ఈ పరిస్థితి ఎల్లప్పుడూ ఉంటుందా? శాశ్వతంగా సౌజన్యం లభిస్తుందా? ఇలా.. ఒకరినో ఇద్దరినో ఇబ్బంది పెట్టే బదులు.. తలో చెయ్యి వేసేవారి సహాయం తీసుకుంటే మంచిదే కదా.. అనే ప్రశ్నలు, జవాబులు మా ముందు కదలాడుతున్నాయి! వీటి మీద మా బృందం మేధోమథనం చేసాం. కాని.. ఈ సమస్యలకు సరియైన పరిష్కారం కోసం.. పాఠకుల, రచయితల, శ్రేయోభిలాషుల దగ్గరకు వెళ్ళడమే ఉచితం అని తలచి మీ ముందుకు వచ్చి, విన్నపాలు విన్నవించుకుంటున్నాం!

పత్రికకు వెల కట్టడం కంటే, సంవత్సర చందా రూపంలో కనీసం ₹200/– ఉంటే ఎలా వుంటుంది?

వేలల్లో ఉన్న కథామంజరి పాఠకులలో కొంత మంది స్పందించి చందా రూపేణా, ఈ కొద్దిపాటి సహాయం అందిస్తే .. మనుగడకు ముప్పు రాదు కదా.. అనే ఆలోచన మాది. కాని ఇదే కాకుండా కథామంజరిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి, మీ అమూల్యమైన సూచనలను, సలహాలను ఆహ్వానిస్తున్నాం!

వాటిని నేరుగా submit@kathamanjari.in కు చేరవేయండి!

కథామంజరి వేసే ముందడుగులకు అవి ఉపయుక్తంగా ఉంటాయని ఆశిస్తూ..

అభివందనాలతో..

**కథామంజరి బృందం**

ఈ నెల కథామంజరి సంచికకి

చేయూతనిచ్చినవారు

ప్రముఖ రచయిత

**డా. కె. వివేకానందమూర్తి, UK.**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు

సంపాదకుడు
**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త
**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం
**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**

ప్రచురణా సహకారం
**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం
**Harbinger Publishing**

బొమ్మలు
**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వరరావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ బి.ఎస్. మూర్తి గారు
- శ్రీ అవసరాల రాఘవరావు గారు

శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి

శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి | ... ... ... ... ... ... | ii |
| కథా మార్గదర్శి | ... ... ... ... ... ... | iv |
| వినదగునెవ్వరు చెప్పిన | ... ... ... ... ... ... | vi |


## కథలు, వ్యాసాలూ


| | | | |
|---|---|---|---|
| ఎంబాడిమెంట్ ఆఫ్ లవ్ | ... | చిత్రా వెంకటేష్ ... ... ... | 1 |
| అంతస్తులు | ... | పింగళి రమణారావు ... ... | 8 |
| క్షమ | ... | తటవర్తి నాగేశ్వరి ... ... | 11 |
| చీకటిలో.. కారు చీకటిలో.. | ... | డా. చెళ్లపిళ్ల సూర్యలక్ష్మి ... ... | 15 |
| తుమ్మల్లో వెలుగు | ... | పి. వి. ఆర్. శివకుమార్ ... ... | 19 |
| బంగారు తల్లి | ... | నండూరి సుందరీ నాగమణి ... | 24 |
| మా నాన్న నేరస్థుడు | ... | కోనే నాగ వెంకట ఆంజనేయులు ... | 30 |
| సహజ నటుడు | ... | ఆదోని బాషా ... ... ... | 35 |
| తిలా పాపం... తలా పిడికెడు | ... | Ch.V.S.S. పుల్లంరాజు ... ... | 40 |
| పడమర ప్రమిద | ... | మాధురి ఇంగువ (ఇంగ్లండ్) ... | 45 |
| నాగేటి సాళ్ళలో.. | ... | జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి ... | 49 |
| సరేనా... | ... | భువనచంద్ర ... ... ... | 56 |


Cover Page Credit: Mr Victor Malyushev, Bulgaria

# కథాకీయం

దీపావళి ప్రత్యేక సంచిక కొన్ని విషయాల్లో అనుకున్న స్థాయిలో రాలేదనే పాఠకుల భావనతో మేం కూడా ఏకీభవిస్తున్నాం! అందులో ప్రధానమైనవి ముద్రారాక్షసాలు! అవే కాకుండా.. రెండు, మూడు కథల్లో కొన్ని వాక్యాలు, అటూఇటూగా వచ్చేసాయి! వాటికి సాంకేతిక పరమైన ఇబ్బందులు అని చెప్పినా సరే, ఆ పొరపాటులకు విచారిస్తున్నాం! మళ్ళీ జరగకుండా జాగ్రత్త పడుతున్నాం. గతంలో కథామంజరి రూపుదిద్దుకునే విషయాలని విపులీకరించి చెప్పినట్టు.. మొత్తం కథలు, ఇతర విషయాలన్నీ కూడా నాలుగైదు లాప్టాపుల్లో ప్రవేశించి, మార్పులు, చేర్పులు చేసుకుని, బదిలీలు జరిగేటప్పుడు.. సాఫ్ట్‌వేర్ తేడాల వలన, తప్పులు అక్కడక్కడ దొర్లుతున్నాయి. చివరి అడుగుకు ముందు, అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్ణయించుకుని, విడుదల చేసిన తర్వాత కూడా కొన్ని తప్పులు కనబడుతున్నాయి. అయితే ఈ పరిస్థితిని అధిగమించాలి! ఈ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతరం చేయూత ఇక్కడా అవసరమే!

అలాగే.. కథామంజరి ప్రారంభించినప్పుడు.. ఏడాదికి కనీసం ఓ పదిమంది యువరచయితలను తయారుచేయాలనే బలమైన ఆలోచన ఉండేది. చాలా ప్రయత్నాలు చేసాం. చేస్తూనే ఉన్నాం. ఈ మధ్య కాలంలో.. ఉత్సాహవంతులైన వారికి సీనియర్ కథా రచయితల చేత కథలు వ్రాయడానికి మెలకువలు చెప్పించి, తర్ఫీదు ఇచ్చే ఓ కార్యక్రమం అంతర్జాలంలో రూపుదిద్దాం. కాని ఓకే ఒక్కరు స్పందించారు. మా ప్రయత్న ఫలితాలు మాకు నిరుత్సాహం కలిగించలేదు సరికదా.. ఇతర మార్గాలను అన్వేషించడానికి అవకాశం వచ్చింది. ఈ పత్రిక స్థాపనలో ఉన్న ముఖ్యోద్దేశాన్ని పక్కకు పెట్టే యోచన లేదు. విజయం సాధించాలనే తపన కంటే, ప్రయత్నాలు నిరంతరం సాగాలనే ఓ దీక్ష వచ్చిందనే చెప్పాలి. ఆ కోవలో ఆలోచించి.. జనవరి 2023 సంచిక నుంచి ఓ కొత్త ప్రక్రియని ప్రారంభిస్తున్నాం. ఇది తప్పకుండా వర్ధమాన రచయితలకు, రచయిత కావాలనే వారికి ఉపయోగకరంగా ఉంటుందని, ఆ ప్రక్రియ పూర్తిగా చిరకాలం నిక్షిప్తం చేస్తే, రాబోయే తరాల వారికి కూడా అందుబాటులో ఉండగలదని ఆశిస్తున్నాం!

ఇక.. కథామంజరి ముందుకు అడుగువేసే విషయంలో కూడా ఆలోచనలు చేస్తున్నాం. కొంత ఆర్థిక బలం అవసరం కూడా కనబడుతోంది. అయితే.. ఏం చేయాలి.. అనే విషయం మీద పాఠకులు, శ్రేయోభిలాషుల అభిప్రాయాలు, సూచనలు, సహకారం కావాలని.. ఈ సంచికలోనే మా 'విన్నపాలు' విపులంగా విన్నవించుకున్నాం.

ఏది ఏమైనా.. కథను రేపటికి అందించాలి. నేటి తరంలో రచయితలను నిలబెట్టి, రేపటి తరానికి మార్గదర్శకులను చేయాలి. ఇది తెలుగు జాతికి మనుగడకు అవసరం!!

ఇది నిరంతరం సాగే కథామంజరి ఉద్యమం!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ భువనచంద్ర**

సినిమా పాటలు వ్రాసేవాళ్ళలో.. కథలు వ్రాసేవాళ్ళు బహు తక్కువ. ఎంత మంచి కథలు వ్రాసినా.. వారికి సినిమా పాటల రచయితగానే గుర్తింపు వస్తుంది. అలాంటి బహు తక్కువ సినిమా పాటల రచయితలలో.. మంచి కథారచయిత శ్రీ భువనచంద్ర గారు.

ఊరకరణం శేష పూర్ణానంద ప్రభాకర గురురాజు గారంటే 'ఆయనెవరో తెలిదని' సినిమా వాళ్ళు కూడా అంటారు. అది భువనచంద్ర గారికి బారసాల నాడు చేసిన నామకరణం. వారి తండ్రిగారు ఊరకరణం సుబ్రమణ్య శర్మగారు, తల్లి చంద్రావతి. వారిది కృష్ణా జిల్లా, నూజివీడు దగ్గర ఉన్న అగ్రహారం.. గుళ్లపూడి. మొత్తం ఎనమండుగురు పిల్లలు. మనం మామూలుగా పెద్దలని "గురువుగారు" అని పిలుస్తాం. అలాంటి పెద్దలకి రాజుగారైన ఈ గురురాజుగారు చదువులో అంతంత మాత్రమే అని ఆయన అంటారు గాని, నిజానికి పుస్తకాలు చదవడం అనే వ్యసనం ఐదో ఏట నుంచే అలవడింది. క్లాసు పుస్తకాల కంటే.. 'క్లాస్' పుస్తకాలంటే ఇష్టపడేవారు. పదో తరగతి వరకు నూజివీడులో చదివి, తర్వాత శ్రీకాకుళంలో వాళ్ల అన్నగారి పంచ చేరి, అక్కడ ఇంటర్ కానిచ్చి, హైదరాబాదులో మరో అన్న ఇంట చేరి ఇంజనీరింగ్‌లో చేరి, రెండు సంవత్సరాల తర్వాత చదువుకి కామా పెట్టి ఎయిర్ ఫోర్స్‌లో చేరిపోయారు. యుద్ధ విమానాల మధ్య కూడా పుస్తకపఠనం వదల్లేదు. హిందీ, ఇంగ్లీషు పుస్తకాలు కూడా చదామడా చదివేవారు. గడిచిన ఓ శతాబ్దకాలంలో తెలుగు రచయితలలో భారత సైనిక దళాలలో పని చేసిన వారు గాని, పని చేస్తున్న వారు గాని ఎవరైనా ఉన్నారా అని చూస్తే.. చాలా తక్కువమంది మనకు కనబడతారు. మొన్నటి తరంలో శ్రీశ్రీ గారు, ఆరుద్ర గారు, మునిపల్లె రాజుగారు.. మొదలైనవారు ఓ ఏడు ఎనిమిది మంది వరకు కొద్ది కాలం సైనిక దళాలలో పని చేసినవారే. వర్తమానంలో నలుగురైదుగురు కంటే ఎక్కువ ఉండరు. వారిలో భువనచంద్రగారు అగ్రజుడు అని చెప్పాలి. భువనచంద్ర గారు భారతీయ వాయు దళంలో 18 సంవత్సరాలు పనిచేసి, 1971 లో భారత్ పాక్ యుద్ధంలో పాల్గొని నాలుగు పతకాలను అందుకున్నారు.

ఎయిర్ ఫోర్స్‌లో రిటైర్ అయి, ఓ.యన్.జి.సి.లో ఉద్యోగంలో చేరి, అది నచ్చక మద్రాసు పోయి కలం పట్టారు. అలా ఆయన గన్ వదిలి పెన్ పట్టారు. సినిమాలకి మొదటిపాట.. 1985లో విడుదలైన "నాకూ పెళ్లాం కావాలి" సినిమాలో వచ్చింది.

భువనచంద్రగారు 3000 పైగా సినిమా పాటలు రాసిన రచయితే కాకుండా, ఆయన మంచి కథకులు, వక్త, నవలా రచయిత. ఎన్నో పుస్తకాలకు ముందు మాటలు, వెనకమాటలు.. అంటే సమీక్షలు అందించారు.

వీటితో పాటు కవితలు, ధారావాహికలు, వ్యాసాలు.. చివరికి డిటెక్టివ్ నవలలు కూడా రాసారు. వారి కలానికి తెలియని సాహితీ ప్రక్రియ లేదు. కలం నడక మొదలెడితే బులెట్ లా దూసుకుపోతుంది. వీరి కథలలో స్వాతి కథలు, మూడో సీత కథ, మాయానగరం, వాళ్ళు, మనసు పొరల్లో వంటి కథలు బాగా పాఠకుల్ని అలరించాయి. వీరి.. పాటల సంకలనాలు, కథా సంకలనాలు విరివిగా వచ్చాయి. ఇంకా వెలుగు చూడని ఎన్నో వందల పాటలు వారి డైరీలలో నిక్షిప్తమై ఉన్నాయి. ప్రస్తుతం కౌముది పత్రికలో "సర్పశిల" అనే ధారావాహిక రాస్తున్నారు.

విశ్రాంతి లేకుండా సినిమాలకి ఇంకా వారు పాటలు అందిస్తూనే ఉన్నారు. అంతేకాదు, ఇప్పుడు తమిళ తెలుగు అనువాద చిత్రాలకు ఎక్కువగా వారి పాటలు, మాటలు అందిస్తున్నారు..

ఇక వారి ఆధ్యాత్మిక ప్రయాణం గురించి చెప్పాలంటే నడిచే కర్మయోగి అని చెప్పవచ్చు. హిమాలయాలలో యోగులతో, సిద్ధులతో ఎన్నో రోజులు, నెలలు గడిపుతూ జీవిత మర్మాలను అన్వేషిస్తూ తిరిగిన వారి అనుభవాలన్నీ "వాళ్లు" అనే పుస్తకంగా మలచారు.

అన్నిటి కంటే.. ఆయన ఓ మానవతావాది. రోజూ వీధి కుక్కలకు అన్నం పెట్టడం ఇష్టం. ఆయన గట్టిగా విజిల్ వేస్తే, అవి చక్కగా తోకూపుకుంటూ వచ్చి భోజనం చేసి వేళతాయిట! ఆయన దిన చర్యలలో ఇష్టమైన పని ఇదేట!

ఇంటినిండా వేల సంఖ్యలో పుస్తకాలు! వాటిని నిత్యం చదవడం సుమారు ఓ హాబీ! పుస్తకాలు చదివిన స్ఫూర్తితో సాహిత్య రంగప్రవేశం చేసిన భువనచంద్రగారికి.. కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి గార్ల రచనలంటే ఇష్టం! ఈ సంచిక విశిష్ట అతిథిగా ఆడగ్గానే ఒప్పుకుని, ఎన్నో విషయాలు అందచేసిన భువనచంద్ర గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం!

***కథామంజరి బృందం***

# కథా మార్గదర్శి



**కీ.శే. పులికంటి కృష్ణారెడ్డి**

తెలుగు సాహితీ జగత్తులో మరో సవ్యసాచిగా చెప్పుకోబడ్డ కథకుడు, గేయరచయిత, నాటక రచయిత, రంగస్థల నటుడు, పాటగాడు.. ఇలా అన్ని సాహితీ ప్రక్రియలతో పాటు, బుర్రకథ గాయకుడిగా కూడా తెలుగువారిని అలరించిన ప్రతిభామూర్తి కీ.శే. పులికంటే కృష్ణారెడ్డిగారు. అనేక సాహితీ ప్రక్రియలో నిష్ణాతుడై, తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకున్న రచయితలలో కృష్ణారెడ్డి గారు అగ్రగణ్యులే అని చెప్పాలి. రాయలసీమ నేపథ్యంలో వీరు వ్రాసిన 200 కథలన్నీ ఆణిముత్యాలే. అందులో "నాలుగ్గాళ్ళ మండపం" కు ఓ ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. కథానికకు చెందకుండా, స్కెచ్‌కు చెందకుండా.. రెండింటిని మేళవించి జీవం పోసుకున్న ఓ క్రొత్త సాహితీ ప్రక్రియ ఈ రచన అని చెప్పాలి. ఆయన భావజాలం, ఇష్టాయిష్టాలు, చరిత్ర.. వంటి విషయాలను ప్రస్ఫుటంగా ఆ రచనలో గుప్పించారు. అదే కాదు.. ఆయన వ్రాసిన మొదటి కథ "గూడు కోసం గువ్వలు" 1962లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వచ్చింది. ఆ కథలో.. రాయలసీమ చిత్తూరు ప్రాంతంలో వచ్చిన కరువు వలన తిరుపతి వలస వెళ్ళిన ఓ కుటుంబ జీవితాన్ని ఎంతో హృద్యంగా అందించారు! అలాగే ఆయన వ్రాసిన కథలు.. కోటిగాడు స్వంతంత్రుడు, గోరంత దీపం, రాగరంజితం, లోకం నవ్వింది, వెలగని దీపాలు, శివపూజ, సబ్బు, స్వాతిచిప్ప, చెట్టంత మనిషి, తీయలేని కలుపు.. వంటి కథలన్నింటిలోనూ ఆయన ప్రత్యేకత కనబడుతుంది. అలాగే కృష్ణారెడ్డి గారి కలం నుంచి జాలువారిన వచన కవితలు, నాటికలు, శ్రావ్య నాటికలు, బుర్రకథలు, సంగీత రూపకాలు, జానపద అమ్మి పదాలు, లలిత గేయాలు.. ఒకటేమిటి అన్ని రచనలు బహుళ ప్రాచుర్యం పొందినవే. నటుడుగా ఎన్నో బహుమతులు అందుకున్న కృష్ణారెడ్డి గారు మంచి వక్త కూడా. జానపద వాఙ్మయం, నాటకరంగాల మీద మంచి పట్టున్న ఆయన ఉపన్యాసం వింటే ప్రేక్షకులు మంత్రముగ్ధులవుతారు.

1931లో చిత్తురు జిల్లా జక్కిదోన గ్రామంలో జన్మించిన కృష్ణారెడ్డి గారు ఇంటర్ చదువుతున్నప్పుడే రైల్వేలో ఉద్యోగం వస్తే, అందులో చేరి కొద్దికాలం పనిచేసి, నాటకరంగం మీద మక్కువతో ఉద్యోగం వదిలి వచ్చేసారు. చెబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ గారి దగ్గర కవిత్వంలో అ ఆ లు దిద్దుకుని, నాటక రచనలో నాగేశం గారి దగ్గర మెలుకువులు నేర్చుకుని.. ఇక వెనుకకు చూడలేదు. జీవితాన్ని పూర్తిగా సాహిత్య, రంగస్థలాలకే అంకితం చేసారు. తిరుపతి నుంచి "కామధేను" అనే సాహిత్యపత్రికను కూడా స్వీయ సంపాదకత్వంలో నడిపి, చాలామంది కవులను, రచయితలను ప్రోత్సహించారు. తరువాత కాలంలో ఆకాశవాణి,

దూరదర్శన్‌లో ఆడిషన్ కమిటి సభ్యుడుగా, సలహాదారునిగా పనిచేసారు. కృష్ణారెడ్డి గారి రచనలమీద పరిశోధనలు చేసి నలుగురు పి.హెచ్.డి.లు సాధించారు. 2005 లో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఈయనకి గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది.

రాయలసీమ కవులకు మార్గదర్శకుడుగా, రాయలసీమ రావిశాస్త్రిగా ఖ్యాతి సంపాదించుకున్న కృష్ణారెడ్డి గారు 2007 నవంబరు 19 న మరణించారు.

యాదృచ్ఛికంగా ఈ వ్యాసం కూడా అదే రోజున వ్రాయడం ఓ అదృష్టంగా భావిస్తూ, కి.శే. పులికంటి కృష్ణారెడ్డి గారికి నివాళి అర్పించుకుంటున్నాం!

*కథామంజరి బృందం*

## నవంబర్ దీపావళి కథామంజరి

దీపావళి సంచిక బాలిగారి చిత్రం ముఖచిత్రంగా ముస్తాబయ్యింది. దీపావళి పోటీలో నెగ్గిన 15 కథలతో సంచిక వచ్చింది. విభిన్న అంశాలతో రూపొందిన కథలు ఆకట్టుకున్నాయి. రచయితను ముందు వరుసలో నిలబెట్టి గ్లామర్ స్టేటస్ అద్దిననాడు తెలుగు కథ మరింత వెలుగుతుందనే హెచ్చరికలాంటి ఆశ వెలిబుచ్చిన కథాకీయం కూడా బాగుంది.

'అకాలం' కథకు సూరంపూడి గారి చిత్రం భలే నచ్చింది. కథా సారం మొత్తాన్ని ఒక చిత్రంలో గుది గుచ్చి గీశారు. మొత్తం కథల్లో మరింతగా ఆకట్టుకున్న కథలు కొన్ని ఉన్నాయి. 'ఆఖరి అంకె' గూఢమైన సంభాషణలతో ఆద్యంతం రసపట్టులో సాగింది కానీ, 'ఆశాహ దృక్పథంతో ముగించి ఉంటే బాగుండు' అనే సగటు తెలుగు పాఠకుడి అభిప్రాయం నాకూ కలిగింది. దీనితో పాటు టైటిల్ అంతగా నప్పలేదనిపించింది. 'వసంతోపాఖ్యానం' అనసూయగారి కథ సాధారణంగా రచయితలు చూసే కోణానికి భిన్నంగా సమాజంలో పలుమార్లు ఎదురయ్యే ఘటనను తీసుకొని బాగా రాశారు. ఎక్కువమంది రచయితలు పేదరికం అనగానే నీతి నిజాయితీలు, స్థితిమంతులు అనగానే అవినీతి, అన్యాయాలు అనే ఫ్రేములో పెట్టి రచనలు రాయడం పరిపాటి. కానీ అనసూయగారు రాసిన ఘటనలు తక్కువగా జరుగుతాయేమో అనిపించినా, ఆయా సంఘటన తాలూకా బాధితులకు ఇబ్బందే గదా! శరత్‌గారి 'ఆ ఇద్దరూ ...' కథ కూడా బాగుంది.

'ధ్వంస రచన' సింహ ప్రసాద్‌గారి రచన. ఇది ఫిక్షనేనా .. అనే సందేహం వచ్చింది. ఒక వేళ ఫిక్షన్ అయితే గనుక ఆయా రాజకీయ పార్టీల పేర్లు, వ్యక్తుల పేర్లు కథలో ఉండటం ఎలా సరైనది? ఒకవేళ ఫిక్షన్ కాకపోతే గనుక ఇది 'కథ' అనే ప్రక్రియకు ఎలా సూటబుల్? ఆ మాటకొస్తే ఇందులో వెలిబుచ్చిన అభిప్రాయాలన్నీ రచయిత స్వ అభిప్రాయాలే అవుతాయి గదా! అలాంటప్పుడు దీనిని వ్యాసంగా రాయడం కరెక్టేమో? ఏమో! మీరే చెప్పాలి. ఇటువంటి అంశాలతో కథ రాస్తున్నప్పుడు రచయిత తటస్థంగా ఉండి విశ్లేషణలు జరపాలి. ఒక ప్రభుత్వ నిర్ణయాలు సరైనవో కాదో తెలియాలంటే దశాబ్దాలు పడుతుంది. అదే ఆయా పార్టీల అదృష్టం. ఇక్కడైతే రచయిత ఒకే కోణంలో చూడటంవల్ల ఆయా అంశాలపై సమగ్రత రాలేదేమో అనేది నా అభిప్రాయం.

రమాదేవిగారి 'తొంభై తొమ్మిది చుక్కలు' మంచి తెలుగు పదబంధాలతో నాణ్యతతో సాగింది. కొన్ని చోట్ల అదేనండీ.... శిథిల జర్జరీత బంధం– లాంటి పదాలు వచ్చిన చోట్ల నిఘంటువు వెతుక్కున్నాను. తెలుసుకున్నాను. వారికి ధన్యవాదాలు. పాత అంశమే అయినా ముందు తరం వారు రాసినంత మంచి తెలుగు రాశారు. సత్తెమ్మ చల్లకుండ – కథాంశం బాగా వచ్చింది. ఇలాంటి సున్నితాంశాలు కథలుగా రావడం చాలా మంది వ్యక్తులకు జీవన నైపుణ్యాలు పెరగడానికి దోహదపడతాయి.

**రాంబో**

# ఎంబాడిమెంట్ ఆఫ్ లవ్

చిత్రా వెంకటేష్



✆ 9700310631

**దీపావళి 2022 కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***నన్ను క్షమించు మిత్రవిందా. కళ్ళు లేవని నీతో అబద్ధం చెప్పాను. దానికి కారణం నువ్వే. నువ్వు సంతోషంగా ఉండాలనే ఈ పనిచేశాను. ప్రతిక్షణం నీ రూపం చూసుకుని, నువ్వు ఎంత బాధపడుతున్నావో నాకు తెలుసు. అందం పోయినందుకు నువ్వు బాధపడటం లేదు. నీ వికృతరూపాన్ని చూసి నేను బాధపడ్తానని అనుకున్నావు. ఎన్నోసార్లు నీకు నచ్చచెప్పాను. నీ రూపంతో నాకు పనిలేదు... నీ మనస్సు ముఖ్యం అని!***

"మళ్ళీ ఎప్పుడు తిరిగి వస్తారు?" గోముగా అడిగింది మిత్రవింద.

"నేను వెళుతోంది విహారయాత్రకు కాదు. బిజినెస్ పని మీద వెళుతున్నాను. పని పూర్తయిన వెంటనే తిరిగి వచ్చేస్తాను. నిన్ను విడిచి నేను మాత్రం ఎలా ఉండగలను!" అన్నాడు గౌతమ్ నవ్వుతూ.

"రాత్రి ఫ్లైట్ ఎన్ని గంటలకు?" అడిగింది.

"పదిగంటలకు. అది సరే సింగపూర్ నుంచి నీకేం తీసుకురమ్మంటావు."

"ఏదైనా లేకపోతే కదా తీసుకురావటానికి. నేను అడగకుండానే అన్నీ తెచ్చి ఇచ్చారు. నాకేం వద్దు. మీరు పని పూర్తి చేసుకుని తొందరగా వచ్చేయండి.. అది చాలు!" అంది మిత్రవింద.

గౌతమ్ నవ్వి బయటకు వెళ్ళాడు. ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడటానికి వెళ్ళాడని ఆమెకు అర్థమైంది. నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది.

ఈ మధ్యనే ఇద్దరికి పెళ్ళయింది. వాళ్ళది ప్రేమ వివాహం కాదు. పెద్దలు కుదిర్చిన సంబంధం. అయినా ఇద్దరు చాలాకాలం నుంచి తెలిసినట్టు బాగా కలిసిపోయారు. ఒకరి అభిప్రాయాలు, అభిరుచులు కలుసుకున్నాయి. మనస్తత్వం కూడా దాదాపు ఒక్కటే. భార్యాభర్తలు ఏ సమస్యలు లేకుండా కలిసి ఉండటానికి అంతకంటే కావల్సింది ఏముంది!

సమయం రాత్రి ఏడు గంటలవుతుంది. ఇంకో గంటలో అతను ఎయిర్ పోర్ట్‌కు చేరుకోవాలి. అందుకే హడావిడిగా అతనికి ఫలహారం చేస్తోంది మిత్రవింద.

పైకి మామూలుగా ఉంది కాని, లోపల మాత్రం విచారంగా ఉంది. వారం రోజులలో పని పూర్తిచేసుకుని వస్తానని చెప్పాడు. ఒకవేళ అనుకున్న సమయానికి పని పూర్తి కాకపోతే ఇంకో వారం రోజులు ఉండవలసి వస్తుందని కూడా చెప్పాడు. ఆ మాటలు వినగానే మిత్రవింద గుండెల్లో రాయిపడింది. వారం రోజులు భరించటమే కష్టం అనుకుంటే మరో వారం రోజులు అని గౌతమ్ అంటున్నాడు.

'దేవుడా వారం రోజులలో ఆయన పని పూర్తయ్యేలా దీవించు. అంతకంటే నిన్ను ఏం కోరను.' అని కనిపించని ఆ దేవుడిని ప్రార్థించింది.

సరిగ్గా ఎనిమిది గంటలకు తయారయ్యాడు గౌతమ్. ఫుల్ సూటు వేసుకుని బ్రీఫ్‌కేసు సర్దుకున్నాడు. అందులో అవసరమైన ఫైల్స్, డాక్యుమెంట్స్ ఉన్నాయో లేదో చెక్ చేసుకున్నాడు. తరువాత బ్రీఫ్‌కేసు మూసి హాలులోకి వచ్చాడు. అప్పటికే టిఫిన్‌తో సిద్ధంగా ఉంది మిత్రవింద.



మౌనంగా టిఫిన్ ముగించాడు గౌతమ్. అతని ఆలోచనంతా జరగబోయే బిజినెస్ డీల్ మీద ఉంది. అనుకున్నది విజయవంతం అయితే అతని దశ పూర్తిగా మారిపోతుంది. ఇప్పుడు అతను తయారుచేస్తున్న బాల్‌బేరింగ్స్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడుతుంది. లక్షలలో ఉన్న టర్నోవర్ కోట్లను దాటుతుంది. విపరీతమైన లాభాలు కళ్ళ చూడవచ్చు. సంఘంలో పరపతి పెరుగుతుంది. అదే అతను చిన్నతనం నుంచి కోరుకుంది. ఎంత కష్టమైనా రతన్ టాటా లాగా పెద్ద ఇండస్ట్రీయలిస్ట్ కావాలి. అదే అతని జీవిత లక్ష్యం.

టిఫిన్ తిన్న తరువాత భార్య దగ్గర వీడ్కోలు తీసుకుని కారులో కూర్చున్నాడు. కిటికి లోంచి బై అని చేతులు ఊపాడు గౌతమ్. కీ ఇచ్చిన బొమ్మలాగా తను చెయ్యి ఊపింది. ఆ చర్యలో కొంచెం కూడా ఉత్సాహం కాని, సంతోషం కాని కనిపించలేదు.

క్షణం తరువాత కారు వెళ్ళిపోయింది. కారు కనుచూపు మేర దాటిపోయేంత వరకు అలాగే చూస్తూ ఉండిపోయింది మిత్రవింద. తరువాత నీరసంగా నడుస్తూ లోపలికి వెళ్ళింది. తను కూడా ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి అతనికి సెండాఫ్ ఇవ్వాలని అనుకుంది. కాని గౌతమ్ ససేమిరా అన్నాడు.

"నువ్వు బయలుదేరేసరికి బాగా రాత్రి అవుతుంది. ఆ వేళలో ఒక స్త్రీ ఒంటరిగా రోడ్డు మీద కారులో వెళ్ళటం చాల ప్రమాదం. ఈ మధ్య సిటీలో జరుగుతున్న నేరాల గురించి నీకు బాగా తెలుసు. ప్రతిరోజు టీవీలో ఏదో ఒక నేరం గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. అందుకే నా మాట విని ఇంట్లోనే ఉండు!" అని ఆమెకు నచ్చచెప్పాడు.

లోపల ఇష్టం లేకపోయినా పైకి మాత్రం సరే అంది.

చాల సేపు భర్త గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది. పదిగంటలకు భోజనానికి కూర్చుంది. కాని ఎందుకో భోజనం సహించలేదు. రెండు ముద్దలు బలవంతంగా తిని చేతులు కడుక్కుంది. తరువాత ఇంట్లోంచి బయటకు వచ్చి, గేటు కేసి చూసింది. గేటు దగ్గర వాచ్‌మేన్ బహదూర్ స్టూల్ మీద కూర్చుని సెల్ చూస్తున్నాడు. లోపలికి వెళ్ళి తలుపులు మూసి గడియ

పెట్టుకుంది. కిటికీ తలుపులు కూడా గట్టిగా బిగించింది. బెడ్‌రూంలోకి వెళ్ళి ఏసీ ఆన్ చేసి పడుకుంది.

కళ్ళు మూసుకుంది, కాని ఎంత ప్రయత్నించినా కళ్ళు మూతలు పడలేదు. మాటిమాటికి భర్త గుర్తుకు వస్తున్నాడు. అతనితో గడిపిన మధుర క్షణాలు కళ్ళముందు కనిపిస్తున్నాయి. ఆ ఆలోచనలు ఒక వైపు సంతోషం కలిగిస్తున్నాయి. ఇంకోవైపు మధురమైన బాధను పెంచుతున్నాయి. ఆ రాత్రి ఆమెకు కాళరాత్రి అయింది.

★★★

సూపర్‌బజార్లో సరుకులు కొనుక్కుని ఇంటికి చేరుకుంది మిత్రవింద. గౌతమ్ వెళ్ళి రెండు రోజులు గడిచాయి. రోజూ అతను రాత్రివేళ కాల్ చేస్తాడు. ఇద్దరు స్వీట్ నథింగ్స్ మాట్లాడుకుంటారు. ఒక్కొక్కసారి వీడియో కాల్‌లో ఒకరిని ఒకరు చూసుకుంటూ చాట్ చేసుకుంటారు. సెల్‌ఫోన్‌లో భర్త కనిపిస్తుంటే మిత్రవిందకు ఎంతో ఆనందంగా ఉంటుంది. అతని లేని ఎడబాటును మరిచిపోగలుగుతుంది.

ఆ రోజు కూడా మాములుగా భర్తకు కాల్ చేసింది.

"ఇప్పుడే నీకు కాల్ చేద్దామని అనుకున్నాను, ఈలోగా నువ్వే చేశావు. ఎలా ఉన్నావు ఏం చేస్తున్నావు?" అడిగాడు గౌతమ్.

"సూపర్‌మార్కెట్లో సరుకులు కొనుక్కుని ఇప్పుడే ఇంటికి వచ్చాను. మీతో మాట్లాడాలనిపించింది. అందుకే నేనే కాల్ చేశాను. మీరు ఎలా ఉన్నారు. బిజినెస్ వ్యవహారాలు ఎలా జరుగుతున్నాయి. అంతా సక్రమంగా అనుకున్నట్టు జరుగుతోందనుకుంటాను!" అంది మిత్రవింద.

"అంతా నేను అనుకున్నట్టుగానే జరుగుతోంది. సింగపూర్ అధికారులు నా ప్రపోజల్‌కు ఒప్పుకున్నారు. కాని దాన్ని ఫైనలైజ్ చెయ్యాలంటే ఆ కంపెనీ యం.డి. డాక్యుమెంట్ మీద సంతకం చెయ్యాలి. ప్రస్తుతం ఆయనకు ఒంట్లో బాగాలేదు. గుండెపోటుతో హాస్పిటల్లో చేరారు. చికిత్స జరుగుతోంది. ఎప్పుడు కోలుకుంటారో.. ఎప్పుడు ఆఫీసుకు వస్తారో.. ఎప్పుడు డాక్యుమెంట్స్ మీద సంతకం చేస్తారో తెలియదు. నాకయితే ఎప్పుడెప్పుడు ఈ పని అయిపోతుందా, ఎప్పుడు నీ సమక్షంలో వాలిపోతానా అని తోస్తుంది. పరిస్థితిని చూసి ఇండియా వచ్చేయాలని అనిపిస్తోంది. కాని, దాని వల్ల లాభం కంటే నష్టం ఎక్కువ. మళ్ళీ నేను సింగపూర్ వెళ్ళాల్సి వస్తుంది. అంతకంటే ఇక్కడే ఉండటం మంచిదని తోస్తుంది. రెండు రోజులు ఆలస్యం అయినా పని పూర్తి చేసుకుంటే బాగుంటుందని అనిపిస్తుంది. పైగా మాటిమాటికి వ్యాపారం అధికారులకు అప్పగించి వెళ్ళటం అంత మంచి పద్ధతి కాదు. అందుకే కొంచం ఆలస్యం అయినా పని పూర్తి చేసుకుని వస్తాను. నువ్వేం కంగారుపడకు. ఇంకా కొన్ని రోజులు ఓపికగా ఉండు. అంతా లాభసాటిగా జరుగుతుంది!" అన్నాడు గౌతమ్.

పైకి అలా అంటున్నాడు కాని లోపల అతను ఎంతగా బాధపడుతున్నాడో మిత్రవింద గ్రహించింది. ఆ విషయం అతని మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది. తను విచారంగా కనిపిస్తే అతను మరింత బాధపడతాడు. అందుకే చిరునవ్వుతో, "మరేం ఫర్వాలేదు. పని పూర్తి చేసుకుని రండి. నా గురించి ఆలోచించకండి. నేను బాగానే ఉన్నాను. రోజు రాత్రి కాల్ చెయ్యటం మాత్రం మరిచిపోకండి!" అంది.

భర్తతో మాట్లాడిన తరువాత రిఫ్రెష్ అయింది. వంటవాడిని పిలిచి ఆ రోజు వంట ఏం చెయ్యాలో చెప్పింది. ఏం తోచకపోతే కొంచం సేపు టీవీ చూసింది. అందులో జీడిపాకం లాంటి సీరియల్స్ వస్తున్నాయి. ఆమెకు తెలుగు సీరియల్స్ అంటే బొత్తిగా పడదు. కథా కమామీషు ఏం ఉండదు. ఊరికే సాగదీయటం తప్ప! అప్పుడే వంటవాడు భోజనం సిద్ధంగా ఉందని చెప్పాడు.

భోజనం చేసి మళ్ళీ టీవీ అన్ చేసింది. ఛానల్స్ తిప్పుతూ కొన్ని ప్రోగ్రాంలు చూసింది. తరువాత చివరగా సోనీ ఛానల్ పెట్టింది. అందులో అప్పుడే క్రైమ్ పెట్రోల్ సీరియల్ వస్తుంది. ఈ రోజు ఎపిసోడ్ చాలా బాగుంది. మొదటి సన్నివేశం నుంచి చివరివరకు ప్రతీ సంఘటన చాల ఉత్కంఠతో సాగింది. చివరి సన్నివేశం వరకు దర్శకుడు సస్పెన్స్ మెయింటెయిన్ చేశాడు.

ఎపిసోడ్ పూర్తి అయ్యేసరికి పదకొండు అయింది. లైట్లు ఆఫ్ చేసి బెడ్‌రూంలోకి వెళ్ళింది. కిటికీ దగ్గర నిల్చుని బయటకు చూసింది. ఆకాశంలో చంద్రుడు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. వెన్నముద్దలా ముద్దుగా ఉన్నాడు. గాలి చల్లగా వీస్తోంది. చంద్రుడి వైపు చూస్తూ చాలాసేపు గడిపింది. తరువాత వెళ్ళి పడుకుంది. కొన్ని నిమిషాల వరకు ఆమెకు నిద్రపట్టలేదు. ఎంత ప్రయత్నించిన కళ్ళు మూతలు పడలేదు. గౌతమ్ ఎడబాటుతో అతలాకుతలం అయింది. ఇక చేసేదిలేక హోమియో మందు కాళి ఫాక్స్ మాత్రలు నాలుగు మింగి కళ్ళు మూసుకుంది.

పది నిమిషాలలో గాఢనిద్రలోకి జారుకుంది. ఉదయం తిరిగి కళ్ళు తెరిచేసరికి ఏడుగంటలు కావస్తోంది. అప్పుడే వంటవాడు కాఫీ ట్రే తీసుకువచ్చి టీపాయ్ మీద పెట్టాడు. రిఫ్రెష్ రూములోకి వెళ్ళి మొహం కడుక్కుంది. ప్రతి రోజు అద్దంలో తనని తాను చూసుకోవటం మిత్రవిందకు అలవాటు. ఎప్పుడూ తాజాగా చెరగని అందంతో భర్తకు ఎదురుపడుతుంది. ఆమెను చూసి అతను ఆనందపడతాడు. అతని ఆనందం చూసి ఆమె సంతోషిస్తుంది. అందుకే ఈ రోజు కూడా అద్దంలో తనని తాను చూసుకుంది.

అంతే తలమీద పిడుగు పడినట్టు ఒక్కసారిగా అదిరిపడింది.

ఇది తన మొహమేనా అని అనుమానం వేసింది ఆమెకు.

ఇది కల కాదు కదా! అనుకుని కళ్ళు నలుపుకుని చూసింది. సందేహం లేదు. అది కల కాదు. నిజమే. ఆమె కుడి చెంప మీద ఎర్రగా ఏదో మచ్చలాంటిది కనిపించింది. కొంపదీసి ఏదైనా పురుగు కాని కాటేసిందా లేకపోతే అలర్జీనా. మెల్లగా వేలితో ఆ మచ్చను తాకింది. నొప్పి కాని, దురద కాని అనిపించలేదు. భయంతో ఉక్కిరిబిక్కిరి అయింది మిత్రవింద.

★★★

“భయపడవలసింది ఏం లేదు. చిన్న ఎలర్జీ అంతే. మందులు రాసి ఇస్తాను. ఒక వారం రోజులు వాడండి!” అన్నాడు ఆమె ఫ్యామిలీ డాక్టర్.

బొమ్మలా తలూపింది మిత్రవింద. ఆమె మైండ్ పూర్తిగా బ్లాంక్ అయిపోయింది. ఉన్నట్టుండి ఈ ఉపద్రవం ఏమిటో ఆమెకు అర్థం కావటంలేదు. తన అందం ఆకర్షణ పోయిందని మిత్రవింద బాధపడటం లేదు. గౌతమ్ పరిస్థితి తలుచుకుని ఆందోళన పడుతోంది. ఆమె అందమైన మొహం అంటే అతనికి చాల ఇష్టం. రోజుకు కనీసం ఒక్కసారయినా ఆమె మొహాన్ని తన చేతులతో తాకుతాడు. ఒక అపురూపమైన దృశ్యం చూస్తున్నట్టుగా తదేకంగా చూస్తాడు. అప్పుడు అతని కళ్ళలో కనిపించే ఆరాధన చెప్పటానికి వీలులేదు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఆమె అందమైన మొహాన్ని చూడటం అలవాటుగా మార్చుకున్నాడు. దాని వల్ల తనకు అంతా మంచే జరుగుతుందని గాఢంగా నమ్ముతున్నాడు అతను.

అలాంటిది మచ్చలతో నిండిన మొహాన్ని చూడటానికి ఇష్టపడతాడా. నిజానికి అతను అసహ్యించుకోడు... విపరీతంగా బాధపడతాడు. తన భార్య మొహం ఇలా మారిపోయిందే అని లోపల కుమిలిపోతాడు. పైకి మాత్రం ఈ విషయాన్ని చాలా మామూలుగా తీసుకుంటాడు. పెద్దగా పట్టించుకున్నట్టు కనిపించడు. డాక్టర్ ఏమో ఇంకో వారం రోజులలో తగ్గిపోతుందని

చెప్పాడు. గౌతమ్ సింగపూర్ నుండి వచ్చేలోగా తగ్గిపోతే అదే పదివేలు అనుకుంది మిత్రవింద.

అందుకే క్రమం తప్పకుండా డాక్టర్ ఇచ్చిన మందులను క్రీమ్ లను వాడింది. కాని కొంచెం కూడా మెరుగు కనిపించలేదు. పైగా ఎక్కువ అయింది. మందులు ఆ మచ్చల మీద కొంచం కూడా ప్రభావం చూపించకపోగా ఇంకా ఆ మచ్చలను పెరిగేలా చేశాయి. ఇప్పుడు ఆ మచ్చలు మొహం నిండా వ్యాపించాయి. నున్నగా తెల్లగా ఏ మచ్చలేని ఆమె మొహం ఇప్పుడు వికృతంగా మారిపోయింది. అద్దంలో మొహం చూసుకుని విపరీతంగా కుమిలిపోయింది.

అయినా భర్తకు ఈ విషయం చెప్పటానికి ఆమె కొంచెం కూడా సందేహించలేదు. రోజూ వీడియో ఛాటింగ్ లో కనిపించేది. కాని తన మొహంలో బాధ కనిపించకుండా జాగ్రత్తపడేది. ఆశ్చర్యంగా గౌతమ్ కూడా పెద్దగా స్పందించలేదు. ఆ విషయాన్ని చాలా క్యాజువల్ గా తీసుకున్నాడు.

“బాధపడకు మిత్రవిందా. అదే తగ్గిపోతుంది. దాని గురించి పెద్దగా వర్రీకాకు. పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనస్సు పాడుచేసుకోకు. నేను సింగపూర్ నుంచి వచ్చిన తరువాత మంచి డెర్మటాలజిస్ట్ దగ్గరకు తీసుకెళతాను. మెడికల్ ఫీల్డ్ ఎంతో అభివృద్ధి చెందింది. స్టోన్ ఏజ్ నుంచి స్పేస్ ఏజ్ వరకు వచ్చేం. క్యాన్సర్, ఎయిడ్స్ లాంటి మహమ్మారి వ్యాధులకు మందులు కనిపెడుతున్నారు. ఈ చర్మ వ్యాధి లెక్కలోనిది కాదు. అందుకే నువ్వేం భయపడకుండా ధైర్యంగా ఉండు. నేను వచ్చిన తరువాత మంచి డాక్టర్ దగ్గరకు తీసుకెళతాను!” అని ప్రోత్సాహకరంగా మాట్లాడాడు.

భర్త మాటలతో తేరుకుంది మిత్రవింద. తన పరిస్థితిని చూసి భర్త విపరీతంగా బాధపడతాడని అనుకుంది. కాని అతను బాధపడకుండా ప్రోత్సహిస్తూ మాట్లాడాడు. జరిగినదంతా సర్వసాధారణం అన్నట్టు చెప్పాడు. క్రమం తప్పకుండా డాక్టర్ చెప్పిన మందులు వాడింది. కాని కొంచెం కూడా ఫలితం కనిపించలేదు. ఆ మచ్చలే కాకుండా మొహం కూడా నల్లగా మారిపోయింది. తన మొహం అద్దంలో చూసుకోవటానికి కూడా ఇష్టపడలేదు మిత్రవింద.

ఆ రోజు యథాప్రకారం వీడియో కాల్ చేసింది.

నవ్వుతూ కనిపించాడు గౌతమ్. ఆ రోజు అతను చాలా సంతోషంగా ఉన్నాడు. అతను అనుకున్నట్టుగానే అంతా జరిగింది. సింగపూర్ అధికారులతో సమావేశం విజయవంతంగా ముగిసింది. అగ్రిమెంట్ కూడా దాదాపు పూర్తయింది. ఇక సంతకాలు చెయ్యటమే తరవాయి. ఆ విషయం చెప్పినప్పుడు గౌతమ్ కళ్ళలో మెరుపు మిత్రవింద స్పష్టంగా చూడగలిగింది.

అనుకున్న పనిలో విజయం సాధించినప్పుడు మాత్రమే అలాంటి మెరుపు కళ్ళలో కనిపిస్తుంది.

“నీకు ఒక శుభవార్త. వచ్చేవారం ఇండియా వచ్చేస్తాను. వచ్చేటప్పుడు నీకు ఏం బహుమతి తీసుకురమ్మంటావు?” అడిగాడు.

“నాకేం వద్దండి. అడగకుండానే అన్నీ ఇచ్చారు. మీరు క్షేమంగా తిరిగివస్తే చాలు. అంతకంటే నేను ఇంకేం కోరుకోను!” అంది.

“సెంటిమెంట్ గా మాట్లాడకు. అందం పోయినంత మాత్రాన జీవితం చేజారిపోయినట్టు కాదు. జీవితంలో అందం ఒక భాగం మాత్రమే.. అదే జీవితం కాదు! నువ్వు ఎలా ఉన్నా నాకు అందంగానే ఉంటావు... నా ప్రేమ, నీ పట్ల ఆరాధన కొంచెం కూడా తగ్గదు! జరిగింది మరిచిపో. నేను వచ్చేసరికి నవ్వుతూ నాకు కనిపించాలి... లేకపోతే బాధపడతాను!” అన్నాడు ఛలోక్తిగా.

ట్యాబ్ మూసి వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది! భర్త మంచితనం, ప్రేమ ఆమె భరించలేక పోతుంది. ‘ముందు ఉన్న అందం

నీలో లేదు మిత్రవింద. నాకు చాల బాధగా ఉంది. నీ మోహం చూడటానికి భయం వేస్తుంది' అని అంటే.. ఆమె మనస్సు కొంచెం తేలికపడేది. కానీ.. ఇంత పెద్ద ఉపద్రవం జరిగినా ఏం జరగనట్టు ప్రవర్తిస్తున్నాడు. అదే తట్టుకోలేకపోతోంది మిత్రవింద.

★★★

చెప్పినట్టుగానే వారం రోజుల తరువాత తిరిగి వచ్చాడు గౌతమ్. సందిగ్ధంగానే అతనికి ఎదురు వెళ్ళింది మిత్రవింద. కారులోంచి దిగిన గౌతమ్‌ను చూసి నిర్ఘాంతపోయింది. అతని కళ్ళకు నల్ల కళ్లజోడు ఉంది. చేతిలో గుడ్డివాళ్లు పట్టుకునే కర్ర ఉంది.

"ఏమైందండీ!" అంది ఆందోళనగా.

"నెల రోజులకు ముందు సింగపూర్‌లో కళ్ళవ్యాధి వ్యాపించింది. ఆ వ్యాధి సోకినవాళ్ళలో చాల మందికి కంటిచూపు పోయింది. వారం రోజులకు ముందు నేను బాగానే ఉన్నాను. అగ్రిమెంట్ మీద సంతకం చేసి హోటల్‌కు చేరుకున్నాను. ఏమైందో ఏమో తెలియదు. కళ్ళనుంచి విపరీతంగా నీళ్ళు కారటం మొదలుపెట్టింది. అప్పటికే రాత్రి చాలా పొద్దుపోయింది. ఆ టైంలో డాక్టర్స్ ఎవరు దొరకరు. అందుకే ఉదయం వెళ్ళాను. ఆయన చూసి ఏం ఫర్వాలేదు ఈ డ్రాప్స్ వాడండి తగ్గిపోతుంది!" అన్నాడు.

"రెండు రోజులు వాడేసరికి నా కంటిచూపు పూర్తిగా పోయింది. కళ్ళముందు ఏం కనిపించటం లేదు. దాంతో మళ్ళీ డాక్టర్‌ను కన్సల్ట్ చేశాను. ఆయన మళ్ళీ చూసి మీకు ఆ కంటి వ్యాధి వచ్చిందని అందుకే చూపు పోయిందని చెప్పాడు. ఇదీ జరిగింది మిత్రవిందా!"

ఆ మాటలకు పూర్తిగా కదిలిపోయింది మిత్రవింద. ఏడుస్తూ అతన్ని గట్టిగా కౌగలించుకుంది.

★★★

ఆ సంఘటనతో మిత్రవింద విశేషంగా మారిపోయింది. తన గురించి బాధపడటం పూర్తిగా మానేసింది. భర్తను కంటికి రెప్పలా చూసుకోవటం మొదలుపెట్టింది. చాలా రోజుల తరువాత ఆమె సంతోషంగా, ఆనందంగా ఏ వత్తిడి లేకుండా కనిపించింది. ఒకరోజు ఇంటికి సరుకులు తీసుకురావటానికి కారులో సూపర్‌బజార్‌కు వెళ్ళింది. వస్తున్నప్పుడు అనుకోకుండా యాక్సిడెంట్ జరిగింది. ఆ ప్రమాదంలో మిత్రవింద చనిపోయింది. సరిగ్గా ఆమె చనిపోయిన వారంరోజుల తరువాత మిత్రవింద ఫోటోకు దండవేసి తన కళ్ళకు వేసుకున్న నల్ల జోడును తీసి అవతల పెట్టాడు. చేతిలో ఉన్న స్టిక్‌ను అవతల పారేశాడు. భార్య పోయిన తరువాత ఇప్పుడు దీని అవసరం లేదు.

మెల్లగా తన గదిలోకి వెళ్ళాడు. బల్లమీద ఉన్న భార్య ఫోటో వైపు తదేకంగా చూశాడు. రెండు చేతులు జోడించి "నన్ను క్షమించు మిత్రవిందా. కళ్ళు లేవని నీతో అబద్ధం చెప్పాను. దానికి కారణం నువ్వే. నువ్వు సంతోషంగా ఉండాలనే ఈ పని చేశాను. ప్రతిక్షణం నీ రూపం చూసుకుని, నువ్వు ఎంత బాధపడుతున్నావో నాకు తెలుసు. అందం పోయినందుకు నువ్వు బాధపడటం లేదు. నీ వికృతరూపాన్ని చూసి నేను బాధపడతానని అనుకున్నావు. ఎన్నోసార్లు నీకు నచ్చచెప్పాను. నీ రూపంతో నాకు పనిలేదు... నీ మనస్సు ముఖ్యం అని! అయిన నేను అబద్ధం చెప్తున్నానని అనుకున్నావు. అందుకే ఈ నాటకం ఆడాను. నేను గుడ్డివాడిని అయితే నిన్ను చూసే అవకాశం నాకు లేదు. అలాంటప్పుడు నువ్వు బాధపడే అవకాశం కూడా రాదు. నేను ఊహించినట్టుగానే జరిగింది. నా కళ్ళు పోయినందుకు ముందు బాధపడ్డావు. తరువాత సంతోషపడ్డావు. యాక్సిడెంట్ జరిగేంత వరకు నీ మోహం గురించి పూర్తిగా మరిచిపోయావు. నాకు సేవలు చెయ్యటంలో బిజీ అయిపోయావు. దానివల్ల

నీకు వేరే ఆలోచనలు రాలేదు. సమయం చూసి ఈ నాటకం ముగించాలని అనుకున్నాను. కాని ఈ లోగా నువ్వే జీవితాన్ని ముగించావు! అందుకే ఈ నిజం ఇప్పుడు చెప్పుతున్నాను...” అని ఇంకా ఏదో మాట్లాడబోయాడు. కాని విపరీతమైన దుఃఖంతో అతని నోరు పెగలలేదు. గొంతుకు ఏదో అడ్డం పడినట్టు మాట బయటకు రాలేదు. కాని కళ్ళు మాత్రం పూర్తిగా తడి అయ్యాయి. వెక్కి వెక్కి ఏడుస్తూ మంచం మీద కూలిపోయాడు.

★★★★★

# అంతస్తులు

పింగళి రమణారావు



✆ 9949694396

**దీపావళి 2022 కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***"ఇది నువ్వుండే కాంప్లెక్సేనా? ఇక్కడికి నా బాస్‌గారి కొడుకునీ, భార్యా, ఇద్దరు పిల్లల్నీ విజయనగరం నుంచి తీసుకు వచ్చాను. వాళ్ళు లోపలికి వెళ్ళి పది నిముషాలైంది. కాంప్లెక్స్ ఆవరణలో ఇతరుల కారు పార్క్ చేయకూడదని వాచ్‌మేన్ చెప్పడంతో, వాళ్ళు దిగి లోపలికి వెళ్ళిన తర్వాత, ఇలా బయటకు వచ్చి, కారు పార్క్ చేసి కాళ్ళ గుదుళ్ల తీర్చుకోవడానికి నిల్చున్నాను."***

'స్టేటస్' అనే ఆంగ్లపదానికి ఆంగ్ల–తెలుగు నిఘంటు గ్రంథకర్తలైన శంకరనారాయణగారు 'ఉండవలసిన గౌరవము, హోదా, కొందరు వ్యక్తుల వర్గములో కొన్ని హక్కుల, హద్దుల పరిధిలో ఒక వ్యక్తి యొక్క చట్టబద్ధ స్థితి' అని వివరణ ఇచ్చారు. దిగువ హోదాల్లో పదివేల రూపాయల దిండుకుర్చీలలో కూర్చునే అధికారులకన్నా, ఒక సంస్థ యొక్క యజమాని కర్ర కుర్చీలో కూర్చున్నా.. ఆయన హోదా నిర్ద్వందంగా అందరికంటే పెద్దదే. దేశాధ్యక్షుడి మొదలు కుటుంబ పెద్ద వరకూ వారి వారి పరిధిల్లో ఈ నిర్వచనం వర్తిస్తుంది. కుర్చీ బాధ్యత, తదనుగుణమైన అధికారమూ ఆ కుర్చీలో కూర్చునే వ్యక్తికి జాతి, మత, కుల, లింగ భేదాలు లేకుండా సంక్రమిస్తాయి. అక్షరంముక్క రాని పలుకుబడి మనుషులు వేదికమీద ఉంటే వారి హోదా విద్యాధికులున్న ప్రేక్షకుల సమూహం కంటే ఎక్కువే కదా!

విదేశాలకిపోయి,తలకిందులుగాతపస్సుచేసి,ఆయాదేశాలపౌరసత్వంసంపాదించి,అక్కడస్థిరపడిపోయి,మాతృదేశంలోని లోపాలు ఎత్తిచూపుతూ దూషణలు చేసే కొంతమందీ, మాతృదేశమ్మీద లేదా అంతకు మించి మాతృభాష మీద సహజ లేదా కపట క్లేశము ప్రకటిస్తూ, భారతీయ సనాతన ధర్మాలమీద మిడిమిడి జ్ఞానంతో కొంతమంది ఆంగ్లంలోనూ, మరికొందరు వారి మాతృభాషలోనూ పుస్తకాలు ప్రచురిస్తూనే ఉంటారు. పత్రికల్లో వ్యాసాలూ, ఉత్తరాలూ రాస్తూనే ఉంటారు. వాట్సాప్లో, ముఖపుస్తకంలో సందేశాలు పెడ్తూనే ఉంటారు. అభివృద్ధిగాంచిన ప్రాక్పశ్చిమ దేశాలకు వలస వెళ్ళిన భారతీయుల హోదా, భారతపౌరుల హోదా కంటే ఎక్కువన్న ఓ సర్వసాధారణమైన భావన మనదేశంలోని యువతమీద, ముఖ్యంగా మూర్ఖులైన తల్లిదండ్రులమీద, ఓ భ్రాంతిమయమైన, దట్టమైన ముసుగు కప్పివేసిందనుకోవడం సత్యదూరం కాదు.

ఆ రోజు శనివారం.

స్నానాదులు ముగించి, ఉదయపు ఉపవాస భంగం చేసి, మొదటి కోవకు చెందిన ఓ పుస్తకం చదువుతూంటే, 'కాసులు కురిపిస్తేకాని కాయితాలు కదలని దేశమా? దేశంలో ఇంత అవినీతి పేరుకు పోయిందా? ఇన్ని మానభంగాలు జరుగుతున్నాయా? ఇక్కడ మతసహనం లేదా? లౌకికవాదం లేదా? మన భారతీయులు విదేశాలకి వెళ్లి, అక్కడి వేష భాషలకి అలవడి, జన్మ దేశ సంప్రదాయాలకి స్వస్తి పలికి, ఇలాంటి పుచ్చకాయ కబుర్లు చెప్పే బదులు ఇక్కడకి తిరిగివచ్చి దేశాన్ని ఉద్ధరించవచ్చుగా?' అనిపించింది. ఆలోచనలో పడి, తెరిచిన పేజీని అలాగే ఉంచేసి బుర్ర గోక్కుంటున్న సమయంలో శ్రీమతి

గదిలోకి వచ్చి, "లెండి లెండి. ముందు గదిలోకి పోయి కాస్త బల్లలూ, కుర్చీలూ, టెలివిజన్, అవీ దుమ్ము లేకుండా గుడ్డతో తుడవండి!" అని కంగారు పెట్టేసింది.

"ఎప్పుడూ లేనిది ఎందుకీ తొందర?" పుస్తకం పక్కన పెడ్తూ లేచాను.

"నేను కాలేజీ చదువులు చదువుతూండగా నా సహ విద్యార్థిని అయిన 'రంగా బండారం,' ఆమె భర్తా, ఇద్దరి పిల్లలతో అమెరికానుంచి వచ్చి, మొన్న నేరుగా విజయనగరం అత్తారింటికి వెళ్ళిందట. వాళ్ళు విజయనగరం నుంచి ఇక్కడకి మనింటికి వస్తున్నారు. ఇక్కడ లంచ్ చేసి రంగా పుట్టింటికి అనకాపల్లికి వెళ్లిపోతార్ట! అప్పుడే బయలుదేరి అరగంటయిందట! మీరు ప్రశ్నలు మాని త్వరగా లేవండి మరి!"

"పనిమనిషి రాలేదా?" ప్రశ్నించాను.

"ఆవిడగారికి ఇటువంటి పనులు చెబ్తే చేస్తుందికాని, ఒకటి రెండు వస్తువులకి గాయాలు తప్పవు. అదీకాక ఆవిడగారు నిన్ననే .. ఈ రోజు పనికి రానని, నా అనుమతి తీసేసుకొంది. ఒకసారి సెలవు తీసుకున్న తర్వాత, ఆవిడగారు సెల్ ఫోన్ ఛస్తే ఎత్తదు."



"మన దేశ దూషణ చేస్తున్న ఓ ప్రవాస భారతీయుడు రాసిన పుస్తకం చదువుతున్నాను. కనిష్కనో, అనుష్కనో తుడవమని చెప్పు!" అన్నాను.

"వాళ్ళిద్దరూ మీరు కొత్తగా కొనిచ్చిన సెల్‌ఫోన్లు పట్టుకొని, ఎవరి గదుల్లో వారు తలుపులు గడియ వేసుకొని అఘోరిస్తున్నారు!"

"తమరు........?"

"వంట చెయ్యాలి"

"ప్రతి రోజూ మా అమ్మే చేస్తుందిగా? ఇవ్వాళ ఏమొచ్చిందని?"

"మీ అమ్మగారి వంటకు వంకలు పెట్టలేను కానీ, వాళ్ళకి ఉప్పూకారాలు అసలు పడవు. అలవాటు తప్పిపోయిందట. అందుకని నేనే నడుము కట్టాను. మనం సింగపూర్ వెళ్లినప్పుడు కొన్న క్రోకరి సెట్ ని మీ అమ్మగారు డైనింగ్ టేబుల్ మీద సర్దుతున్నారు. ఇంకా పైపై ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పుడే బయలుదేరిపోయారని చెప్పానుగా.. కదలండి మరి!"

గృహసంబంధితమైన కొన్ని విషయాలలో గృహిణి స్థాయి ఎక్కువే మరి. ఆతిథ్యం ఆవిడ ఆవరణ. నేను లేస్తేగాని ఆవిడ కదలదు. ఆ దుమ్ము దులుపుడుతో ఏదైనా ముక్కలవుతే అదో పెద్ద సమస్య. కానీ తప్పదు. లేచి ఆ పని జాగ్రత్తగా పూర్తిచేశాను.

అంతలో శ్రీమతి మళ్ళీ హడావుడిగా వచ్చింది. "ఏదైనా స్వీటు చేద్దామన్నా సమయం లేదు. మీరు లడ్డుగోపాల్ దుకాణం నుంచి

పెద్ద సైజు బందరు లడ్డూలు ఒక కిలో, క్యారట్ హల్వా ఒక కిలో పట్టుకు రండి. ఇదిగో బ్యాగ్!" అని మళ్ళీ వంటగదిలోకి తుర్రుమంది.

నేను నా స్కూటర్ తీసుకొని బయలుదేరి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లడ్డూగోపాల్ నేతి మిఠాయిల దుకాణానికి పోయి, శ్రీమతి చెప్పిన ఆ రెండూ, కిలో చొప్పున ఇమ్మని చెప్పి, అరకిలో చొప్పున వేరు చెయ్యమన్నాను. అవే కాక, నాకిష్టమైన వేయించిన జీడి పప్పు ఓ పావుకిలో తీసుకొని, వెయ్యి ఏభై రూపాయల బిల్లు నా డెబిట్ కార్డుతో చెల్లించి, మొత్తం అయిదు అట్టపెట్టెల్నీ సంచిలో సర్దుకొని మా కాంప్లెక్స్ చేరాను. ఆవరణ గేటు బయట ఎడమ పక్కగానున్న వేపచెట్టు కింద ఓ కారు కనిపించింది. కారు పక్కనే నిల్చుని దమ్ము పీలుస్తున్న వ్యక్తిని చూస్తూనే బండాపి, "ఒరేయ్! కృష్ణా! ఎంతకాలమైందిరా నిన్నుచూసి! ఏమిటిలా వచ్చావు? పద లోపలికి, కబుర్లు చెప్పుకొని లంచ్ చేసి వెళ్దువుగాని!" అన్న నా అసంకల్పితమైన లేదా తక్షణమైన ఆశువు మాటలు చాలు, కృష్ణకీ నాకూ ఉన్న స్నేహంగురించి చెప్పడానికి... గతంలోకి వెళ్ళి పేరాలు పేజీలూ వ్రాయనక్ఖర్లేదు.

"ఇది నువ్వుండే కాంప్లెక్సేనా? ఇక్కడికి నా బాస్‌గారి కొడుకునీ, భార్యా ఇద్దరు పిల్లల్నీ విజయనగరం నుంచి తీసుకు వచ్చాను. వాళ్ళు లోపలికి వెళ్ళి పది నిముషాలైంది. కాంప్లెక్స్ ఆవరణలో ఇతరుల కారు పార్క్ చేయకూడదని వాచ్‌మన్ చెప్పడంతో, వాళ్ళు దిగి లోపలికి వెళ్ళిన తర్వాత, ఇలా బయటకు వచ్చి, కారు పార్క్ చేసి కాళ్ళ గుదుళ్లు తీర్చుకోవడానికి నిల్చున్నాను."

"అయితే వాళ్ళు వచ్చింది మా యింటికే! ఆవిడా, నా శ్రీమతీ కలిసి కాలేజీలో చదువుకున్నారట!" అన్నాను. అప్పుడే ఎడం కన్ను అదిరింది.

"లంచ్ చెయ్యమని నువ్వు ఆహ్వానిస్తే అంతకంటే ఏముంది? నలభీమ పాకాల్ని మరిపించే మీ అమ్మగారి చేతివంట తిని ఎన్ని రోజులైందో! ఇప్పుడా అదృష్టం నాకు లేదు. నేను చేసేది డ్రైవరు ఉద్యోగం. నువ్వు నన్ను లోపలికి తీసుకువెళ్ళితే, నా యజమాని కొడుక్కీ, కోడలికీ నచ్చదు. నాకు ఇబ్బందికరంగా ఉండడమే కాకుండా, నువ్వు కూడా ఇబ్బందిలో పడ్తావు. నేను విజయనగరం నించి మా బాస్‌ని తీసుకొని తరుచూ వస్తూనే ఉంటాను. ఒక్కోసారి ఆయన డాల్ఫిన్ హోటల్లో బస చేస్తూంటాడు. అప్పుడు వచ్చి నిన్ను కలుస్తాను. లోపలికి వెళ్ళు. వాళ్ళు నీ కోసం ఎదురు చూస్తూంటారు!"

'పోనీలే, ఈ రోజు ప్రత్యేకంగా వంతెన వీరభద్రరాజుగారి ఆరోగ్య సూత్రాల ప్రకారం వంట చేసేది నా శ్రీమతి!' అని అందామనుకున్నా..ఆ మాటలు బయటకి రాలేదు. సంచిలో ఉన్న జీడిపప్పు పెట్టె వాడి చేతిలో పెట్టి, ఆవరణలోపల నా కారు పక్కన స్కూటర్ స్టాండ్ వేసి, ఆరో అంతస్తులో ఉన్న నా ఫ్లాట్‌కి పోయాను.

కృష్ణ విజ్ఞత ముందు నా సంస్కారం వాల్తేరు స్టేషన్ పక్కగా పోయే మురుక్కాలవలో మునిగిపోయిందని బాధపడ్తూ 601 ఫ్లాట్ కాలింగ్‌బెల్ నొక్కాను.

★★★★★

# క్షమ

తటవర్తి నాగేశ్వరి



✆ 9989773549

**దీపావళి 2022 కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.**

***"వద్దు సర్... పెళ్లయిపోతే నా గురించి ఆలోచించడం అతడు మర్చిపోతాడు. ఎక్కడో ఒక దగ్గర పెళ్ళి చేసుకొని బ్రతుకుతుందిలే, నాకు దరిద్రం వదిలిపోయింది అనుకుంటాడు! క్షమ పేరుతో జీవిత కాలం అతడికి శిక్ష వేస్తాను.. ఏ న్యాయస్థానాలు వేయని శిక్షవేస్తాను!"***

వసుధ.. రామారావును ఎందుకు క్షమిస్తుందో ఎవరికీ అర్థం కాదు!

రామారావు వసుధను మోసం చేసాడు.

ఆడవాళ్ళకు పెళ్లైందని చెప్పడానికి కాళ్లకి మెట్టెలు, మెడలో మాంగల్యం వుంటుంది. మగవాడికి అలాంటివేవీ వుండవు. రామారావు పెద్ద కష్టపడకుండానే వసుధ అతడి ట్రాప్‌లో పడింది. ఇద్దరికీ కోర్టులోనే ఉద్యోగం. వసుధ టైపిస్ట్. అతడు కోర్ట్ క్లర్క్. పెళ్లైన ఏడాదికే వసుధ భర్త కాలం చేశాడు. తను 'సింగిల్" అని తెలుసుకున్న రామారావ్ వలపుబాణాలు వేశాడు. తన మీద ప్రత్యేక శ్రద్ధ, అసక్తి చూపడంతో వసుధ సులువుగానే లొంగిపోయింది.

నెల తప్పింది. ఆకాష్‌కి జన్మనిచ్చింది. పెళ్లి మాట దేవుడెరుగు. అతడు ఆమె ఇంటికి రావడమే మానుకున్నాడు. ఆఫీసు టైమ్‌లో ఎలాగూ కన్పించక తప్పదు కాబట్టి కనబడుతున్నాడు. కానీ, అపరిచితుడుగానే వ్యవహరిస్తున్నాడు.

"నన్నెందుకు పెళ్లి చేసుకోవూ?" అడిగిందొకసారి.

"దానికి మా ఆవిడ ఒప్పుకోవాలిగా.." అన్నాడు తెగేసి.

వసుధ గుండె పగిలింది. "నీకు పెళ్ళైందా?" అడిగింది .

"పెళ్లికాని పెళ్లి.. తనతో సుఖమూ, సంతోషమూ లేదు!" మళ్లీ డ్రామా మొదలెట్టాడు.

"అయితే?" అంది.

"నీతో కాపురం చేయలేను... డైవోర్స్ ఇవ్వు.. ఇంకొక పెళ్లి చేసుకుంటానని అడిగా! ఆత్మహత్య చేసుకుంటాను తప్ప డైవోర్స్ ఇవ్వనని అంది. దాంతో నిన్ను పెళ్లి చేసుకోవడానికి దారులు మూసుకుపోయాయి!" చెప్పాడు.

"మరి బిడ్డకి జన్మని ఎందుకు ఇచ్చావు?" అడిగింది.

"కాపురం చేశాక పిల్లలు పుడుతారుగా!" అన్నాడు.

"ఆమెతో తెగతెంపులు చేసుకోకుండా నన్ను అక్కడిదాకా ఎందుకు తీసుకెళ్లావ్?" నిలదీసింది.



"నువ్వంటే ఇష్టం. ప్రేమ కూడా! పరిస్థితుల ప్రభావంలో పడిపోయాను!" చెప్పాడు.

"లేదు. నన్ను మోసం చేశావ్. పెళ్లి కాలేదని చాలాసార్లు చెప్పావ్" అంది నిలదీస్తూ.

"నిన్ను పొందడానికి నేను అలా చెప్పక తప్పలేదు." చెప్పాడు.

"పోలీస్ స్టేషన్‌లో కేసు పెడతా.." అంది కోపంగా.

"కోర్టులో పని చేస్తున్నావు .. నీకా మాత్రం తెలీదా! నాకేం ఉరిశిక్ష వేయరు. కొన్ని రోజులు జైల్లో వేస్తారు. జాబ్ నుండి సస్పెండ్ చేస్తారు. పర్వాలేదు. నీకు నేను చేసిన అన్యాయానికి ఆ మాత్రం శిక్ష పడడం న్యాయమే!" అన్నాడు.

"అన్నింటికి తెగించారా?" అంది కోపంగా.

"లేదు వసూ.. వాస్తవాలు చెబుతున్నాను!" చెప్పాడు.

"నిన్ను పోలీసులకు పట్టివ్వననే కదా నీ ధైర్యం.." అంది.

"అలాగని ఏమీలేదు! నీ హక్కుల కోసం నువ్వు ఎక్కడిదాకా అయినా వెళ్లవచ్చు. లేదా నాతో అవగాహనకి రావచ్చు!" చెప్పాడు.

"ఆకాష్‌ని ప్రపంచానికి ఏమని పరిచయం చేస్తావ్?" అడిగింది కోపంగా.

"వాడు నన్ను నాన్నా అనే పిలుస్తాడు. వాడి మంచి చెడ్డలు చూసుకుంటా. మంచి స్కూల్లో వేస్తాను!" అన్నాడు.

"స్కూల్ రికార్డుల్లో నీ పేరు రాస్తావా?" అడిగింది.

ఒక నిమిషం తేరిపార చూసి, "వై నాట్! రామారావులు భూగోళంలో చాలామంది వుంటారు. వాడి తండ్రి రామారావు నేనే అని ఎవరికైనా అరిచి చెప్పాలా?" అన్నాడు.

చెంప ఛెళ్ళుమనిపించింది.

చెంప రుద్దుకుంటూ "డోంట్ బి ఎమోషనల్ వసుధా! కాంట్రావర్సీ ఎందుకు? వాడ్ని ప్రయోజకుడ్ని చేద్దాం. ఇబ్బంది రానంత వరకూ వాడి పేరెంట్స్ మీటింగ్‌కి కూడా వస్తాను. వాడికి తండ్రిగా ఏ లోటుకూడా లేకుండా చేస్తాను!" చెప్పాడు.

"నాన్న మనతో ఎందుకు వుండడం లేదని వాడు అడిగితే?" అంది.

"డాడీకి క్యాంపులు వుంటాయని చెప్పు!" చెప్పాడు.

"అబద్ధాలు బాగా నేర్చావ్..." అంది.

"నేర్వలేదు. పరిస్థితులు నన్నిలా మాట్లాడిస్తున్నాయి!" చెప్పాడు.

వసుధ రాజీపడింది.

కాలం గడిచింది. ఆకాష్‌కి ఇప్పుడు అన్నీ తెలిసిపోయాయి.

"అతడిపై కేసు పెడదాం అమ్మా!" అన్నాడు.

"పెడితే కోర్టులు వేసిన శిక్షతో జైల్లోనే కన్ను మూస్తాడు." అంది.

"నిన్ను ఇంత బాధకు గురి చేసిన వ్యక్తిని క్షమించేస్తావా అమ్మా?" అడిగాడు.

"ఇరవై ఏళ్లుగా క్షమిస్తూనే వున్నాను కదా నాన్నా!" అంది.

వసుధలో దుఃఖం పెల్లుబికింది. గతం ఆమె కళ్ళముందు కదలాడింది.

ఒకరోజు..

తనకి ట్రాన్సఫర్ అయిందని చెప్పాడు. అతడు కావాలని ట్రాన్సఫర్ చేసుకుంటే తప్ప.. ఎవరూ ట్రాన్సఫర్ చేయరు. వచ్చిన జడ్జీలందరితో మంచిగానే వుంటాడు. అదే అడిగింది.

"నేనే చేసుకున్నా.. నీగురించి వసంతకి తెలిసింది!" చెప్పాడు.

"తెలిస్తే?" అంది నిస్సహాయంగా.

"కోర్టు దగ్గరకొచ్చి పంచాయితీ పెడతానంది. ఇంక సిచ్యుయేషన్ ఎలా వుంటుందో ఊహించుకో! నాన్నే మా మధ్య పంచాయితీ చేశాడు. ట్రాన్సఫర్ చేసుకోమని సలహా ఇచ్చాడు!" చెప్పాడు.

"ఆమె కోసం ట్రాన్సఫర్ చేసుకున్నా అని చెప్పావ్ మరి నాకోసం ఏం చేస్తావ్?" నిలదీసింది. తలవంచుకున్నాడు రామారావ్.

"ఏమీ చేయలేవు.. చేయవు కూడా!" అంది.

"అధైర్య పడకు... వీకెండ్‌లో ఏదో ఒక కారణం చెప్పి నీ దగ్గరకి వస్తాను!" అన్నాడు.

"రాకు.." అంది కోపంగా.

"నా ధర్మాన్ని నన్ను నిర్వర్తించనివ్వు వసూ! నా కొడుకు ఆలనా పాలనా నన్ను చూసుకోనివ్వు!" చెప్పాడు. "ఏదీ వారాని కొకసారా?" అంది వ్యంగ్యంగా.

"నువ్వు ఎలా అనుకున్నా ఫర్వాలేదు." చెప్పాడు.

వసుధ మౌనం వహించింది!

ఆ తర్వాత వారాని కొకసారి రావడం మొదలు పెట్టాడు. అది నాలుగు వారాలకోసారి అయ్యింది. ఆ తర్వాత ఆరునెలలు అయింది. ఫోన్ చేస్తే.."నాన్నకి ఆరోగ్యం బాగాలేదు. వసంతకి కూడా ఆరోగ్యం సహకరించడం లేదు." చెప్పాడు.

వసుధ జీవితం నరకమయింది. ఒంటరి జీవితంలో ఆకాషే ఆమెకి ఆలంబనం అయ్యాడు. అంతా అర్థమయ్యాక తల్లి పట్ల

అతడిలో సానుభూతి పెల్లుబికింది.

“ఎన్ని యుగాలయినా ఇలా మగవాళ్లని క్షమిస్తూనే వుంటారా అమ్మా! వాళ్లు కళ్లు తెరుచుకునేదెప్పుడూ?” అడిగాడు.

“మీ నాన్న తనకి తానే శిక్ష వేసుకున్నాడురా..” అంది వసుధ. ఆకాష్ ఆశ్చర్యంగా చూశాడు.

“ఇద్దరి స్త్రీల మధ్య నలిగిపోయి బి.పి, షుగర్‌వ్యాధి తెచ్చుకున్నాడు. అతడి భార్య దగ్గర న్యూన్యతాభావంతోనే తలదించుకొని బ్రతికాడు. అతడి ముసలి తల్లిదండ్రుల దగ్గర గౌరవం కోల్పోయాడు. అతడు పని చేస్తున్న ఆఫీసులో కూడా ఇద్దరి పెళ్లాల ముద్దుల మొగుడు అని నవ్వుతూ అతడ్ని హేళన చేస్తూ మాట్లాడడం నాకు తెలుసు!” చెప్పింది.

తల్లి వైపు అయోమయంగా చూశాడు. అప్పట్లో జడ్జి ముకుందరావ్ తనని ఛాంబర్‌కి పిలిపించాడు. న్యాయమూర్తిగా ఆయన ఇచ్చే తీర్పు జనాంతికం. ధర్మాత్ముడే..

“వసుధా.. రామారావు నిన్ను మోసంచేసి తల్లిని చేశాడని తెలిసింది. నువ్వు కేసు పెడితే... వాడికి తక్కువలో తక్కువ ఏడేళ్ళు జైలు శిక్ష పడేలా చేస్తాను.” చెప్పాడు.

“వద్దు సార్!” అంది.

“ఎందుకనమ్మా?” అని అడిగాడు.

“బ్రతికినంతకాలం క్షమ పేరుతో అతనికి శిక్ష వేయాలనుకుంటున్నాను సర్..” చెప్పింది.

“నువ్వు చాలా మంచి అమ్మాయివి! నాకు తెలిసిన లాయర్ వున్నాడు. అతనికి ఇటీవలే భార్య చనిపోయింది. నా మాట మీద బాగా గౌరవం వున్న వాడు. నిన్నూ, నీ బిడ్డను స్వీకరించేలా వివాహం ఏర్పాటు చేయమంటావా తల్లీ..” అడిగాడు.

“వద్దు సర్... పెళ్లయిపోతే నా గురించి ఆలోచించడం అతడు మర్చిపోతాడు. ఎక్కడో ఒక దగ్గర పెళ్ళి చేసుకొని బ్రతుకుతుందిలే, నాకు దరిద్రం వదిలిపోయింది అనుకుంటాడు! క్షమ పేరుతో జీవితకాలం అతడికి శిక్ష వేస్తాను.. ఏ న్యాయస్థానాలు వేయని శిక్షవేస్తాను!” అని చెప్పి, న్యాయమూర్తి ముకుందరావ్ ఛాంబర్‌నుండి హుందాగా బయటకి వచ్చింది.

“క్షణికావేశం, వయస్సు, వేడి అనుకొనే మగాళ్లకి ఇలాంటి శిక్షే పడాలి!” బలంగా అనుకుంది వసుధ.

ఇరవై ఏళ్ల క్రితం ఒకరాత్రి ఫోన్ వచ్చింది. అపరిచిత మహిళ స్వరం. నేను వసంతని” చెప్పిందా స్వరం. “చెప్పండి” అంది గిల్టీగా వసుధ.

“ఆయన నిద్ర పోతున్నారు. నేను కారిడార్‌లో కూర్చొని మాట్లాడుతున్నాను. పెళ్లైందని చెప్పకుండా మిమ్మల్ని ఈయన తల్లిని చేశారని తెలిసింది. మీరు చాలా మంచి అమ్మాయని తెలిసింది. ఈయన కూడా మీ విషయంలో బాధపడుతూనే వున్నారు. ఇప్పుడు చేయగలిగింది ఏమీ లేదు. మీ పరిస్థితిని దృష్టిలో వుంచుకొని నేను ఒక రాజీ ప్రతిపాదన తీసుకొస్తున్నాను. అందరం కలిసే వుందాం. మూడురోజులు ఆయన మీ దగ్గర వుంటాడు...”

వసంత మాటలు అడ్డుకొని “వద్దు..” చెప్పింది వసుధ.

ఇదంతా మళ్లీ ఇప్పుడు గుర్తొచ్చింది వసుధకి.

★★★★★

# చీకటిలో.. కారు చీకటిలో..

డా. చెల్లపిల్ల సూర్యలక్ష్మి



✆ 9445184363

**దీపావళి 2022 కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.**

***ఈ మాటు కూడా ఒక స్థాయిలో ఆమెకి ఊపిరి ఆడలేదు. అయినా దానిపై ధ్యాస పెట్టకుండా, కళ్ళు గిరగిర తిరుగుతున్నా పట్టించుకోకుండా, తన కర్తవ్యం గుర్తు చేసుకుంది. అధః పాతాళానికి చేరువైనప్పుడు ఊపిరి శబ్దం కోసం చెవులు రిక్కించింది. వినీ, వినిపించనట్టు వినవచ్చే ఉచ్ఛ్వాస నిశ్వాస రాగం ఆమె చెవులని చేరగానే అటువైపుకి ఊగింది. ఆమె చేతులకి ఏమీ అందలేదు.***

పైకి ఎక్కే ముందు ఆమె గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఒకప్పుడు ఎత్తు నుండి కిందకి చూస్తే తిరిగే కళ్ళు, ఇప్పుడు గాల్లో మొగ్గలు వేసినా ఏమీ కానంత బలపడ్డాయి. ట్రెపీజ్ ఆర్టిస్ట్ అంటే మాటలా? ఎన్నాళ్ళ సాధనకి ఫలితమో కదా ఈ పరిపూర్ణత!

అంతేనా? ఒక్కసారి చెయ్యో, కాలో విరిగితే, నయమవడానికి నెల రోజులు.. భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న భయంతో కొన్నాళ్ళు, ధైర్యం తెచ్చుకోవడానికి మరి కొన్ని రోజులూ.. ఇలా వృధా అయిపోతుంటాయి!

జంతువుల క్రీడావిన్యాసాలకి అడ్డుగోడ ఎదురైనా, కేబుల్ టీవీలు, షాపింగ్ మాల్స్ లాంటివి వచ్చినా, ఇంకా జనాలు సర్కస్‌లు చూస్తున్నారంటే ఇలాంటి సాహసోపేతమైన విన్యాసాల కోసమే!

నూతి ఒరలపై సైలెన్సర్ లేని మోటార్ బైక్ నడిపే మొనగాడు, ఒక ట్రెపీజ్ నుండి మరో దానిపైకి మొగ్గలేసుకుంటూ గెంతే తనలాంటి వాళ్ళూ, వింత వస్త్రాలు ధరించే బఫూన్లు.. సర్కస్ కళాకారుల పొట్ట నింపడానికి ఉపయోగపడుతున్నారు.

మెచ్చుకోలు ఎవరికి చేదు! కానీ, నిజమైన మెచ్చుకోలు ఎక్కడుంది! పైగా, జీవితం అక్కడితో ఆగదు. చిన్నపిల్లలు తమ విన్యాసాలు చూసి ముగ్ధులైతే, టీనేజ్ కుర్రాళ్ళు, మగాళ్ళూ జన్మలో ఆడవాళ్ళని చూడనట్టు, అమ్మాయిలకేసి రెప్పలు వాల్చకుండా, నోరు వెళ్ళబెట్టి అదో రకంగా చూస్తారు. అదెంత మాత్రమూ గౌరవంగా తనకి తోచదు. వెకిలి చూపులు, కాంక్ష నిండిన కళ్ళు.. తరువాత తన శీలంపై అడ్డదిడ్డమైన వ్యాఖ్యలు. తాను నిప్పని తనకు తెలుసు, కానీ ఈ వంకర బుద్ధున్న మగవాళ్ళుంటారే.. వాళ్ళ కన్నా అడవిలో జంతువులే మేలేమో.. అని కోపం వచ్చినప్పుడు వాళ్ళని తిట్టుకునేది ఆమె.

తన సంపాదనపై ఆధారపడ్డ తన తల్లిని, తమ్ముణ్ణి గుర్తుకు తెచ్చుకుని, తన నిస్సహాయతను గుర్తు చేసుకుని, వెకిలి చూపులు చూసేవారిని పట్టించుకుంటే పొట్టకూడు దొరకదని గ్రహించి, తన పని చేసుకుపోతోందామె.

పైగా, తనేమైనా ఒక ఊళ్ళో స్థిరపడాలా ఏం? దేశదిమ్మరిలా ప్రతీ రెండు నెలలకీ ఊళ్ళు మారాలి గాని! ఇలాంటి వాళ్ళని పట్టించుకుంటే ఇంక తాను మొగ్గలు వేసినట్టే! తాను సాహసంతో చేసే ఈ పనిలో గౌరవం లభించకపోవడంతో, ఆమెకు భవిష్యత్తు అంధకార బంధురంగా తోచింది.

★★★

ఎర్రటి బల్బ్ వెలుగుతూ, సైరన్ మోగుతున్న వి.ఐ.పీ కార్లో ప్రయాణిస్తున్న ప్రణవ్, తన మనసుని మథిస్తున్న చిక్కుప్రశ్నపై దృష్టి సారించి, జవాబు దొరకక, భృకుటి ముడి వేశాడు. అదే సమయానికి పక్కగా వెళ్తున్న ఆటో వెనుక అంటింపబడిన సర్కస్ పోస్టర్‌ని, దానిపై నవ్వుతూ దర్శనమిస్తున్న ఆమె ముఖాన్ని చూడడం తటస్థించింది. సమస్యకి పరిష్కారం దొరికినట్టు రిలీఫ్ ఫీల్ అయ్యి, వెంటనే మొబైల్లో తన వాళ్ళతో ఏదో మాట్లాడాడు.

మరి కొద్ది సేపట్లో బోలెడన్ని గదులు దాటుకుని ప్రణవ్ గదిలోకి ఆమె ప్రవేశించింది. సర్కస్ ఓనర్ కూడా వచ్చాడు. ఎందుకు తమని ఇంత పెద్దవాళ్ళ దగ్గరకి తీసుకుని వచ్చారో తెలియక ఆమె మనసు వ్యాకులపడింది. కొంపదీసి ఈ పెద్దమనిషి కూడా మిగతా మగవాళ్ళలాగానేనా? ఏదో భయం వేసింది. 'పొట్ట చేత్తో పట్టుకు దేశమంతా సంచరించే తమబోటి వాళ్ళకి రక్షణ ఉండదా? వేరే దారి ఉండదా?' అని ఆమె మనసు ఆక్రోశించింది.



ప్రణవ్ వాళ్ళని కూర్చోబెట్టి, విషయం చెప్పాడు. ఆ పని చేయడానికి కొన్ని గంటలే మిగిలి ఉన్నాయని న్యూస్‌పేపర్ రిపోర్ట్‌ల సహాయంతో ఆమెకు విశదీకరించాడు.

"నువ్వు ఈ పని సరిగ్గా చేస్తే, సర్కస్‌లో చప్పట్లు కాదు, ప్రపంచంలోని మనుషులంతా నిన్ను మెచ్చుకుంటారు. ఫెయిల్ అయ్యావంటే నీ ప్రాణం నిలబడొచ్చు, నిలబడకా పోవచ్చు. మీ సర్కస్‌కి చెడ్డ పేరూ రావచ్చు. నిన్ను ఈ పని చేయమని బలవంతపెట్టలేను. అలాగని, నిన్ను అర్థించకుండానూ ఉండలేను. ఓ పది నిముషాల్లో ఆలోచించి చెప్పు!" అన్నాడు ప్రణవ్.

ఆమె, సర్కస్ ఓనర్ అతనికి నమస్కరించి బయటకి వెళ్తుండగా, "ఒక ఉదాహరణ.. స్కైడైవింగ్ చేసేటప్పుడు పారాషూట్ తెరుచుకునేందుకు ఒకే ఒక అవకాశం ఉంటుంది. అది తెరుచుకోలేదంటే మనుషుల ప్రాణాలు పోవచ్చు. లేదా వాళ్ళు అవిటి వాళ్ళవ్వచ్చు! అందుకని మొదటిసారే నీకు బెస్ట్ ఛాన్స్! దాన్నే 'రైట్ ఫస్ట్ టైమ్' అంటారు. అలాగని ప్రతీసారీ అలా అవుతుందని కాదు. నీ నిర్ణయం కోసం వేచి ఉంటాను!" అన్నాడు.

★★★

ఆమెకి బోలెడన్ని ఆలోచనలు!

సర్కస్‌లో ఎన్ని ఫీట్లు చేసినా, జనాలలో గుర్తింపు ఉండదు సరికదా, వచ్చిన ప్రేక్షకుల గలీజు మాటలే గతి! కానీ, సర్కస్‌లో ప్రాక్టీస్ ఉంటుంది. ఇప్పుడు చేయబోయేది అలవాటు లేని పని. పైగా.. తప్పు చేసి, సరిదిద్దుకోవడానికి ఆస్కారం లేదు కూడా.

విజయం.. వీరస్వర్గం.. రెంటిలో ఒకటే సాధ్యం!

కర్ర విరగకుండా, పాము చావకుండా ఉండడం కుదరని పని! ఇంత రిస్కీ పని చేయడం అవసరమా.. అని ఆలోచించింది. తనకేమైనా అయితే తన తల్లి, తమ్ముడు గతేమిటి? వాళ్ళకి తిండి ఎలా దొరుకుతుంది? పది నిముషాల్లో ఆమె మనసు పరిపరి విధాలుగా ఆలోచించింది.

తరువాత ప్రణవ్ దగ్గరకు వెళ్ళి, “సార్, నాకేమైనా అయితే, మా అమ్మ, తమ్ముడు.. వీళ్ళకి సాయం చేస్తారా?” అని అడిగింది.

“ఎంత కావాలేంటి?” అడిగాడు ప్రణవ్.

“మా అమ్మ బతికుండేంత తిండి, మా తమ్ముడు ప్రయోజకుడయ్యేంత చదువు” తడుముకోకుండా చెప్పిందామె.

ఆమెకు తన కుటుంబం పట్ల ఉండే అభిమానానికి ముచ్చటేసింది ప్రణవ్‌కి.

“నీకేమీ కాకపోయినా కూడా వాళ్ళ బాధ్యత నాది. ఇంతకీ, ఈ సాహసపు పని చేస్తావా, లేదా?” అడిగాడు అతను.

“చేస్తాను గనుకనే కదా, ఇన్ని అనుమానాలు వెలిబుచ్చాను!” అంది ఆమె కాస్త బెరుకుగా.

★★★

వాళ్ళ సూచన మేరకు ఒక ఖాకీ ప్యాంటు, చొక్కా వేసుకుని తోలు బెల్టు పెట్టుకుందామె. ఆ తోలు బెల్టుకి ఒక పెద్ద కొక్కెం తగుల్చుకుని, అంధకారంలోకి తన సాహసయానం మొదలుపెట్టింది. చొక్కా కాలర్‌కి ఒక మైక్ తగిలించారు ఆమెకు. “ఎప్పుడైనా ఊపిరాడకపోతే చెప్పు!” అన్నారు వాళ్ళు.

ఆమె తలకిందులుగా తన పయనం సాగించింది. కన్నుపొడుచుకున్నా వెలుగు జాడ లేని చిమ్మ చీకటి ఆమెని స్వాగతించింది. వెయ్యివాట్ల వెలుగులో తను ట్రెపీజ్ మీద వేసే మొగ్గలెక్కడ? ఈ నల్లని పరిసరాల్లో పాతాళానికి ప్రయాణం కడుతున్నట్టనిపించిన ఈ సాహసమెక్కడ? ఈ లోగా ఎక్కడో లౌడ్‌స్పీకర్‌లో ఘంటసాల వారి పాట.. ‘చీకటిలో.. కారు చీకటిలో..’ మార్మోగుతూ, ఆమెను ఇంకా భయపెట్టింది. కొన్ని అడుగులు దిగిందో లేదో ఊపిరి ఆడడం మానేసింది. మైక్‌లో పైకి లాగమని ఆమె అభ్యర్థించింది.

బయటికి వచ్చి, నోరు తడుపుకుని, ఎక్కువ నీళ్ళు తాగకుండా జాగ్రత్తపడి, మళ్ళీ గబ్బిలపు ప్రయాణం మొదలుపెట్టింది. ప్రణవ్ మాటలు, ‘రైట్ ఫస్ట్ టైమ్’, ఆమెను వెంటాడి వేధించాయి. మొదటిసారి ఫెయిల్ అవడం వల్ల తాను తలపెట్టిన మంచి పని జరగనట్టేనా అనుకుంది, భయపడింది కూడా! ఉహూఁ, ఒకసారి ఫెయిల్ అయినందువల్ల చేతులెత్తేస్తే, తను ట్రెపీజ్ ఆర్టిస్ట్ అయ్యేదా అసలు? అని తనకు తానే ధైర్యం తెచ్చుకుంది.

పుంజుకున్న చైతన్యంతో ఆమె కిందకి దిగుతుంటే, మళ్ళీ అదే పాట ఆమెకు వినవచ్చింది. ఈ మాటు దాన్ని పట్టించుకోకుండా, చాలా లోతుగానే దిగింది గానీ, వెతకబోయింది చేతికి చిక్కినట్టే తప్పించుకుంది. కాస్సేపు దేవుళ్ళాడి, మళ్ళీ పైకొచ్చి గాలి పీల్చుకుంది. ఇప్పుడు ఆమెలో ఉత్సాహం రెట్టింపయ్యింది. తను విజయానికి, వెలుగుకి అతి చేరువలో ఉందని, వచ్చే మాటు ఎలాగోలా గెలిచి తీరాలని.

ఈ మాటు కూడా ఒక స్థాయిలో ఆమెకి ఊపిరి ఆడలేదు. అయినా దానిపై ధ్యాస పెట్టకుండా, కళ్ళు గిరగిర తిరుగుతున్నా

పట్టించుకోకుండా, తన కర్తవ్యం గుర్తు చేసుకుంది. అధః పాతాళానికి చేరువైనప్పుడు ఊపిరి శబ్దం కోసం చెవులు రిక్కించింది. వినీ, వినిపించనట్టు వినవచ్చే ఉచ్ఛ్వాస నిశ్వాస రాగం ఆమె చెవులని చేరగానే అటువైపుకి ఊగింది. ఆమె చేతులకి ఏమీ అందలేదు.

"నన్ను ఇంకాస్త కిందకి దించండి" అని ఒగరుస్తూ అరిచిందామె. కిందకి దిగాక ఆమె చేతులు వృత్తాకారంలోని అన్ని ప్రదేశాలనీ తడిమాయి. ఎట్టకేలకు, ఒక మూల తన ప్రయత్నం ఫలించింది. కానీ, తన చేతులకందిన విధంగా పైకి తీసుకుని వస్తే ఏ మధ్యలోనో ఇరుక్కుపోవడం ఖాయం.

అందుకని తన చుట్టుకొలత మించని విధంగా పట్టుకోవడానికి ఒక మూడు నాలుగు సార్లు కష్టపడింది. మధ్యలో తలకిందులుగా ఆ ఊగుడొకటి, కళ్ళు తిరుగుడు మరొకటి, ఊపిరి ఆడకపోవడం మరో పెద్ద ఇబ్బంది. వీటన్నిటికీ వెరవకుండా, కాగల కార్యం మీద మనస్సుని లగ్నం చేసి, కృతకృత్యురాలయ్యింది.

★★★

కొంతసేపటికి, మీడియా వాళ్ళతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రణవ్, "నిన్న బోరు బావిలో పడ్డ పసికందుని ప్రాణాపాయం లేకుండా, ఒక కొత్త పద్ధతిలో బయటకు తీశాం. సన్నగా ఉన్న పధ్నాలుగేళ్ళ అమ్మాయి రాణి, తన ప్రాణాలకు తెగించి, రెండొందల అడుగుల బావిలోకి తలకిందులుగా దిగి, అట్టడుగున ఉన్న ఆ పిల్లాణ్ణి ఎటువంటి దెబ్బలూ తగలకుండా జాగ్రత్తగా బయటకు తీసింది. ఆమె వృత్తి రీత్యా ట్రెపీజ్ ఆర్టిస్ట్. సర్కస్లో పనిచేసే వాళ్ళని చిన్న చూపు చూసే ఈ సమాజం, ఇకనైనా వారిని గౌరవిస్తుందని ఆశిస్తున్నాను!" అన్నాడు.

మరుసటేడు గణతంత్ర దినోత్సవంలో అత్యంత ధైర్యసాహసాలు కనబరిచిన బాలికగా, మిగిలిన సాహస బాలలతో, ఏనుగు అంబారీ ఎక్కి ఊరేగి, ప్రతిష్ఠాత్మక 'గీత చోప్రా పురస్కారా'న్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుంది రాణి. ఆమె గురించి తెలుసుకున్న ఒక క్రీడాసంస్థ ఆమెకు జిమ్నాస్టిక్స్‌లో శిక్షణనిచ్చి, ప్రోత్సహించే పనిని చేపట్టింది.

★★★

ప్రణవ్ తన మాట మీద నిలబడడం వల్ల, తన వాళ్ళ మీద బెంగ తగ్గి, మనసు మరింత గట్టిగా లగ్నం చేసి, జిమ్నాస్టిక్స్ నేర్చుకుంది ఆమె. మరో రెండేళ్ళలో ఒలింపిక్ క్రీడలలో జిమ్నాస్టిక్స్‌లో బంగారు పతకం పొందిన తొలి భారతీయురాలిగా రాణి ఖ్యాతికెక్కింది. ఆ సందర్భంగా మాట్లాడుతూ, "మా నాన్నగారి మరణం మా జీవితాలని తారుమారు చేసింది. పొట్టపోసుకోడానికి ట్రెపీజ్ ఆర్టిస్ట్‌ని అయ్యాను. ఆ చాకచక్యం వల్ల మరో ప్రాణం నిలబడుతుందని అప్పట్లో నాకు తెలియదు! నా చేత చీకట్లో సాహసయత్నం చేయించిన జిల్లా కలెక్టర్‌గారికి నేను ఋణపడి ఉంటాను. ఆయన నాకిచ్చిన భరోసా వల్లే, ఆ రోజు ఆ సాహసం చేసి, ఈ రోజు ఈ విజయంతో మీ ముందు నిలుచునున్నాను! " అని, ఒక్క నిమిషం ఆగి, "నా విజయాలకి పునాది మాత్రం నా సర్కస్ ది గ్రేట్!" అంటూ గర్వంగా అడుగు ముందుకు వేసింది ఝాన్సీ రాణి.


★★★

*(కొన్ని సంవత్సరాల క్రితం విదేశాలలో బోరు బావిలో పడ్డ చిన్నారిని ఒక సన్నటి అమ్మాయి బయటకు తీసినట్టు ఒక వీడియో చూశాను. ఆ స్ఫూర్తితోనే ఈ కథ వ్రాశాను).*

★★★★★

# తుమ్మల్లో వెలుగు

పి. వి. ఆర్. శివకుమార్



✆ 87792 58589

**దీపావళి 2022 కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.**

***తీరని కసితో రెండు కొమ్మలనూ అతడి మీదకే విసిరికొట్టిన మైసమ్మ వెనక్కి తిరిగి, బలమంతా కాళ్లలోకి తెచ్చుకుని, పులి తరుముతున్న లేడిలా పరుగు ప్రారంభించింది. పావుగంటకి తన ఇంటిముందుకి చేరుకుని, వగరుస్తూ గుమ్మంలో కూలబడిపోయింది. రెండు నిమిషాల ఎగశ్వాస తరవాత నెమ్మదిగా లేచి, నిలబడింది.***

పదిగంటలు దాటిన రాత్రివేళ.. గుండెలు గుబగుబలాడుతుండగా, నెమ్మదిగా లేచింది మైసమ్మ. అయిదేళ్ళ మమత ఇంకా నిద్రపోలేదు. పక్కమీదనుంచి లేచిన తల్లికేసి చూసింది.

“పాపా…” మైసమ్మ గొంతులో దుఃఖం సుడులు తిరిగింది. తమాయించుకుని చెప్పింది,

“నేను కొద్దిసేపు బయటకు వెళ్ళి వస్తాను. కొద్దిసేపే. నువ్వు చెల్లిని చూసుకుంటూ ఉంటావు కదూ.”

“అమ్మో… ఇప్పుడా!” మమత కళ్ళనిండా భయం.

“ఇప్పుడే వెళ్లాలమ్మా. తొందరగా వచ్చేస్తాను. తలుపు గడియపెట్టుకో. నేను తప్ప ఎవరైనా వచ్చి, పిలిచినా తీయబోకు.” భయంగానే తల ఊపింది మమత.

జ్వరంతో మూలుగుతున్న మూడేళ్లు నిండని చిన్నకూతురు ప్రతిమ నుదుటి మీద ముద్దు పెట్టుకుని, కన్నీళ్లని ఆపుకుంటూ, బయటకు నడిచింది మైసమ్మ.

పున్నమి వెళ్ళిన మసక రాత్రులు. వీధిదీపాల గుడ్డి వెలుతురు ఆ మసక చీకట్ల ముందు వెలవెలబోతోంది.

ఊరి బయటకు దారి తీసే బాట పక్కన ఆగింది మైసమ్మ. నెమ్మదిగా పల్లంలోకి దిగింది. పొదల వెనక్కి వెళ్లింది.

చెట్లు కనుపించని చీకట్లలో, గుప్పెడు తెగింపుని చీరె చెంగున మూట కట్టుకుని, దోసెడు ధైర్యాన్ని తోడు తీసుకుని రెండునిముషాల్లో బయటకు వచ్చి, బీళ్ళ దారి పట్టింది. గతుకుల దారిలో తడబడుతున్న అడుగుల ప్రయాణం.

‘ఇంతకన్నా సజావుగా సాగిందా ఏనాడన్నా బతుకు బండి?’ నవ్వుకోబోయింది మైసమ్మ. భయంతో పెదాలు విచ్చుకోలేదు.

★★★

ఇరవైయేళ్ళ వయసులోనే, తల్లీ, తండ్రీ లేని తనని, వదిలితే అంతే చాలని, మంచీ, చెడూ విచారించకుండా తక్కువ కట్నంతో వచ్చిన సంబంధం స్థిరపరచి, పెళ్లి చేసేశాడు అన్నయ్య. ఆ తరవాత వెనుదిరిగి చూసిన పాపాన పోలేదు.

'నీ అందాన్ని ఎర వేసి, చవగ్గా కట్టబెట్టాడు' అంటూ అనుక్షణం సాధించే అత్తా, వేళకి తింటూ, పనీ పాటా లేకుండా తిరిగే భర్తా! తప్పనిసరి సంసారం చేస్తూ నాలుగేళ్లలో ఇద్దరు పిల్లలకి తల్లి అయింది మైసమ్మ. తాగిన మైకంలో ఒకనాడు, సంబంధంలేని ఊరివాళ్ళ తగాదాల్లో తలదూర్చిన భర్త, కత్తిపోట్లకు బలి కాగా, ఆ వార్త వింటూనే గుండెపోటు వచ్చి ప్రాణం వదిలింది అతడి తల్లి.

మైసమ్మకి మిగిలింది పసికందులతో వంటరి జీవితం. పాతికేళ్ళ ప్రాయం. పట్టలేనంత అందం. మరెవరికైనా వరాలుగా ఉండే ఆ రెండూ ప్రమాదాలే మైసమ్మకి. ముళ్ళకంపమీద బట్ట తీసుకున్నంత జాగ్రత్తగా జీవితాన్ని చిరగకుండా నడుపుకోవలసిన పరిస్థితి.



సానుభూతి చూపిస్తూ, మంచీ చెడూ కనుక్కునే నెపంతో తరుచూ వచ్చే రుద్రనాయుడు, మాటలతో వేధించటం దాటి, ఈమధ్య పరోక్షమైన బెదిరింపులకి కూడా దిగుతున్నాడు. ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉండే ఇల్లు. మొదటి నుంచీ ఇరుగు పొరుగుతో సత్సంబంధాలు లేని కుటుంబం. మైసమ్మ పట్ల అంతో ఇంతో సానుభూతి ఉన్నా, రుద్రనాయుడు పంచాయితీ ప్రెసిడెంట్ కావటంతో, 'అతడిని ఆకర్షించటం మైసమ్మ తప్పు' అన్నట్టు చూస్తూ, ఎవరికి వారు పట్టనట్లే ఉండిపోయారు.

స్వంత ఇల్లు, కౌలుకిచ్చిన నాలుగైదు కుంచెల పొలం ఉన్నాయి గనుక, పై ఆధరువుగా దొడ్లో కాయకూరలు పండించుకుంటూ, ఓ పూట తినీ, ఓ పూట తినకా గుట్టుగా గడుపుకొస్తోంది జీవితం. తనని తను కాపాడుకుంటూ, అసిధారా వ్రతం చేస్తున్న ఇటువంటి పరిస్థితులలో, పసిపిల్ల అనారోగ్యం! ఒంటిమీద పేలాలు వేస్తే, పేలిపోయే జ్వరంతో ఉంది మూడేళ్లు నిండని ప్రతిమ. ఒకరోజు తగ్గితే, ఒక రోజు తిరగబెడుతోంది జ్వరం. వారంరోజులుగా ఇదే స్థితి. ప్రభుత్వఆసుపత్రి మందులు పనిచేస్తున్నాయో లేదో తెలియటం లేదు. అంతకన్నా గత్యంతరమూ కనబడటం లేదు. అయినవాళ్ళు ఎవరూ లేని మైసమ్మకి తన దుఃఖాన్ని ఎవరితో పంచుకోవాలో తెలియటం లేదు.

★★★

వెనుకగా ఎవరిదో అడుగుల చప్పుడు. ఆలోచనలు వదిలి, గిరుక్కున వెనక్కి తిరిగి చూసింది మైసమ్మ. ఎవరూ కనబడలేదు. ఎక్కడో తీతువుపిట్ట అరుపు. భయం వెన్నులోనుంచి జరజరా పాకి, ఆమెను వణికించింది. ఒక నిమిషం అక్కడే ఆగి, తేరుకుంది.

'తను ఎవరికి భయపడాలి? తెల్లచీర, విరబోసుకున్న జుట్టు, ఈ ఆకారం చూసి దయ్యాలైనా భయపడతాయి. మనుషులైతే, తననే దయ్యమనుకుని జడుసుకుంటారు.' ధైర్యం చెప్పుకొని అడుగులు ముందుకు వేసింది. నాలుగడుగులు ఆలోచనలతో

భయాన్నిమరచిపోయే ప్రయత్నం చేస్తూ నడిచింది.

★★★

'ఉన్న ఇద్దరు పసివాళ్లని సాకుతూ, పళ్ళబిగువున ఒంటెద్దులా బతుకుబండి లాగుతుంటే, ఈ ఉపద్రవాలేమిటి భగవంతుడా' అని దిగులుపడుతున్న సమయంలో ఆ మధ్యాహ్నం ఇంటి ముందుకు వచ్చాడు, ఆమె ఎప్పుడూ చూడని జంగమదేవర.

గుమ్మం బయట " భంభం బసవా!" అన్న గంభీరమైన స్వరంతో పాటూ, శంఖం ఊదిన ధ్వని వినిపించి ఉలిక్కిపడింది మైసమ్మ. ఆమెకి స్వాములన్నా, సాధువులన్నా చిన్నప్పటి నుంచీ భయం. ఇప్పుడు ఈ బతుకులో కొత్తవాళ్లు ఎవరన్నా భయమే. అందుకే, బయటకు రాకుండా ఇంట్లోనే మౌనంగా ఉండిపోయింది. జంగమదేవర వదలలేదు.

"బయటకు రా తల్లీ. బసవేశ్వరుడి అనుగ్రహం పొందు. నీ పిల్లల ఆరోగ్యం కోసం." అంటూ మళ్ళీ పిలిచాడు.

'పిల్లల ఆరోగ్యం' అన్న మాటలు విని ఆకర్షితురాలై, నెమ్మదిగా బయటకు తొంగి చూసింది మైసమ్మ.

"భయం వద్దు తల్లీ, నీ మేలు కోరి పంపాడు బసవేశ్వరుడు. నా మాట ఆలకించు. నీ చిట్టికూనకు కనులు తెరవని జ్వరం. మందులకు తగ్గేది కాదు. పచ్చని నీ ఇంటికి తగని నరదృష్టి! చక్కని నీ అందానికి అంతులేని జనఘోష!! మనుషుల వంకరచూపు సోకితే, బండరాళ్లయినా పిండి అయిపోతాయమ్మా. ఈ దోషాలు పోతే గాని, కూన తిప్పుకోదమ్మా. దోషాలు పోవటానికి ఒకటే మార్గం..." ఆగాడు జంగమదేవర.

భయంగా చూసింది మైసమ్మ. "ఏం చేయాలి స్వామీ, ఈ దోషాలు పోవటానికి?" బేలగా అడిగింది, "పూజలు చేయించాలా? నాకు డబ్బులిచ్చే స్తోమత లేదు."

పెద్దగా నవ్వాడు జంగమదేవర.

"పైసలొద్దు తల్లీ, పూజలవసరం లేదు. ముళ్లతో నిండిన మూరెడేసి తుమ్మకొమ్మలు రెండు, చిమ్మచీకటిన కోసి తెచ్చి, చీకటిలోనే ఇంటిగుమ్మం రెండు వైపులా వ్రేలాడదీయాలె. నరదృష్టిని చీల్చి చెండాడుతాయి. నీ బిడ్డలూ, నువ్వూ తెరిపిన పడతారు. ఇది బసవేశ్వరుడి మాట!"

మైసమ్మకి ఇలాటి సాధువులపై, మూఢవిశ్వాసాలపై నమ్మకం లేదు. అయితే, పల్లెలలో ఇలాటి నమ్మకాలు చాలా చూసింది. ఇప్పుడు ఆమెకి కావలసింది తన పసిపాప ఆరోగ్యం. అందుకే, ఆమె దృష్టిలో ఇప్పుడు నమ్మకానికి ఉన్న నిర్వచనం మారిపోయింది.

'నమ్మకాలని ఏం చేసుకోవాలి? నమ్మకస్తుడైన వైద్యుడు ఊరికే వైద్యం చేయడు. నమ్మకం పెట్టుకున్న ప్రభుత్వ ఆసుపత్రి మందులు రోగాన్ని నయం చేస్తాయో, చెయ్యవో తెలియటం లేదు. రూపాయి ఖర్చులేని ఈ మూఢనమ్మకం, కనీసం మానసిక వైద్యమైనా చేస్తుంది.' ఊగిసలాడుతున్న మనసుతో అతడి వైపు చూసింది.

"పాపకి తగ్గుతుందా?"

ఆ మాత్రం ఒగ్గు చాలు అన్నట్టుగా మైసమ్మకి దగ్గరా వంగి, నెమ్మదిగా చెప్పాడు, "తగ్గుతుంది బిడ్డా, తప్పక తగ్గుతుంది!"

"ఎక్కడ దొరుకుతాయి తుమ్మ కొమ్మలు? ఎవరు తెచ్చి పెడతారు?" నెమ్మదిగా అడిగింది.

"ఎవరూ తెచ్చిపెట్టరు తల్లీ, ఎవరికీ చెప్పకూడదు. నువ్వే వెళ్ళి తెచ్చుకోవాలి. అదికూడా నిశిరాత్రిన వెళ్ళి తెచ్చుకోవాలి. ఊరికి ఉత్తరాన, బీళ్ళు దాటుకుని, వందగజాలు నడిస్తే, కుడివైపున తుమ్మడొంకలు ఉన్నాయి. అక్కడినుంచి, కొమ్మలు తుంచుకు రావాలి. ఈ రోజు తొలి అమావాస్య. ఈ పనికి మంచిరోజు." కొంత సందిగ్ధత తోనూ, కొంత అపనమ్మకంతోనూ చూసింది మైసమ్మ.

"వ్యవధి లేదు బిడ్డా, తొందరపడు. ఈ పూటకి భయాన్ని వదిలితే, రేపటినుంచీ నీకు నరదృష్టి తొలిగిపోతుంది. ఆలసించి కష్టాలు పెంచుకోకు." హెచ్చరికగా చెప్పేసి వెళ్లిపోయాడు జంగమదేవర.

ఆ తరవాత, చాలాసేపటిదాకా, స్థాణువులా కూర్చుండి పోయింది మైసమ్మ. చివరికి ధైర్యంచేసి డొంకలోకి వెళ్లడానికే సిద్ధపడింది.

★★★

'ఇంకెంత దూరం? బీళ్ళు దాటి వచ్చేసింది. ఇంకా కనబడవేం తుమ్మపొదలు? వందగజాలు అన్నాడా, వందమైళ్ళు అన్నాడా? ఎంతకీ తరగదేమిటీ దూరం? జీవితం కన్నా భారంగా ఉందే ఈ నడక!'

అటూ ఇటూ చూసింది మైసమ్మ. కాస్త దూరంలో డొంకదారులు. పొదల్లో ఏదో కదలిక. మళ్ళీ భయం ఆవహించిందామెని. చీరేకొంగుని తల చుట్టూ తిప్పుకుని, బొడ్లో దోపుకుంది. కదలికలు ఆగిపోయాయి. కళ్ళు చికిలించి చూసుకుంటూ, సూటిగా నడుస్తూ, కుడివైపుకి తిరిగిన మలుపును గమనించింది – గమ్యం చేరిన సూచనగా. అడుగులు చురుగ్గా వేసింది. మలుపు తిరిగే మూలలో ఒక్క నిమిషం ఆగింది. దేవుడిని ధ్యానించుకుంది. మలుపు తిరిగిన నిముషానికి కనిపించాయి తుమ్మపొదలు. ఆ మసకచీకటిలోనే, కనిపించాయి కొమ్మలకి ఉన్న పొడవాటి ముళ్ళు! రెండేసి అంగుళాలకి తక్కువ కాని పొడవుతో, వాడిగా మొనదేలిన ముళ్ళు! నెమ్మదిగా ఆ కంచెలని సమీపించి కొమ్మ విరచబోయింది. అంత తేలికగా సాధ్యం కాలేదు.

'ఒక చాకు గానీ, కనీసం బ్లేడు గానీ వెంట తెచ్చుకొని ఉండాల్సింది' అనుకుంది.

అతి కష్టం మీద, మూరెడు పైగా పొడవున్న రెండు కొమ్మలు తెంప గలిగింది. చేతులకి ముళ్ళు గీసుకుని, మంట పెట్టాయి. చేతులపై ఊదుకుంటూ, ఒక చేతిలో కొమ్మలు పట్టుకుని వెనుదిరిగింది. నాలుగడుగులు వేసేసరికి, పైటకొంగు ఏ కొమ్మనో పట్టుకుని గుంజినట్లయింది. వదిలించుకుందామని వెనక్కి తిరిగి చూసిన మైసమ్మకి దర్శనం అయింది, వంకరగా నవ్వుతున్న రుద్రనాయుడి రూపం. చేతిలో కొమ్మలు కిందపడేసి, రెండు చేతులూ జోడించింది మైసమ్మ.

"నీ తోబుట్టువులాంటి దాన్ని అన్నా, పగటిపూట వచ్చి, మంచి చెడూ కనుక్కుంటన్నావు. అదే మంచితో ఉండు. చీకటి ఆసరా తీసుకుని, నాకు అన్యాయం చేయకు. "

"అన్యాయం కాదే, న్యాయమే సేస్తాను. నా మాట ఇనుకో. వైబోగమే అనుబవిస్తావు!"

పైట గుంజి, ఆమెను తన దగ్గరగా లాక్కుంటూ అన్నాడు రుద్రనాయుడు.

ఇక తప్పదని తెలిసిపోయింది మైసమ్మకి. చీరె చెంగున కట్టుకున్న తెగింపు మూట ఒడుపుగా విప్పింది. అతడి ముఖానికి దగ్గరగా చేతులు చేర్చి, జిల్లేడు పూలు, కొమ్మలు నలుపుతూ, ఆ పాలను అతడి కళ్ళలో పడేలా పిండింది.

"అమ్మా" అంటూ పెద్దగా కేకపెట్టాడు రుద్రనాయుడు. అంతటితో ఆగని మైసమ్మ మెరుపులా క్రిందకు వంగి, తుమ్మకొమ్మలు చేతుల్లోకి తీసుకుని, అతడి ముఖం మీద దబదబా బాదింది. తట్టుకోలేని బాధతో, కింద పడిపోయాడు రుద్రనాయుడు. తీరని కసితో రెండు కొమ్మలనూ అతడి మీదకే విసిరికొట్టిన మైసమ్మ వెనక్కి తిరిగి, బలమంతా కాళ్లలోకి తెచ్చుకుని, పులి తరుముతున్న లేడిలా పరుగు ప్రారంభించింది. పావుగంటకి తన ఇంటిముందుకి చేరుకుని, వగరుస్తూ గుమ్మంలో కూలబడిపోయింది. రెండునిమిషాల ఎగశ్వాస తరవాత నెమ్మదిగా లేచి, నిలబడింది.

"పాపా..." అంటూ తలుపు తట్టింది. ఆబగా తలుపు తీసిన మమతని కౌగిలిలోకి తీసుకుని కొద్దిక్షణాలు అలాగే ఉండిపోయింది. నెమ్మదిగా తలుపు వేసేసి, ప్రతిమ దగ్గరకు వెళ్ళి, ఆ పక్కనే నిస్త్రాణగా వాలిపోయింది.

'ఆ రాక్షసుడి దృష్టికి తూట్లు పొడిచి తప్పించుకు రాగలిగింది. ఇక తన ఇంటి మీది నరదృష్టి తూట్లుపడి పోయినట్లే.' వెర్రి విశ్వాసం ఆమెకు ఊరటనిచ్చింది. తూరుపు తెలవారకముందే మెలుకువ వచ్చిన మైసమ్మ, ప్రతిమ నుదుటిపై చేయి వేసింది. జ్వరం కొద్దిగా జారింది. ఉత్సాహంగా తలుపు తెరుచుకుని బయటకు వచ్చి, నిముషాల్లో రానున్న ఉషోదయ కిరణాలు తెచ్చే కొత్త వెలుగులకోసం ఎదురు చూస్తూ గుమ్మలో కూర్చుండిపోయింది మైసమ్మ.

★★★★★

# బంగారు తల్లి

నందూరి సుందరీ నాగమణి



✆ 98499 89201

**కథామంజరి దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***పైనింట్లో పని చేసినప్పుడు, వాళ్ళింటికి వచ్చిన ఒక చుట్టాలాయన నాతో తప్పుగా మాట్లాడాడని ఆయమ్మకు చెప్పుకుంటే, 'మా బాబాయికి అరవై దాటాయి. అలాంటి వాడు కాదు. అసలు ఆయన్ని నువ్వేం అని.. రెచ్చగొట్టావో, ఏమో!' అందమ్మా నాతో. ఆ రోజే పని మానేసానా ఇంట్లో. నన్ను నమ్మని, కాపాడని ఆ యజమానురాలు నాకెందుకమ్మా? నీ ఇల్లు గుడిలాగ, నువ్వు అమ్మోరు తల్లిలాగా అనిపిస్తాదమ్మా నాకు!***

ఆఫీసునుంచి వస్తూంటే మా కాలనీ గేట్ బస్టాప్ దగ్గర ఆరేళ్ళ బాబుతో నిలబడిన అమ్మాయిని చూస్తుంటే, ఎక్కడో చూసినట్టు తోచింది. దగ్గరగా వెళ్ళి, 'బిజిలీ' అని పిలిచాను, అనుమానంగానే. తలెత్తి నన్ను చూసిన ఆమె ముఖం వెలిగిపోయింది.

"రాజమ్మా, మీరేనా?" రెండు చేతులు జోడించి దణ్ణం పెట్టింది. "వీడు మా రెండోవాడమ్మా... ముందు కూడా అబ్బాయే..." అంటూ వాడితో కూడా దణ్ణం పెట్టించింది.

"బిజిలీ, బాగున్నావా? పెద్దదానివయావు. వరంగల్లో ఉండటం లేదా?"

"లేదమ్మా, ఆయనకి ఇక్కడికే ట్రాన్స్ఫర్ అయిందమ్మా, మా అమ్మ వాళ్ళ ఇంటిదగ్గరే ఇల్లు తీసుకుని ఉంటున్నాము..."

"అలాగా? నేను కూడా ఇక్కడికి ట్రాన్స్ఫర్ మీద వచ్చి వారమే అయింది..."

"మేమిక్కడికి వచ్చి మూడు నెలలు అయిందమ్మా, రాగానే నేను ఇంటికి వచ్చి అడిగినా... పక్కింటి వాళ్ళు మీరిప్పుడు నిజామాబాదులో పనిచేస్తున్నారని చెప్పారమ్మా..."

"అవునా? సరే బిజిలీ... ఓ సారి ఇంటికి రా, వివరంగా మాట్లాడుకుందాం!"

"వస్తానమ్మా. రేపు ఆదివారం వస్తాను. మీరు ఉంటారు కదా..."

"ఉంటాను. తప్పకుండా రా, మరచిపోకు. మీ బాబు చాలా బాగున్నాడు!" వాడి బుగ్గలు నిమిరి, బిజిలీకి చేయి ఊపి, ఇంటివైపు నడక సాగించాను.

ఇంటికి వచ్చి, ముఖం కడుక్కుని బాల్కనీలోని ఉయ్యాలలో కూర్చుని టీ తాగుతుంటే బిజిలీ జ్ఞాపకాలు నన్ను చుట్టుముట్టాయి. బిజిలీని ఎంతకాలానికి చూడగలిగాను?

పదిహేనేళ్ళ వెనక్కి మనసు పరుగు తీసింది.

★★★

సాయంత్రం ఆరైంది.

అప్పుడే బ్యాంకునుంచి వచ్చి, ఫ్రెష్ అయి, వంటింట్లోకి వెళ్ళబోతున్న నాకు బెల్ శబ్దం వినిపించి తలుపు తెరిచి చూసాను. ఎదురుగా ఒకమ్మాయి నిలబడి ఉంది. పాతబడిన పంజాబీ డ్రెస్సులో, మారువేషంలో ఉన్న దేవకన్యలా అనిపించింది. తెల్లని శరీరవర్ణం, గుండ్రటి ముఖం, తీర్చిదిద్దినట్లున్న కనుముక్కు తీరు ఎంతో నాజూగ్గా, లేత తమలపాకులా ఉందా అమ్మాయి.

"ఎవరమ్మా? ఏం కావాలి?"



"అమ్మా, మీరు పనమ్మాయి కోసం చూస్తున్నారంట కదా... నా పేరు బిజిలీ... రేపటినుంచి పనికి రానా?" అడిగింది నా వైపే చూస్తూ..

ఉలిక్కిపడ్డాను. ఇంత చక్కని పిల్ల పనమ్మాయా?

వెంటనే లోపలికి పిలిచి కూర్చోమన్నాను. కుర్చీలో కూర్చోమని ఎంత చెప్పినా వినకుండా, బిజిలీ నేలమీద కూర్చుంది.

"అమ్మా... మేము ఆ రోడ్డవతలున్న తండాలో ఉంటాము. మా నాన్న ఆటో నడుపుతాడు. అమ్మ కూడా పనులకు వెళుతుంది. ఇంటికి నేనే పెద్దదాన్ని. పనికోసం చూస్తున్నాను. మీరు పనమ్మాయి కోసం వెదుకుతున్నారని తెలిసి, వచ్చాను." అంది గబగబా.

"ఇంత చక్కని పిల్లవు... ఎందుకమ్మా నీకీ పని, హాయిగా చదువుకోక?" బాధగా అన్నాను.

"తప్పదమ్మా... ఇంట్లో బాధ్యతలు ఉన్నాయి... ఐదోతరగతి చదివి మానేసాను. ఇప్పుడు మా తమ్ముళ్ళు చదువుకుంటున్నారు!" అంది క్లుప్తంగా.

"కానీ నువ్వు చిన్నపిల్లవు కదమ్మా... పదహారేళ్ళైనా ఉన్నాయో లేవో..." సంశయంగా అన్నాను.

"అమ్మా నాకు పద్దెనిమిది నడుస్తుంది ఇప్పుడు... మంచి అమ్మవులా ఉన్నావు... పనిలో పెట్టుకోమ్మా." గబుక్కున నా పాదాల మీద తన చేతులుంచింది.

చటుక్కున వాటిని వెనక్కి లాక్కున్నాను... "అయ్యో బిజిలీ ఏం పనిది?" అంటూ...

ఇదివరలో మా పైనున్న ఫ్లాటులో చేసేదట. అయితే వాళ్ళకి వేరే ఊరికి బదిలీ అయిపోవటం వలన పని పోయిందని చెప్పింది.

మూడేళ్ళక్రితం మేమీ అపార్ట్మెంట్ కొనుక్కున్నాము. వెంటనే నాకు కాకినాడకు బదిలీ అయింది. ఇల్లు అద్దెకిచ్చి, శ్రీవారు, బాబు కూడా నాతోపాటే వచ్చేసారు.

తిరిగి నేను బదిలీపై మా ఊరికి వచ్చి నెలవుతున్నది. పనిమనిషి దొరక్క, నేనే పని చేసుకుంటున్నాను. ఇద్దరు, ముగ్గురు అమ్మాయిలు వచ్చి చేస్తామని అన్నారు కానీ, వాళ్ళకు ఉదయం పదిదాటిన తరువాత తప్ప కుదరదట. నాకు ఉదయం

ఏడునుంచి ఎనిమిదిన్నర లోపల పని అయి వాళ్ళు వెళ్ళిపోవాలి. అప్పుడే నేను స్నానం, వంట పూర్తి చేసుకుని, కాస్త తినేసి బ్యాంకుకు వెళ్ళగలిగేది.

"బిజిలీ... నీకు సాయంచేయాలనే ఉంది, కానీ ఇంత సుకుమారంగా ఉన్నావు నీతో పని చేయించుకోవాలంటే మనసు ఒప్పటం లేదమ్మా... అదీగాక ఉదయం ఏడుగంటలకల్లా పనిలోకి రావలసి ఉంటుంది... నీకు ఆ టైమ్ వీలో కాదో..."

"అయ్యో, వచ్చేస్తానమ్మా... ఏడుకి వచ్చి తొమ్మిది లోపల వెళతాను. గిన్నెలు, బట్టలు, తడిబట్ట కాక, ఇంకేమైనా పనులు చేయాలామ్మా?"

"ఇంకేమీ అక్కరలేదు బిజిలీ... మరి ఎంత జీతం ఇవ్వమంటావు?" అడిగాను.

"మీ ఇష్టమమ్మా, చూసి ఇవ్వండి..."

"సరే, నెలకు వెయ్యి రూపాయలు ఇస్తాను, సరేనా?"

"సరేనమ్మా... రేపటినుంచి వస్తాను..." అంటూ లేవబోయింది.

"ఆగాగు... కాస్త చాయ్ తాగి వెళ్దువుగాని..." అంటూ లేచి, టీపెట్టి తెచ్చిచ్చాను. నేను కూడా ఆమెతో పాటే తాగాను. తను రెండు గుక్కల్లో తాగేసి, లేచి వంటింట్లోకి వెళ్ళి చాయ్ కప్పు కడిగేసి, గట్టు మీద బోర్లించింది. నేను తాగిన కప్పు, టీ పెట్టిన గిన్నె రెండూ కూడా శుభ్రంగా తోమి బోర్లించింది చకచకా...

ఆ వేగానికి, పనితనానికి అబ్బురంగా చూస్తూ ఉండిపోయాను.

చేతులు తుడుచుకొని, "వెళ్లొస్తానమ్మా..." అంటూ త్వరత్వరగా వెళ్లిపోయింది బిజిలీ. ఆమెవైపే చూస్తూ ఉండిపోయాను.

★★★

మర్నాటినుంచీ, బిజిలీ పనిలోకి వచ్చేయటం వలన నాకెంతో వెసులుబాటు అయిపోయింది!

చక్కగా ఉదయం ఏడుకల్లా వచ్చేసేది బిజిలీ. రాగానే వీధిగుమ్మం కడిగి, ముగ్గేసి, ఇల్లు ఊడ్చి, తడిబట్ట పెట్టి, అప్పుడు గిన్నెలన్నీ తెల్లగా తోమేసేది. నేను పెట్టిన టిఫిన్ తిని, టీ తాగి బట్టలు ఉతికి, బాల్కనీలో ఆరేసి, క్లిప్పులు పెట్టి వెళ్ళేది.

నేను ఇంటికి వచ్చేసరికే ఏడు దాటేది కాబట్టి ఇక సాయంత్రాలు వచ్చేది కాదు. ఆదివారాలు మాత్రం వచ్చి సాయంత్రం కాసిని గిన్నెలు తోమి, బాత్‌రూముల నేలంతా శుభ్రంగా కడిగి వెళ్ళేది. ఆ పని నేను చెప్పకపోయినా, తనంతట తానే అలవాటు చేసుకుంది బిజిలీ.

సహజంగా మితభాషి కావటం వల్ల కావచ్చు, ఎక్కువ మాట్లాడేది కాదు బిజిలీ. వచ్చిన వెంటనే పనిలోకి దిగిపోయి, చకచకా చేసేసి వెళ్లిపోయేది. తనేమో, తన పనేమో అన్నట్టుగా ఉండే బిజిలీ అంటే మా వారికీ, అబ్బాయికీ కూడా అభిమానం ఏర్పడింది. హాల్లో మ్రోగుతున్న టీవీని కూడా చూసేది కాదు... త్వరత్వరగా ఇంటికి వెళ్లిపోవాలని చూసేది.

ఒకసారి పండక్కి బిజిలీతో ఆమె తల్లి కూడా వచ్చి, నన్ను కలిసి వెళ్లింది. ఆవిడకు కొత్త చీర, జాకెట్టు ఇచ్చాను. కాసేపు కూర్చుని తన కష్టాలన్నీ చెప్పుకుంది. మొగుడు ఆటో మీద వచ్చిందంతా తాగేస్తాడట. తానొక ఐదు ఇళ్ళల్లో పనిచేస్తోందట. వయసులో ఉన్న ఆడపిల్లను పనికి పంపటం ఇష్టం లేదు, కానీ తప్పటం లేదని కన్నీరు పెట్టుకుంది, సోనాబాయి.

"నీలాంటి మంచితల్లులు చాలా తక్కువగా ఉంటారమ్మా... రోజూ నా పిల్లకి కడుపు చూసి తిండెడతావు... నీలాంటోళ్ళ దగ్గర మాలాంటోళ్ళకి ఎలాంటి బెంగా ఉండదు. మొగపిల్లలిద్దరూ బడికెళుతున్నారు. వచ్చే ఏడాది బిజిలీకి లగ్గం చేసేస్తాను..." తన గోడు చెప్పుకుని, దండం పెట్టి, నేనిచ్చిన వస్తువులు తీసుకుని వెళ్ళిపోయింది.

★★★

ఓ ఆదివారం సాయంత్రం నాలుగ్గంటలకు మేమంతా హాల్లో కూర్చుని టీవీలో సినిమా చూస్తున్నాము.

అంతకు ముందే వచ్చిన బిజిలీ బట్టలుతికి బాల్కనీలో ఆరేయటానికి వెళ్ళింది. మరో ఐదు నిమిషాలకి భయంగా వచ్చి, "అమ్మా, ఓసారి నాతోరా..." అంటూ పిలిచింది. బాల్కనీకి అవతలివైపు కొంతమంది ఆకతాయి కుర్రాళ్ళు రోడ్డు మీద నిలబడి మా ఇంటివైపే చూస్తున్నారు. వాళ్ళు రెండురోజులుగా బిజిలీని చూసి ఈలేసి గోలచేస్తున్నారట. కిందికి రమ్మనీ, సరదాగా గడుపుదామని అసభ్యంగా మాట్లాడుతున్నారట. ఈరోజు ఒకడు మా బాల్కనీలోకి రాయి విసిరాడట. అన్నీ చెప్పుకుని కళ్ళనీళ్లు పెట్టుకుంది బిజిలీ.

నాకు రక్తం మరిగిపోయినట్టు అయింది. బిజిలీతో పాటుగా బాల్కనీలో అడుగుపెట్టిన నన్ను చూసి గతుక్కుమన్నారా కుర్రాళ్ళు.

"ఏరా ఏమనుకుంటున్నారు? ఈవ్‌టీజింగ్ కేసు పెడతాను వెధవల్లారా? పోలీసులకి ఫోన్ చేయమంటారా?" గట్టిగా ఇంగ్లీషులో అరుస్తూ తిట్టాను. భయపడి పారిపోయారు.

"అమ్మా..." నా చేతులు పట్టుకుని, కన్నీరు పెట్టుకుంది బిజిలీ. ఆమె మనసులోని అలజడి నాకు అర్థమై, ప్రేమగా ఆమె భుజం నిమిరి, ఓదార్చాను.

"జాగ్రత్త బిజిలీ... సాయంత్రాలు చీకటిపడ్డాక బయటకు రాకు. రోజులసలు బాగా లేవు. ఆదివారాలు కూడా ఇక మీదట ఉదయమే రా... సాయంత్రం ఆలస్యం అయిపోతే కష్టం... సరేనా?" అనునయంగా చెప్పాను.

కళ్ళు తుడుచుకొని, అలాగేనన్నట్టు తల ఊపింది బిజిలీ.

★★★

ఆ మర్నాడు పనిలోకి రాలేదు బిజిలీ. ఏమైందో అర్థం కాలేదు. ఒంట్లో బాగుండలేదా? నిన్న జరిగిన సంఘటన వలన పని మానేసిందా? సెల్‌ఫోన్లు లేని కాలమది. అంచేత ఆమెను కాంటాక్ట్ చేయలేకపోయాను. ముందు చెప్పకుండా బిజిలీ ఎప్పుడూ పని మానదు.

రెండోరోజు ఉదయమే వచ్చింది బిజిలీ. "సారీ అమ్మా... మా అమ్మకు చేతిలో సీసా పెంకు దిగింది. నిన్న ఆస్పత్రికి తీసుకువెళ్లి కట్టు కట్టించాను... అందుకే రాలేదు..." అంది.

"అయ్యో, ఎలా జరిగింది? ఇప్పుడెలాగుంది?" గబగబా అడిగాను.

"బాగుందమ్మా... కట్టువలన పనిలోకి వెళ్ళలేదివాళ. కొద్దిగా జ్వరం వచ్చింది. మందులు వేసి వచ్చాను..." చెప్పింది. కాసేపాగి చెప్పింది..."మాయమ్మ పనిచేసే ఇంట్లో అంట్లు తోముతుంటే ఆ గిన్నెల్లో పగిలిన సీసా పెంకు ఉండటం వలన గుచ్చుకుందట..." బిజిలీ చెబుతుంటే, నా మనసు భారంగా మూలిగింది.

అన్నాలు తినేసి, వాటిల్లో నీళ్ళైనా పోయకుండా సరాసరి సింకుల్లో పడేస్తారు చాలామంది. అలాగే అంట్లగిన్నెలూ... అన్నాలు వండిన కుక్కర్లూ, కూరలు వండిన గిన్నెలూ, ప్యాన్‌లూ, కాఫీలు తాగిన గ్లాసులూ అన్నీ అలా వదిలేయటమే. ఎంగిళ్లు కూడా తీయకుండా సింకులో కుళాయి కింద వదిలేస్తారు. ఆ గిన్నెల్లో ఏమున్నా అవన్నీ క్లియర్ చేసి, క్లీన్ చేసే బాధ్యత పనిమనిషిదే అని అనుకుంటారు.

ఏం పాపం చేసిందని ఆవిడ మన ఎంగిలి గిన్నెలు తోమాలి? సరే తోముతుంది కదాని, వాళ్ళనలా గాయాలపాలు చేయటానికి మనకేం హక్కుంది? చాకులు, పీలర్లతో సహా శుభ్రం చేయకుండా సింకులో పడేస్తారు కొంతమంది. అవి గుచ్చుకుని, పనివారికి చేతులూ, వేళ్లూ తెగితే, ఆ పాపం ఎవరిది?

మాఇంట్లో నేను మొదటినుంచీ ఒక అలవాటు చేసాను, నాతో సహా అందరం తిన్న పళ్ళాలలో ఎంగిళ్ళు, తొక్కలు తీసేసి, ఒక కవర్లో వేసి చెత్తడబ్బాలో వేసేస్తాము. ఆ తరువాత పళ్ళాల్లో నీళ్ళుపోసి, తొలిచి ఉంచేస్తాం. అలాగే వంటగిన్నెలు కూడా... చాకు కానీ, పీలర్ కానీ ఉపయోగించిన తర్వాత నేనే క్లీన్ చేసి పెట్టేసుకుంటాను.

బిజిలీ ఇంటికి వెళుతుంటే, వాళ్ళమ్మకి మందులకు, పళ్ళకు అని ఒక ఐదు వందల రూపాయలు చేతిలో పెట్టాను.

★★★

ఆ రోజును నేను ఎన్నటికీ మరచిపోలేను. అత్తగారింట్లో ఒక వేడుకకు వెళ్ళవలసివచ్చి, ఉదయమే మంచి సిల్క్‌చీర కట్టుకొని, సిద్ధమయ్యాను. మా అబ్బాయి ఒకరోజు ముందే వెళ్ళిపోయాడు అక్కడికి.

బిజిలీ పనికి రావటంతో ఆమెకు టీ ఇవ్వాలని స్టవ్ వెలిగించి, పక్కనున్న కప్‌బోర్డులోంచి పంచదార డబ్బా తీస్తుంటే నా చీరకొంగుకు ఎలా జరిగిందో తెలియదు కానీ మంట అంటుకుంది. క్షణాలలో పైకి పాకుతూ వచ్చి నా నడుము తాకబోయింది. నా నోటినుంచి 'అయ్యో, దేవుడా!' అనే ఆక్రందన వెలువడింది. కదలలేక, భయంతో బిగుసుకుపోయి అలాగే నిలబడిపోయాను. కాళ్ళూచేతులూ ఆడలేదు.

"అమ్మా..." నన్ను చుట్టుకుపోయిన బిజిలీ నా మండుతున్న చీర కొంగును తన రెండుచేతులతో పట్టుకొని గట్టిగా లాగేసింది. పక్కనే బకెట్లో నింపి ఉన్న నీటిని, మగ్గుతో పోసేసి మంట ఆర్పేసింది. బొడ్లో చేయిపెట్టి, కుచ్చిళ్ళూడదీసి, చీర మొత్తం లాగేసింది. ఈ హడావుడికి... బాత్‌రూములో స్నానం చేస్తున్న మావారు, టవల్ చుట్టుకొని వచ్చి, గబగబా నన్ను తీసుకువెళ్ళి మంచం మీద పడుకోబెట్టారు. నా ఒళ్ళంతా చెమటలతో తడిసి ముద్దయింది. ఆయన వెనుకే వచ్చిన బిజిలీ ఫ్యాన్ ఫుల్‌స్పీడులో పెట్టింది. ఒకరకమైన షాక్‌లో ఉన్న నాకు నోట మాట రావటంలేదు. సమయానికి బిజిలీ అలా చేసి ఉండకపోతే, ఈ పాటికి నేను...

"అమ్మా...భయం లేదు... ఇదిగో నీళ్ళు తాగండి..." నన్ను కొద్దిగా పైకి లేపి, మంచినీళ్ళు తాగించింది బిజిలీ.

"థాంక్సమ్మా బిజిలీ... మీ అమ్మను నువ్వే కాపాడావు. నువ్వు పక్కన లేకపోతే ఈ పాటికి ఏమయేదో..." అంటూ, "రాజీ, నువ్వు కాసేపు పడుకో. ఇప్పుడు తొందరేం లేదు!" అన్నారు శ్రీవారు.

"సరేనయ్యా. నేను వెళతాను... అమ్మ భద్రమయ్యా..." అంటూ వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళింది బిజిలీ.

ఆ మర్నాడు కొద్దిగా కమిలి బొబ్బలెక్కిన ఆ 'బంగారు తల్లి' అరచేతులకు కొబ్బరినూనెను రాస్తూ కళ్ళనీళ్లు నింపుకున్నాను.

★★★

మరో మూడునెలలకే, బిజిలీకి పెళ్ళి కుదిరిందని, పెళ్ళికొడుకు వరంగల్లో పోలీసు కానిస్టేబులనీ వాళ్ళమ్మ సంతోషంగా వచ్చి చెప్పింది.

నాకు మనసంతా దిగులుగా అయిపోయింది. పనమ్మాయి లేక పనిచేసుకోవలసి వస్తుందని కాదు.. స్వంత కూతురులాంటి అమ్మాయి వెళ్లిపోతుందని, ఇక తననిప్పట్లో చూడలేననీ...

ఆ నెలజీతం కాక, మరో మూడువేలు బిజిలీ చేతిలో పెట్టాను. కొత్త ఎఱ్రనిరంగు పట్టుచీర, వెండి కాలిపట్టీలు తెప్పించి, పండు తాంబూలంతో పాటు ఇచ్చాను. పెళ్ళి, వాళ్ళూరిలో కావటంతో, సెలవు దొరకక పెళ్ళికి వెళ్లలేకపోయాను.

బిజిలీ సెలవుతీసుకుంటూ, నా పాదాలకు దణ్ణం పెట్టింది. ఆమె కళ్లనుంచి అశ్రువులు పువ్వుల్లా నా పాదాలమీద రాలాయి. తనను లేవదీసి, దగ్గరకు తీసుకుని ప్రేమగా తల నిమిరాను. నా చేతులు పట్టుకుని ఏడుస్తూ కళ్ళకద్దుకుంది బిజిలీ...

ఆ తరువాత నాతో చెప్పసాగింది...

“అమ్మా, ఇళ్ళల్లో పనిచేసుకునే మాలాంటివాళ్ళని ఏ అమ్మా నీలాగా చూడదు. ఒక్కసారి కూడా ‘ఒసే, ఏమే’ అని నన్ను పిలవలేదు నువ్వు. ‘అమ్మా బిజిలీ!’ అని ఎంత చక్కగా పిలుస్తావో! ఆ రోజు ఆ పోకిరీ కుర్రోళ్ళు నన్నల్లరి చేస్తుంటే వెంటనే వచ్చి అదిలించావు. బెదిరించి వాళ్ళని వెళ్ళగొట్టావు. నాకెంతో ధైర్యం చెప్పావు. ఇదివరకు పైనింట్లో పని చేసినప్పుడు, వాళ్ళింటికి వచ్చిన ఒక చుట్టాలాయన నాతో తప్పుగా మాట్లాడాడని ఆయమ్మకు చెప్పుకుంటే, ‘మా బాబాయికి అరవై దాటాయి. అలాంటి వాడు కాదు. అసలు ఆయన్ని నువ్వేం అని రెచ్చగొట్టావో, ఏమో!’ అందమ్మా నాతో. ఆ రోజే పని మానేసానా ఇంట్లో. నన్ను నమ్మని, కాపాడని ఆ యజమానురాలు నాకెందుకమ్మా? నీ ఇల్లు గుడిలాగ, నువ్వు అమ్మోరు తల్లిలాగా అనిపిస్తాదమ్మా నాకు! అయ్యా, బాబూ కూడా నన్ను ఇంట్లో మనిషిలాగే చూస్తారు. నీ చీర కాలినపుడు, ఇంటికి వెళ్ళిన తరువాత నోట్లో ముద్ద కూడా పెట్టలేకపోయానమ్మా... అమ్మా! మళ్ళీ నిన్నెప్పుడు చూస్తానో... నన్ను యాద్ మరవ్వ కదూ?” వెక్కివెక్కి ఏడ్చింది.

నేను కూడా కొంగుతో కళ్ళు తుడుచుకున్నాను. ‘ఇది నా కడుపున ఎందుకు పుట్టలేదో!’ అనిపించింది.

వాళ్ళమ్మతో కలిసి నడిచివెళుతూ, కనిపించినంతమేరా తలతిప్పి వెనక్కి చూస్తూ, చేయి ఊపుతూనే ఉంది... భారమైన మనసుతో నేనూ చేయి ఊపాను.

★★★

ఆలోచనల్లోంచి బయటకు వచ్చాను.

ఆ రాత్రి శ్రీవారు ఇంటికి వచ్చాక, ఆదివారం నాడు బిజిలీ వస్తోందని ఎంతో సంతోషంగా చెప్పాను. ఆయన కూడా చాలా సంతోషపడ్డారు.

బెంగుళూరులో జాబ్ చేస్తున్న మా అబ్బాయికి కూడా బిజిలీ అక్క కనిపించిందనీ, ఇంటికి వస్తోందనీ ఫోన్‌లో చెప్పి సంబరపడ్డాను.

ఆదివారం కోసం, మేమిద్దరమూ ఎంతో ఆరాటంగా ఎదురుచూస్తున్నాము, మా బిజిలీ తల్లి ఇన్నాళ్ళ తరువాత ఇంటికి వస్తుందని!

★★★★★

# మా నాన్న నేరస్థుడు

కోనే నాగ వెంకట ఆంజనేయులు



✆ 9290660220

**దీపావళి 2022 కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***“అదే నాన్నా! షుగర్‌వ్యాధి ఉంది కదా మీకు. మందులు కూడా వాడుతున్నారు. అటువంటప్పుడు ఇలా అర్ధరాత్రిళ్ళు లేచి దొంగతనంగా డబ్బాలు వెతుక్కుని స్వీట్స్ తినేస్తుంటే మీ ఆరోగ్యం ఏం కావాలి నాన్నా?” కొంచెం మందలింపుగానే అన్నాను.. అందులోనే నొచ్చుకోలు కూడా కలిపి.***

***“ఓ...అదా. రాత్రి చూశావు కదూ!” అని కాసేపు ఆగి “ఇలాంటి కంప్లైంట్ యింతకు ముందు ఎప్పుడైనా చేసిందా మీ అమ్మ?” అడిగేడు నాన్న.***

“మీ నాన్న అర్ధరాత్రి పూట లేచి చప్పుడు చెయ్యకుండా డబ్బాలు వెతుక్కుని స్వీట్స్ తినేస్తున్నాడు. ఈ మనిషిని కాయలేక చస్తున్నాను నేను!” ఫోన్‌లో అమ్మ గొంతు ఖంగుమంటోంది.

నాన్న మీద అమ్మ గతంలో ఎప్పుడూ చెయ్యని కొత్త కంప్లైంట్ ఇది. అన్నట్టు ‘రు’ బదులు ‘డు’ ఏమిటని ఆశ్చర్యపడకండి. నాన్న ఉద్యోగవిరమణ అనంతరం డబ్బులు రావడం ఆగిపోగానే ఆయన్ని గౌరవించడం మానేసింది అమ్మ. ఆయన మంచం కూడా వేరే గదిలోకి మార్చేసింది.

“అసలు యింట్లో స్వీట్స్ ఎక్కడివి?” అడిగేను అసహనంగా. నాన్నకి షుగర్‌వ్యాధి సోకిందని తెలిసిన తరువాత అమ్మ యింట్లో స్వీట్స్ తయారు చెయ్యడం మానేసిందని తెలుసు నాకు. ఎప్పుడైనా వాళ్ల తరపు వాళ్ళు వచ్చినప్పుడు మాత్రం చేస్తుంది గానీ, నాన్న కంటబడని చోట దాచేస్తుంది.

అలా అని నాన్న.. వ్యాధిని లెక్క చెయ్యకుండా ఏడాపెడా మిఠాయిలు తినేస్తారని కూడా కాదు. కంట్రోల్లోనే ఉంటూ ఎప్పుడైనా దొరికితే ఓ చిన్న స్వీట్ ముక్క నోట్లో పడేసుకుంటారు అంతే. ఒంట్లో షుగర్‌వ్యాధి ఉంచుకుని స్వీట్స్ తినేస్తే జరిగే నష్టాలేమిటో తెలియనివారు కాదు నాన్న.

“మీ చెల్లి వచ్చింది కదా. ఊరి నుంచి వస్తూ వాళ్ల ఊళ్ళో దొరికే కారప్పూస, కాజాలు, మైసూర్‌పాక్‌లు తీసుకువచ్చింది. అవి డబ్బాల్లో పోసి ఎప్పటిలాగే హాల్లో టేబుల్ మీద ఉంచాను. పిల్లలు ఎవరికి ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకు తింటారని।” చెప్పింది అమ్మ.

చెల్లి.. పండక్కి మూడు రోజుల ముందే వచ్చినట్టు చెప్పింది అమ్మ నాతో. మేము ఈరోజు మా డ్యూటీలు పూర్తి చేసుకుని ఈరాత్రికే బస్సులో బయలుదేరి, రేపు ఉదయానికల్లా వైజాగ్ చేరిపోతాం. ఈలోగానే అమ్మ కొత్త కంప్లైంట్ నాన్నమీద. అంతకు ముందు కూడా వివిధ సందర్భాల్లో అమ్మ నాన్నమీద మోపిన నేరాల్లో ‘పిల్లల కోసం కాచి ఉంచిన నెయ్యి తాగేస్తున్నాడు’ అనేది మచ్చుకి ఒకటి.

నాన్నకి వేడి వేడి ఇడ్లీల్లో తాజాగా వెన్నకాచిన పూసల పూసల నెయ్యి వేసుకుని కారప్పొడితో తినడం చాలా ఇష్టం. అలాగే ముద్దపప్పులోనూ. అమ్మ వెన్నకాచిన రోజున.. వేడి ఇడ్లీ, ముద్దపప్పు దొరికినప్పుడే నాన్న అలా తింటారు. లేకపోతే లేదు అంతే. 'మీ నాన్న నెయ్యి తాగేస్తున్నాడు' అని ఆయన మీద నేరం మోపిన రోజు నుంచీ.. అమ్మ వెన్నకాచిన రోజున ఇడ్లీ గానీ, ముద్దపప్పు గానీ వండడం మానేసింది.

భారంగా నిట్టూర్చాను. అంతటితో ఆ విషయం వదిలేసి రాత్రి ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోసాగేము నేను, కావేరి. పిల్లలు ఇద్దరు కూడా సంబరపడుతున్నారు అత్తనీ, మామనీ చూడవచ్చుననీ, అత్త పిల్లలతో ఆడుకోవచ్చనీ.

అమ్మ ఫోన్ పెట్టేసే ముందు హెచ్చరించడంతో, ఎప్పుడు యింటికి వెళ్లినా తప్పనిసరిగా తీసుకు వెళ్లే పుల్లారెడ్డి స్వీట్స్ ఈసారి కేన్సిల్ చేసేశాను.



ఉదయం ఆరింటికి బస్సు దిగి యింటికి చేరుకోగానే.. అప్పటికే లేచిపోయి మా రాక కోసం ఎదురు చూస్తున్న పిల్లల్నీ, బావగారినీ అందరినీ పలకరించి యింట్లో సందడిని మరింత పెంచేము మేము.

కాసేపు తరువాత నాన్నగారి గదిలోకి వెళ్లిచూశాను. అప్పుడే లేచినట్టున్నారు. చాలా నీరసంగా కనిపిస్తున్నారు. డబ్భైకి దగ్గరపడ్డారు మరి.

చటుక్కున అమ్మ ఫోన్‌లో నాన్న గురించి చెప్పిన సంగతి గుర్తుకు వచ్చి.. నాన్నతో 'ఆ విషయం' మీద మాట్లాడదామని అనిపించింది గానీ, అమ్మ చెప్పిన దాంట్లో నిజం ఎంత ఉన్నదీ నిర్ధారణ చేసుకోకుండా ఆ ఊసు ఎత్తకూడదని అప్పటికి ఏం మాట్లాడలేదు. ఆయన ఆరోగ్యం గురించి, రచనల గురించీ కాసేపు కబుర్లాడి గదిలోంచి వచ్చేశాను.

హాల్లో న్యూస్‌పేపర్ తిరగేస్తున్న బావగారితో కలిసి, అమ్మ తీసుకువచ్చి ఇచ్చిన కాఫీలు చప్పరిస్తూ కబుర్లలో పడ్డాం ఇద్దరం.

ఆ రోజు అంతా సందడిగా ఆనందంగా గడిచిపోయింది. నన్ను స్వీట్స్ తీసుకురావద్దని చెప్పిన అమ్మ మాత్రం ఆ రోజంతా కష్టపడి చెల్లి, కావేరీల సాయంతో అరిసెలూ, సున్నుండలూ, జంతికలూ, చేగోడీలూ చేసి డబ్బాలకు ఎత్తింది.

ఆ మధ్యాహ్నం.. అందరం అమ్మ చేసిన అన్ని రకాల మిఠాయిలు తింటుంటే నాన్నకి ఓ నాలుగైదు చేగోడీలు మాత్రం ప్లేటులో పెట్టి ఇచ్చింది అమ్మ.

"మందులు వేళకి సరిగ్గా వేసుకుంటున్నారా నాన్నా?" అని అడిగేను పంచదార లేని టీ అయిష్టంగా తాగుతున్న నాన్నని.

"ఆ... వేసుకుంటున్నా! ఈ మధ్యనే అంటే వారం రోజుల క్రితం డాక్టర్ దగ్గరకు వెళితే బ్లడ్ టెస్ట్ చేసి షుగర్ లెవెల్స్ కాస్త ఎక్కువ ఉన్నాయని చెప్పి, వేరే పవర్‌ఫుల్ మందులు రాశారు. అవి వాడుతున్నాను!" చెప్పారు నాన్న నూతిలోంచి మాట్లాడుతున్నట్టు నెమ్మదిగా.

నాన్న ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడరు. ఎవరైనా ఏదైనా అడిగితే అంతవరకే సమాధానం చెబుతారు తప్పితే.. తనంతట తనే కల్పించుకుని ఎవరితోనూ మాట్లాడడం రాదు ఆయనకి. నాన్న చిన్నప్పటి నుంచీ అంతే అని తాతయ్య చెబుతుండేవాడు. కానీ మా అమ్మ మాత్రం ఇన్నేళ్ళు ఆయనతో కాపురం చేసి, ఆయన ఈ స్వభావం తెలిసి కూడా.. తన వైపు వాళ్ళు వచ్చినప్పుడు వాళ్ళతో సరిగ్గా మాట్లాడడని ఆయన మీద నిందలు మోపుతూనే ఉంటుంది.

'నాకు అవసరం లేని విషయాల్లో, నాకు తెలియని విషయాల్లో నేనెందుకు తల దూర్చాలి' అంటుంటారు నాన్న. రిటైర్ అయిన దగ్గరనుండీ తన పనేదో తను చూసుకుంటూ పెట్టింది తింటూ, తన రాతలేవో రాసుకుంటూ, తను సేకరించిన పుస్తకాలు చదువుకుంటూ కాలం గడిపేస్తున్నారు.

ఆ రాత్రి భోజనాలు ముగిసిన తరువాత అందరం కాసేపు కబుర్లు చెప్పుకుని ఎవరికి కేటాయించిన గదుల్లోకి వాళ్ళం వెళ్లి నిద్రల్లోకి జారుకున్నాం.

అర్ధరాత్రి వేళ మెలకువ వచ్చి, మంచినీళ్ళు త్రాగుదామని హాల్లోకి వస్తే.. అక్కడ బెడ్‌లైట్ వెలుగులో డైనింగ్ టేబిల్ దగ్గర ఎవరో కూర్చుని ఉన్నట్లు అనిపించి ఉలిక్కిపడ్డాను. పరీక్షగా చూస్తే నాన్న.. చేతిలో అరిసెతో. నెమ్మదిగా చిన్న చిన్న ముక్కలుగా కొరుక్కుని తింటున్నారు. నా అలికిడి విని తలెత్తి నన్ను చూసినా గాబరాపడలేదు ఆయన.

"ఇంకా పడుకోలేదా?" అని వణుకుతున్న గొంతుతో అడిగి, అరిసె పూర్తి చేసి మంచినీళ్లు త్రాగి తన గదిలోకి వెళ్ళిపోయారు నెమ్మదిగా నడుచుకుంటూ.

'అయితే అమ్మ చెప్పింది నిజమేనన్నమాట. రోజంతా అందరూ స్వీట్స్ తింటూ తనకు ఇవ్వడం లేదని.. ఇలా రాత్రి పూట అందరూ నిద్రపోయిన తరువాత లేచి దొంగతనంగా మిఠాయిలు తింటున్నారన్న మాట' మనసులోనే అనుకున్నాను. ఆయన ఇలా చెయ్యడం నాకు కొంచెం కోపం తెప్పించిన మాట నిజం.

నాకు ఆయన మీద కోపం వచ్చింది.. మిఠాయిలు తింటున్నందుకు కాదు, ఆయన ఆరోగ్యం గురించిన బాధలోంచి వచ్చిన కోపమే అది. షుగర్‌వ్యాధి పెట్టుకుని స్వీట్స్ తినేస్తుంటే ఎలా? ఆ వ్యాధి పూర్తిగా తగ్గేది కాదనీ, దాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవలసిన బాధ్యత మనదేనని తెలిసి కూడా.. ఇలా బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తే, వ్యాధి మన చెప్పుచేతల్లో ఎలా ఉంటుంది? మందులు వాడి ప్రయోజనమేమిటి? ఇదే నా బాధకి కారణం. ఈ సంఘటనతో అమ్మ చెప్పింది నిజమే అని నిర్ధారణ అయింది నాకు.

నేనేం సమాధానం చెప్పకుండా మంచినీళ్లు త్రాగి మా గదిలోకి వెళ్లి నిద్రలోకి జారిపోయాను.

మరునాడు ఉదయం..

ఆడవాళ్లు ముగ్గురూ వంటగదిలో మధ్యాహ్నం వంట ప్రయత్నంలో ఉన్నారు. పిల్లలు పెరట్లో ఆడుకుంటున్నారు. బావగారు ఎవరో ఫ్రెండ్‌ని కలిసి వస్తానంటూ స్కూటర్ వేసుకుని బయటికి వెళ్లిపోయారు. నేను నాన్న గదిలోకి వెళ్ళాను. నాన్న మంచం

మీద కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు.

"టిఫిన్ అయ్యిందా నాన్నా?" అడిగేను. అందరి కంటే ముందే ఆయనకు అమ్మ టిఫిన్ పెట్టేసిందని తెలిసి కూడా.

"అయిపోయింది!" చెప్పేరు నాన్న పుస్తకం మూసి.

"కొత్త కథలేమైనా రాస్తున్నారా నాన్నా?" అడిగేను.. ఆ విషయంలో నాకు ఏ మాత్రం ఆసక్తి లేకపోయినా. నాన్న పత్రికలకు కథలు రాస్తుంటారు. ఆయన రాసినవి అన్నీ నేను చదవడం జరగనే జరగదు. నాకు కథలపై ఏ మాత్రం ఇంటరెస్ట్ లేకపోవడంతో.. ఆయనకు సాహితీ లోకంలో ఎంత పేరు ఉన్నదీ కూడా నాకు తెలియదు.

కావేరి మాత్రం ఆయన రచనలన్నీ ఇష్టపడుతుంది. వాట్సాప్‌లో ఆయన పంపిన కథల్ని తను ఉత్సాహంగా చదవడమే గాక అందులో ఆయన వెలిబుచ్చిన విషయాల మీద వాళ్ళ మావగారితో చర్చిస్తుంది కూడా. అంతే కాక 'మా మావయ్య గారు వ్రాసిన కథ' అని పేర్కొంటూ ఆ కథల్ని తన స్నేహితులకు, బంధువులకు, తను ఉన్న వాట్సాప్ గ్రూపులకూ ఫార్వార్డ్ చేస్తుంటుంది కూడా గర్వంగా.

"ఏవో రాస్తున్నానులే. అలవాటు పడిన చెయ్యి కదా. ఏదైనా ఆలోచన వస్తే కథ వ్రాయకుండా ఉండలేం నాలాంటి వాళ్ళం!" చెప్పేరు నాన్న.

కొంతకాలం క్రితం వరకూ పేపర్ మీద కలంతో రాసి కథలు పత్రికలకు పోస్ట్‌లో పంపించేవారు నాన్న.

కంప్యూటర్, సెల్‌ఫోన్లలో కథలు టైప్ చేసి, మెయిల్ ద్వారా పంపించడం ఎలాగో ఆయనకు మనవలు నేర్పించిన తరువాత, గత కొన్ని నెలలుగా తను రాసిన కథల్ని టైప్ చేసి, పత్రికలకు మెయిల్ ద్వారా పంపించడం మొదలుపెట్టేరట నాన్న.

"పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరిగే బాధ తప్పించార్రా!" అని మనవల్ని మెచ్చుకుంటుంటారు.

"నాన్నా! ఓ ముఖ్యమైన విషయం మీతో మాట్లాడుదామని వచ్చాను" ఉపోద్ఘాతంగా అన్నాను కాసేపు మాట్లాడిన తరువాత.

"ఏంటీ? మీ అమ్మ మళ్లీ ఏదైనా కొత్త కంప్లైంట్ చేసిందా నా మీద?" అలవాటైన నవ్వు నవ్వుతూ అన్నారు నాన్న.

"అదే నాన్నా! షుగర్‌వ్యాధి ఉంది కదా మీకు. మందులు కూడా వాడుతున్నారు. అటువంటప్పుడు ఇలా అర్ధరాత్రిళ్ళు లేచి దొంగతనంగా డబ్బాలు వెతుక్కుని స్వీట్స్ తినేస్తుంటే మీ ఆరోగ్యం ఏం కావాలి నాన్నా?" కొంచెం మందలింపుగానే అన్నాను.. అందులోనే నొచ్చుకోలు కూడా కలిపి.

"ఓ...అదా. రాత్రి చూశావు కదూ!" అని కాసేపు ఆగి "ఇలాంటి కంప్లైంట్ ఇంతకు ముందు ఎప్పుడైనా చేసిందా మీ అమ్మ?" అడిగేడు నాన్న.

"లేదు నాన్నా! మొన్ననే మొదటి సారి చెప్పింది. అదీగాక నిన్న రాత్రి మీరు తాపీగా కుర్చీలో కూర్చుని అరిసె తినడం నేను కళ్ళారా చూశాను కూడా కదా!" అన్నాను.

"నేను అలా ఎందుకు తినాల్సి వచ్చిందో మీ అమ్మ నన్నే డైరెక్ట్‌గా అడిగి ఉండవలసింది కదా. అవున్లే ఆవిడ నాతో మాట్లాడడం ఎప్పుడో మానేసింది కదా!" అన్నాడు నాన్న విరక్తిగా.

"ఇప్పుడు ఆ విషయాలు ఎందుకులే నాన్నా! మాట్లాడడక పోయినా మీకు అవసరమైన సదుపాయాలన్నీ సమకూరుస్తోంది కదా ఆవిడ!" అన్నాను. వాళ్ళు ఇద్దరి తగవుల్లో ఎవరి పక్షమూ వహించను నేను.

"తను అడిగితే చెప్పేవాడినే. అసలు విషయం తెలుసుకోకుండా ఇలా లేనిపోని కంప్లైంట్ లు చేస్తుంటే ఎలా అన్నదే నా బాధ!" అన్నారు నాన్న.

ఆయన గొంతులో ఒలుకుతున్న విచారం నేను గ్రహించాను.

"పోనీ ఇప్పుడు నేను అడుగుతున్నాను కదా! చెప్పండి అసలు విషయం ఏమిటో?" అడిగేను.

"మరేం లేదురా! ఆ మధ్యన ఒంట్లో నీరసంగా అనిపించడంతో బ్లడ్‌టెస్టులు చేయించుకుని ఆ రిపోర్ట్‌లు తీసుకుని డాక్టర్ దగ్గరకు వెళ్ళేను. ఆయన ఆ రిపోర్ట్‌లు అన్నీ చూసి 'షుగర్‌లెవెల్స్ బాగా పెరిగేయి' అని చెప్పి, మందుల డోస్ పెంచి కొత్త మందులు రాసేరు. అవి వాడుతుంటే బావుంది కానీ, ఒక్కొక్కసారి అర్ధరాత్రి పూట.. పెంచిన మందుల డోస్‌ల ప్రభావం వల్ల కాబోలు షుగర్‌లెవెల్స్ ఒక్క సారిగా పడిపోయి ఒళ్ళంతా చెమటలు పట్టి వణుకు వచ్చి నిద్రలోంచి మెలకువ వచ్చేస్తోంది. అలాంటి పరిస్థితి వస్తే వెంటనే లేచి ఏ చాక్లెట్టో, మరేదైనా స్వీటో తినమని చెప్పేరు డాక్టర్‌గారు ముందే చెప్పేరు. అలా అయితే షుగర్‌లెవెల్ మళ్లీ మామూలు స్థితికి వస్తుందట. ఈ వారంలో నిన్నటితో కలిపి ఇది మూడో సారి ఇలా అవడం!" వివరించి చెప్పేడు నాన్న.

అసలు సంగతి తెలుసుకోకుండా అమ్మ ఈ విషయంలో ఇంత రాద్ధాంతం చెయ్యడం ఎందుకు అనిపించింది నాకు.. నాన్న చెప్పిన వివరణ విన్న తరువాత.

నా మనసు తేలిక పడింది. వెంటనే కేబ్ బుక్‌చేసి నాన్నను డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళేను. ఆయన అన్ని పరీక్షలూ చేసి గాబరా పడవద్దని చెప్పి కొత్త మందులు కాస్త పవర్ తగ్గించి ఇచ్చేరు. రోజూ ఓ అరగంట వాకింగ్ కూడా చెయ్యమని సూచించారు.

ఆ తరువాత.. నాన్న అర్ధరాత్రి మిఠాయిల డబ్బాలు వెతుక్కోవడం లేదని ఫోన్‌లో చెప్పి నన్ను సంతోషపరిచిన అమ్మ, రోజూ వాకింగ్ పేరు చెప్పి మీ నాన్న రోడ్డు మీద వెళుతున్న ఆడవాళ్ళని చూస్తూ చొంగ కార్చుకుని వస్తున్నాడన్న కొత్త కంప్లైంట్ చేసి నవ్వించింది.

★★★★★

# సహజ నటుడు

ఆదోని బాషా



✆ 9440239828

**దీపావళి 2022 కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.**

***"ఏమండీ, ఇన్నాళ్ళూ మీరు గొప్ప నీతిమంతులనుకున్నాను. మీ మిత్రుడే మిమ్మల్ని అపార్థం చేసుకున్నాడనుకున్నాను. కాని పాతికేళ్ళ క్రితం అతని డబ్బు చోరీ చేసింది మీరే అని తెలిశాక.. ఈ వాస్తవాన్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. మీరు సినిమాల్లో సరిగ్గా నటించలేకపోయారు కానీ, మీ నిజజీవితంలో మాత్రం ఇన్నాళ్ళూ నీతిమంతుడి పాత్రలో చక్కగా నటించారు!"***

"ఏమండీ, మీ బాల్యమిత్రుడు రాంబాబుకి క్యాన్సర్ అని విన్నాను. నిజమేనా?" షూటింగ్ ముగించుకొని సాయంత్రం భర్త ఇంటికి రాగానే ఆత్రంగా అడిగింది మాలతి.

రాజేంద్ర దీర్ఘంగా నిట్టూర్చి సోఫాలో కూలబడ్డాడు. "నువ్వు విన్నది నిజమే. రాంబాబుకి క్యాన్సర్ ఆలస్యంగా బయటపడింది. త్వరగా చికిత్స చెయ్యకపోతే వాడు బతకడని చెప్పారట డాక్టర్లు. చికిత్సకి పది లక్షల దాకా ఖర్చవుతుందట. కాని రాంబాబు వద్ద చిల్లిగవ్వ లేదు. సినీ కళాకారుల సంఘం చందా వసూలు చేసి ఇస్తామన్నా వాడు ఒప్పుకోలేదట. వాడొక మొండిఘటం. వాడి మొండితనమే వాడి ప్రాణం తీస్తుందేమో. వాడి ఇంటికెళ్ళి వాణ్ణి పరామర్శించి రావాలనుకుంటున్నాను!" అన్నాడు రాజేంద్ర.

"కాని మీరిద్దరు పాతికేళ్ళ క్రితమే పోట్లాడుకొని విడిపోయారు కదా! ఇప్పుడు హఠాత్తుగా అతని ఇంటికెలా వెళతారు?"

"అప్పట్లో వాడి డబ్బు నేను దొంగిలించాననే అనుమానంతో వాడు నా పరువు తీశాడు. జీవితంలో మళ్ళీ నా ముఖం చూడనని చెప్పి వెళ్ళిపోయాడు. ఆనాటి నుంచి వాడు నిజంగానే నా ముఖం చూడలేదు. వాడిపై కోపంతో నేను కూడా వాణ్ణి కలవలేదు. కాని ఇప్పుడు వాడు మృత్యువు ముంగిట వున్నాడు. పాత విషయాల్ని మర్చిపోయి వాణ్ణి పరామర్శించటం మిత్రుడిగా నా బాధ్యత కదా."

"కాని మీలాగే మీ స్నేహితుడు కూడా ఆలోచించాలి కదా. మిమ్మల్ని అవమానించి ఇంట్లోంచి తరిమేస్తే ఎలా?"

"నిజమే! వాడు మొండిమనిషి. నువ్వు అన్నంత పనీ చెయ్యవచ్చు. అయినా వెళ్ళక తప్పదు. ఒకప్పుడు మేం ప్రాణ స్నేహితులం. ఈ ఒక్క విషయంలో తప్ప మేమెప్పుడూ పోట్లాడుకోలేదు. అందుకే వాడు తిట్టినా కొట్టినా సరే, వాడి ఇంటికెళ్ళి వాణ్ణి చూసొస్తాను." ఉద్వేగంగా అన్నాడు రాజేంద్ర.

"అలాగైతే నేను కూడా మీ వెంట వస్తాను, పదండి!" అంటూ మాలతి బట్టలు మార్చుకోవటానికి బెడ్‌రూమ్ లోకి వెళ్ళింది. రాజేంద్ర ఆలోచనల్లో పడ్డాడు.

★★★

రాజేంద్ర, రాంబాబు బాల్యంలో ప్రాణస్నేహితులు. ఒకే కంచంలో తిని ఒకే మంచంపై పడుకున్నవారు. బాల్యంలో ఇద్దరికీ సినిమా పిచ్చి ఉండేది. విడుదలైన ప్రతి సినిమాకి ఇద్దరూ జంటగా వెళ్ళేవారు. సినిమా నచ్చితే వీధి పిల్లల్ని జత చేసుకొని పక్కనే ఉన్న మైదానంలోకి వెళ్ళి ఆ సినిమాలోని ముఖ్యమైన సన్నివేశాల్ని ప్రదర్శించేవారు. అందంగా వుండే రాజేంద్ర హీరోగా నటిస్తే, విలన్ పాత్ర రాంబాబు పోషించేవాడు. మిగతా పాత్రల్ని వీధి పిల్లల చేత వేయించేవారు. రాంబాబు తండ్రి ఓ ఫోటోగ్రాఫర్. అప్పుడప్పుడు రాంబాబు కెమెరా తెచ్చి, కొన్ని సన్నివేశాల్ని ఫోటోలు తీసేవాడు. తర్వాత ఆ ఫోటోల్ని చూసి అందరు తెగ మురిసిపోయేవారు.



ఓసారి వేసవి సెలవుల్లో ఆ మైదానంలో ఎగ్జిబిషన్ పెట్టడంతో అక్కడ నటించటానికి అవకాశం లేక మిత్రులిద్దరు వూరి బయట స్మశానంలోకి వెళ్ళి, అక్కడ తమ ముచ్చట తీర్చుకున్నారు. ఆ రోజు సాయంత్రం చీకటి పడుతున్న, వేళ కాటికాపరి దూరం నుంచి వీళ్ళను చూశాడు. సమాధుల మధ్య గట్టిగా డైలాగులు చెబుతూ నటిస్తున్న వీళ్ళను దెయ్యాలనుకొని పరుగు లంకించుకున్నాడు. ఈ సంఘటన గుర్తొచ్చినప్పుడల్లా ఇద్దరు తెగ నవ్వుకొనేవారు.

కాలేజీలో చేరినా వారికి నటన పట్ల వ్యామోహం ఏ మాత్రం తగ్గలేదు. కాలేజీ వార్షికోత్సవాల్లో ప్రదర్శించే నాటకాల్లో ఇద్దరూ ఉత్సాహంగా పాల్గొనేవారు. అక్కడ కూడా రాజేంద్ర హీరో వేషం వేస్తే, రాంబాబు ఇతర పాత్రల్లో నటించేవాడు. అప్పట్లో రాజేంద్ర నటన సహజంగా లేదని ప్రేక్షకుల్లో కొందరు విమర్శించేవారు.

ఇద్దరూ డిగ్రీ చదివాక హైదరాబాద్ లోని ఓ యాక్టింగ్‌స్కూల్లో శిక్షణ తీసుకున్నారు. తర్వాత నగరంలోనే ఓ గది అద్దెకు తీసుకుని, సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలెట్టారు. కాని ఎంతమంది నిర్మాతల చుట్టూ తిరిగినా వారికి అవకాశాలు దొరకలేదు. చివరికి సినిమాలపై విరక్తి పుట్టి, ఇక సొంత వూరికి వెళ్లిపోవాలనుకున్నప్పుడు, రాంబాబుకి ఓ సినిమాలో చిన్న వేషం దొరికింది. ఆ తర్వాత కూడా అతనికి అడపాదడపా అవకాశాలు దొరకసాగాయి. కాని రాజేంద్రకి ఒక్క అవకాశం కూడా చిక్కలేదు.

ఓ దర్శకుడు దానికి కారణమేమిటో రాజేంద్రకి చెప్పాడు. "నువ్వు హీరో కావాలనుకుంటున్నావు తప్ప, ఏక్టర్ కావాలను కోవటం లేదు. నాటకాల్లో హీరో పాత్రలే వేయటం వల్ల నీ నటనలో వైవిధ్యం లేదు. హీరో పాత్ర అంటే ఒకే రకమైన నటన, మంచి రూపం, డ్యాన్స్, ఫైటింగులు! దానికి తోడు కొంత అదృష్టం కూడా ఉండాలి. కాని ఇతర పాత్రలకు అదృష్టం అక్కర్లేదు. రూపంతోనూ పని లేదు. నటనలో పరిపక్వత ఉంటే చాలు. కాబట్టి నువ్వు ఏ వేషం దొరికినా స్వీకరించు. నీకు నటుడిగా గుర్తింపు వస్తే, ఏదో ఒక రోజు హీరో వేషం కూడా దొరకవచ్చు!" అన్నాడు.

అయినా రాజేంద్ర ధోరణిలో మార్పు రాలేదు. ఎవరైనా తనకు హీరో పాత్ర ఇస్తే ఉచితంగా నటించటానికైనా సిద్ధమన్నాడు. అయినా ఎవరూ అవకాశం ఇవ్వలేదు. లోబడ్జెట్ సిన్మాలు తీసే కాంతారావు అనే నిర్మాత కొత్త నటులతో ఓ సినిమా తీయబోతున్నాడని తెలిసి, రాజేంద్ర రోజూ అతని ఇంటికి తిరగసాగాడు. అలా తిరగటం వల్ల కాంతారావు కూతురు సునీతతో

రాజేంద్రకు చనువు పెరిగింది. త్వరలోనే అది ప్రేమగా మారింది. తమ పెళ్ళికి తండ్రి ఒప్పుకోవాలంటే రాజేంద్ర హీరోగా పేరు తెచ్చుకోవాలంది సునీత. దాంతో రాజేంద్ర మరింత పట్టుదలగా హీరో అవకాశం కోసం ప్రయత్నించసాగాడు. అతను తన ప్రేమ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచాడు. చివరికి తన ప్రాణమిత్రుడు రాంబాబుకి కూడా చెప్పలేదు.

మరోపక్క రాంబాబు తీరిక లేకుండా నటిస్తున్నాడు. హీరో వేషం కోసం తిరుగుతున్న రాజేంద్రకి ఓరోజు కాంతారావు ఓ వింత ఆఫర్ ఇచ్చాడు. "నేను కొత్త నటీనటులతో లోబడ్జెట్ సిన్మా తీస్తున్నాను. అందులో ముగ్గురు హీరోలు, ముగ్గురు హీరోయిన్లు వుంటారు. ఎవరికీ పారితోషికం ఉండదు. పైగా అందరూ కొంత పెట్టుబడి కూడా పెట్టాలి. సినిమా హిట్టయితే పారితోషికంతో పాటు పెట్టుబడికి తగ్గట్టు లాభాలు ఇస్తాను. నీకు హీరో రోల్ కావాలంటే కనీసం లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టాలి!" అన్నాడు.

ఆ రోజుల్లో లక్ష రూపాయలు పెద్ద మొత్తమే! నెలనెలా ఖర్చుల కోసం తనకు డబ్బు పంపించే తండ్రి అంత సొమ్ము ఇవ్వలేడని రాజేంద్రకి తెలుసు. ఐతే రాంబాబు తను సంపాదించిన డబ్బులో సుమారు లక్ష రూపాయల్ని తమ గదిలోని బీరువాలో దాచాడన్న సంగతి కూడా అతనికి తెల్సు. కాంతారావు తనకు ఇచ్చిన ఆఫర్ గురించి రాజేంద్ర రాంబాబుకి చెప్పాడు. తనకు లక్ష రూపాయలు ఇస్తే సినిమా హిట్టయ్యాక లాభంతో సహా తిరిగి ఇస్తానన్నాడు. కాని రాంబాబు ఒప్పుకోలేదు. కొత్తవారితో తీసే సినిమా హిట్ అవుతుందన్న గ్యారంటీ లేదన్నాడు. మరోపక్క సురేష్ అనే కొత్త నటుడు రాజేంద్ర పాత్ర తనకిస్తే ఇప్పటికిప్పుడే లక్ష రూపాయలు ఇస్తానని ముందుకొచ్చాడు. దాంతో కాంతారావు వెంటనే డబ్బు కట్టకపోతే హీరో వేషం సురేష్‌కి ఇస్తానని రాజేంద్రకు చెప్పాడు. అప్పుడు సునీత రాజేంద్రను ఆదుకుంది. రహస్యంగా తన నగల్ని కుదువ పెట్టి లక్ష రూపాయలు సర్దుబాటు చేసింది. ఈ సంగతి ఎవరికీ చెప్పనని రాజేంద్రతో ఒట్టు వేయించుకుంది. రాజేంద్ర ఈ విషయం రాంబాబుకి కూడా చెప్పలేదు. అదే అతను చేసిన తప్పు!

యాదృచ్ఛికంగా అదే రోజు రాజేంద్ర, రాంబాబు వుండే గదిలో దొంగతనం జరిగింది. మిత్రులిద్దరు బయటికెళ్లినప్పుడు ఎవడో దొంగ మారు తాళంచెవితో తలుపు తెరిచి, బీరువాలో రాంబాబు దాచుకున్న డబ్బు ఎత్తుకుపోయాడు. రాంబాబు ఈ దొంగతనం గురించి పోలీస్ కంప్లైంట్ ఇచ్చాడు. కాని దొంగ దొరకలేదు.

మరోపక్క రాజేంద్రపై పగబట్టిన సురేష్.. ఈ దొంగతనం రాజేంద్రే చేసి లక్ష రూపాయలు కాంతారావుకి ఇచ్చి ఉంటాడని రాంబాబుకి చెప్పాడు. చోరీ జరిగిన రోజే రాజేంద్ర నిర్మాతకు డబ్బు ఇవ్వటం వల్ల రాంబాబుకి మిత్రుడిపై అనుమానం వచ్చింది. ఆ డబ్బు ఎలా వచ్చిందో చెప్పమని రాజేంద్రను నిలదీశాడు. సునీతకి మాటివ్వటం వల్ల రాజేంద్ర నిజం చెప్పలేకపోయాడు. రాజేంద్ర జవాబు చెప్పటానికి తటపటాయించటంతో రాజేంద్రే దొంగ అని రాంబాబుకి నమ్మకం కలిగింది. దాంతో అతను నిగ్రహం కోల్పోయి "ప్రాణ మిత్రుణ్ణి మోసం చేసిన నీ ముఖం ఈ జన్మలో చూడను!" అని చెప్పి రాజేంద్రతో శాశ్వతంగా తెగతెంపులు చేసుకున్నాడు.

మరోపక్క ఇన్ని ఇబ్బందులతో తొలి సినిమా అవకాశం చేజిక్కించుకొని రాజేంద్ర నటించిన ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది. దాంతో రాజేంద్ర సునీత నగల్ని విడిపించలేకపోయాడు. ఇక గత్యంతరం లేక సినిమాల్లో చిన్నా చితక పాత్రలు చేయసాగాడు. అలా ఏడాది కష్టపడి నగలు విడిపించాడు. ఇక అతను హీరోగా ఎదగలేడని గ్రహించిన సునీత, అప్పటికే హీరోగా ఎదిగిన సురేష్‌ని పెళ్ళి చేసుకుంది. ఓ వైపు ప్రాణమిత్రుడు, మరోవైపు ప్రేమించిన యువతి దూరం కావటంతో రాజేంద్ర బాధతో కుంగిపోయాడు.

అప్పుడే అతనికి మాలతితో పరిచయమైంది. ఆమె ఒక కొత్త నటి. మాలతి ముక్కుసూటితనం, నిజాయితీ పట్ల రాజేంద్ర ఆకర్షితుడయ్యాడు. సునీతను మర్చిపోయి మాలతి ప్రేమలో పడ్డాడు. దొరికిన పాత్రల్లో ఉత్సాహంగా నటిస్తూ పరిశ్రమలో నిలదొక్కుకున్నాడు. మాలతి కూడా అతన్ని ఇష్టపడటంతో ఇద్దరు పెళ్ళి చేసుకున్నారు. రాజేంద్ర ఆమెకు తన పాత ప్రేమ గురించి ఎన్నడూ చెప్పలేదు. తర్వాత ఇద్దరు సినిమాల్లో నటిస్తూ బాగా సంపాదించారు. సొంత ఇల్లు, కారు సమకూర్చుకున్నారు. ఇప్పటికీ ఇద్దరూ వయసుకు తగ్గ పాత్రల్లో నటిస్తూనే వున్నారు. ఎన్నో ఏళ్ళ అనుభవమున్నా రాజేంద్ర నటనలో సహజత్వం లేదని మాలతి అప్పుడప్పుడు భర్తను విమర్శిస్తూ ఉంటుంది.

మరోపక్క కొంతకాలం వివిధ పాత్రల్లో నటించి, బాగా డబ్బు సంపాదించిన రాంబాబు సొంతంగా రెండు సినిమాలు తీశాడు. అవి ఫ్లాప్ కావటంతో ఉన్న డబ్బంతా పోయింది. అతను ప్రస్తుతం భార్య, ఇద్దరు పిల్లలతో నగర పొలిమేరల్లో గల ఓ పాత ఇంట్లో అద్దెకుంటున్నాడు. రాంబాబుకి అభిమానమెక్కువ. తనకు ఎన్ని కష్టాలు వచ్చినా ఎవరి ముందూ చెయ్యి చాచలేదు. ఇప్పుడు కూడా క్యాన్సర్ చికిత్సకి సాయం అందించటానికి సినీ కళాకారుల సంఘం ముందుకొచ్చినా అతను సున్నితంగా తిరస్కరించాడు.

★★★

రాజేంద్ర, మాలతి కారులో రాంబాబు ఇంటికి చేరుకున్నప్పుడు, శిథిలావస్థలో ఉన్న ఆ ఇంటిని చూసి మాలతికి బాధ కలిగింది. కారు ఆగిన శబ్దం విని రాంబాబు భార్య బయటికొచ్చింది. విషయం చెప్పగానే ఆమె వారిని సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించింది. పండ్ల సంచి ఆమెకు అందించి ఇద్దరు ఇంట్లోకి అడుగుపెట్టారు.

లోపలి గదిలో మూలుగుతూ మంచంపై పడుకుని వున్నాడు రాంబాబు. రాజేంద్ర దంపతులు వచ్చారని భార్య చెప్పగానే దిగ్గున లేచి కూర్చున్నాడు. "ఎందుకొచ్చావురా, నీ ముఖం ఈ జన్మలో చూడనని పాతికేళ్ళ క్రితమే చెప్పాను కదా!" రాజేంద్ర వైపు చూడకుండానే నిష్టూరంగా అన్నాడు రాంబాబు.

"నువ్వు నా ముఖం చూడనన్నావుగాని నేను నీ ముఖం చూడననలేదుగా. నిన్ను చూడ్డానికొచ్చాను!" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు రాజేంద్ర. పక్కనే మరో కుర్చీలో మాలతి కూర్చుంది.

"నమ్మక ద్రోహం చేసిన మిత్రుడు శత్రువు కన్నా ప్రమాదకారి అంటారు పెద్దలు." మరోసారి కఠినంగా పలికాడు రాంబాబు.

"నేనేమీ నీకు ద్రోహం చెయ్యలేదురా. అయినా ఇప్పుడా విషయం మాట్లాడి ప్రయోజనం లేదు. నీ క్యాన్సర్ ట్రీట్మెంట్ గురించి ఆలోచించు!" శాంతంగా అన్నాడు రాజేంద్ర.

"అదే కదా నా బాధ. నువ్వు చోరీ చేసిన ఆ డబ్బును నేను ముందే జాగ్రత్తపడి బ్యాంకులో పొదుపు చేసి ఉంటే, అవి ఈపాటికి పది లక్షలయ్యేవి. నా చికిత్సకి సరిపోయేవి. ఇప్పుడైనా నిజం చెప్పరా. ఆ డబ్బు నువ్వే తీశావ్ కదూ. కనీసం చనిపోయే ముందు నిజం తెల్సుకొని కన్నుమూస్తాను!" ఉద్వేగంగా అన్నాడు రాంబాబు.

రాజేంద్ర ఒక్క క్షణం మౌనంగా వుండిపోయాడు. తర్వాత హఠాత్తుగా అన్నాడు. "ఇక నిజం చెప్పకపోతే నాకూ మనశ్శాంతి వుండదురా. ఆరోజు నీ లక్ష రూపాయలు నేనే తీశాను. వెంటనే డబ్బు కట్టకపోతే నా స్థానంలో మరో హీరోని తీసుకుంటానని ఆ నిర్మాత నాకు వార్నింగ్ ఇచ్చాడు. ఆ అవకాశం పోతే మళ్ళీ హీరో కాలేనని భయపడి క్షణికావేశంలో డబ్బు తీసుకున్నాను. సినిమా హిట్టయ్యాక లాభంతో సహా నీకు డబ్బు ఇచ్చి క్షమించమని అడుగుదామనుకున్నాను. కాని ఆ సినిమా ఫ్లాప్ కావటంతో నీకు డబ్బు ఇవ్వలేకపోయాను." తల వంచుకొని అన్నాడు రాజేంద్ర.

భర్త మాటలు విని మాలతి నివ్వెరబోయింది. రాంబాబు ముఖం కోపంతో ఎర్రబడింది. "ఆ రోజే నన్ను బతిమిలాడి ఉంటే ఆ డబ్బు నీ ముఖాన కొట్టేవాణ్ణి. ఎందుకు చోరీ చేశావ్? ఒకవేళ చేసినా తర్వాత ఎందుకు ఒప్పుకోలేదు?" అంటూ నిలదీశాడు.

"నీ స్వభావం గురించి నాకు బాగా తెలుసురా. నేను అప్పుడే తప్పు ఒప్పుకున్నా నువ్వు క్షమించేవాడివి కాదు. నీ చేతిలో డబ్బు పెట్టి వాస్తవం చెబితే అప్పుడు నీ కోపం చల్లారుతుందనుకున్నాను. కాని చాలాకాలం వరకూ నా ఆర్థికస్థితి మెరుగుపడలేదు. అయితే ఇప్పుడు నేను మంచి స్థితిలో వున్నాను. నీ డబ్బు నీకు వడ్డీతో సహా చెల్లించటానికొచ్చాను" అంటూ రాజేంద్ర జేబులోంచి చెక్‌బుక్ తీసి, పదిలక్షలకు చెక్కు రాసి మిత్రుని చేతిలో పెట్టాడు.

అది చూసి రాంబాబు ఆశ్చర్యపోయాడు. "నీ సాయం నాకు అక్కర్లేదురా" అంటూ చెక్కు తిరిగి ఇవ్వబోయాడు.

"సాయం కాదురా, ఇది నీ డబ్బే! అప్పుడు నేను తీసుకున్న డబ్బును ఇప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తున్నాను. నీ డబ్బుతోనే నీ జబ్బుకి చికిత్స చేయించుకో!" అంటూ రాజేంద్ర లేచి నిల్చున్నాడు.

రాంబాబు అప్రయత్నంగా తలెత్తి రాజేంద్ర ముఖాన్ని చూశాడు. పాతికేళ్ళ తర్వాత తొలిసారి అతనలా మిత్రుడి కళ్ళల్లోకి సూటిగా చూశాడు. రాజేంద్ర కళ్ళల్లో పశ్చాత్తాపంతో కూడిన కన్నీళ్ళున్నాయి; రాంబాబు కళ్ళల్లో స్నేహంతో కూడిన కృతజ్ఞతా భావముంది. ఇద్దరి మనసులు ఒకేసారి కుదుట పడ్డాయి.

★★★

రాంబాబు ఇంటినుంచి తిరిగొస్తున్నప్పుడు దారిలో మాలతి భర్తపై కోప్పడింది. "ఏమండీ, ఇన్నాళ్ళు మీరు గొప్ప నీతిమంతులనుకున్నాను. మీ మిత్రుడే మిమ్మల్ని అపార్థం చేసుకున్నాడనుకున్నాను. కాని పాతికేళ్ళ క్రితం అతని డబ్బు చోరీ చేసింది మీరే అని తెలిశాక.. ఈ వాస్తవాన్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. మీరు సినిమాల్లో సరిగ్గా నటించలేకపోయారు కానీ, మీ నిజజీవితంలో మాత్రం ఇన్నాళ్ళు నీతిమంతుడి పాత్రలో చక్కగా నటించారు!" ఉక్రోషంగా అంది.

"నీ మాట కొంతవరకు నిజమే సుమా! సినిమాల్లో నేను సహజనటుణ్ణి కాను. కాని నిజజీవితంలో సహజంగా నటించగలనని ఇప్పుడే అర్థమైంది నాకు కూడా. నా నటనతో నా మిత్రుడినే కాదు నిన్ను కూడా మోసం చెయ్యగలిగాను!" నర్మగర్భంగా అన్నాడు రాజేంద్ర.

"మీరేమంటున్నారో నాకు అర్థం కావటం లేదు?" తల గోక్కుంటూ అంది మాలతి.

"ఇంకా అర్థంకాలేదా? రాంబాబుకి అభిమానమెక్కువ. వాడి చికిత్సకోసం నేను డబ్బు ఇస్తానంటే ప్రాణమైనా వదులుతాడుగాని, నా సాయం తీసుకోడు.. ఎందుకంటే వాడి దృష్టిలో నేనొక నమ్మకద్రోహిని. ఈ స్థితిలో వాడికి సాయం చెయ్యటానికి నాకు ఒక్కటే మార్గం కనపడింది. నేను చెయ్యని నేరాన్ని నెత్తిన వేసుకొని వాడి డబ్బుకు వడ్డీ కలిపి వాడు ఆశించినంత డబ్బు ఇచ్చేశాను. మొదట మొహమాటపడ్డా, అది తనకు న్యాయంగా రావాల్సిన డబ్బే అనుకుని వాడు తీసుకున్నాడు. వాడి దృష్టిలో నేనొక దొంగగా మారినా నాకు బాధ లేదు. ఆ డబ్బుతో వాడు క్యాన్సర్‌కి చికిత్స చేయించుకొని క్షేమంగా ఉంటే చాలు. ఎందుకంటే వాడు నా ప్రాణమిత్రుడు!" గద్గద స్వరంతో పలికాడు రాజేంద్ర.

ఆ మాటలు వినగానే భర్త వైపు ఆరాధనగా చూసింది మాలతి. "స్నేహంలో త్యాగాలు చేస్తారని విన్నాను కానీ, నిందల్ని మోస్తూ కూడా త్యాగాలు చేస్తారని వూహించలేదు. స్నేహానికి మారుపేరైన మీవంటి త్యాగమూర్తికి భార్య అయినందుకు నాకెంతో గర్వంగా ఉందండీ." భర్త చేతిపై చెయ్యేసి ఆప్యాయంగా పలికింది మాలతి.

★★★★★

# తిలా పాపం...తలా పిడికెడు

Ch.V.S.S. పుల్లంరాజు



✆ 8639868875

***మొలలోతు నీళ్లలో నడుస్తున్నారు వాళ్ళు. కొన్ని విల్లాలు పూర్తిగా మునిగిపోయాయి. వర్షం నీరు అన్ని ఇళ్ళలోనూ చేరింది. గృహోపకరణాలు, విలువైన ఫర్నిచర్, ఖరీదైన, విలాసవంతమైన విదేశీ కారులు నీట మునిగి నానుతున్నాయి. నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిన పాములు కిటికీ చువ్వలకి చుట్టుకున్నాయి. విద్యుత్ కోతలూ, చీకటిలో బిక్కు బిక్కు మంటూ అరిచేతిలో ప్రాణాలు పెట్టుకొని భగవంతుడి మీద భారం వేసిన పెద్దలూ, ఆకలికి వెక్కి వెక్కి ఏడుస్తున్న పిల్లలూ.. అక్కడి పరిస్థితి అత్యంత దయనీయంగా వుంది!***

ఆన్‌లైన్ సమావేశం ముగించుకుని, లాప్టాప్ కట్టివేస్తూ, సమావేశంలోని చర్చల గురించిన ఆలోనలతోనే, బెడ్‌రూమ్ లోకి వెళ్ళబోతూ, హాల్లో సోఫాలో కూర్చున్న తండ్రిని చూసి ఆశ్చర్యపోయాడు విష్ణు.

రాత్రి ఒంటిగంటవుతోంది.

బెడ్‌లైట్ వెలుతురులో తండ్రి స్పష్టంగా కనిపించాడు. ప్యాంట్ మీద టీషర్ట్ వేసుకొని, పైన జెర్కిన్ వేసుకొని, గడ్డం కింద చెయ్యి పెట్టుకొని దీర్ఘాలోచనలో ఉన్నాడు.

నెమ్మదిగా తండ్రి దగ్గరకెళ్ళి, భుజంమీద. చేయి వేసి, "నాన్నా! ఎలా వుంది ఒంట్లో? ఆసుపత్రికి వెళదామా?" అన్నాడు విష్ణు.

ఆలోచనల నుండి తేరుకుని "అబ్బే అదేం లేదురా విష్ణు! శ్రీదేవి ఫోన్ చేసింది పావుగంట క్రితం.. ఏదో ఒకటి చేయాలిరా అర్జంటుగా..." ఆవేదనతో గొంతులోంచి మాటలు రావడంలేదాయనకు.

"అలాగే నాన్నా..తప్పకుండా! చెప్పండి. శ్రీదేవి ఎందుకు ఫోన్ చేసింది? పోనీ సాగర్‌కి ఫోన్ చేసి, విషయం కనుక్కుంటా!" అంటూ చేతిలోకి చరవాణి తీసుకున్నాడు.

"లేదురా! వాడు ఆఫీస్ పని మీద సింగపూర్ వెళ్ళి రెండు రోజులయిందట. అదికాదు సమస్య. కురుస్తున్న భారీ వర్షానికి, ఇంటి లోపలికి వర్షంనీరు వచ్చిందట, ఏమి చేయాలో పాలుపోవడంలేదనీ, పిల్లలిద్దరూ నిద్రపోతున్నారనీ, విద్యుత్ కోత కూడా ఉండొచ్చనీ గాబరాపడుతూ ఫోన్ చేసింది. అందుకే ఏమి చేయాలా అని ఆలోచిస్తూ, నీ కోసం ఎదురు చూస్తున్నా!" అన్నాడాయన బాధగా.

"అయ్యో! అలాగా! వెళ్ళి వాళ్ల పరిస్థితి చూసి వస్తా!" అంటూ కారు తాళాలు తీసుకోవటానికి నిలబడ్డాడు విష్ణు.

"పద. ఇద్దరం వెళదాం" అంటూ సోఫా లోంచి లేచి నిలబడ్డ తండ్రి కేసి చూస్తూ,

"ఇంత రాత్రివేళ మీకెందుకు శ్రమ, అక్కడ పరిస్థితి ఎలా వుందో ఏమిటో..." అన్నాడు విష్ణు.

"అవును నా బాధ కూడా అదేరా. పాపం వాళ్ళు ఎలా వున్నారో.. నా గురించి ఆలోచించకు. ఇంట్లో వున్నా, నిద్ర పట్టదు. కాదనకు." అంటూ గొడుగు, టార్చ్‌లైట్, తీసుకొని విష్ణు వెనుక అడుగు వేశాడు సీతారాం.

★★★

"నాన్నా, అది అత్యంత అందమైన, విశాలమైన, సంపన్నవర్గాలకే పరిమితమైన, బెంగళూరుకే తలమానికమైన అద్భుతమైన ప్రాజెక్ట్. ఒకొక్క విల్లా ఖరీదు సుమారు పది కోట్లు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కొన్ని కంపెనీల సి.ఇ.ఓ. లు, క్రికెట్ క్రీడాకారులు, చలనచిత్ర ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలు తప్ప ఇంకెవ్వరూ అక్కడ కాలు పెట్టలేరు. సాగర్ రెండు విల్లాలు బుక్ చేశాడట. ఒకటి నా కోసమట.." చెబుతున్న విష్ణు మాటలకి స్పందిస్తూ, "నిస్సందేహంగా సాగర్ స్నేహపాత్రుడే! అతను పారిశ్రామికవేత్త. కానీ, నువ్వు ఉద్యోగివి!" అంటూ మంచినీళ్ల గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు సీతారాం.

ఆ మాటలకి, తండ్రి కేసి కొంచెం గుర్రుగా చూడసాగాడు విష్ణు.

"డబ్బు సర్దుబాటు ఎంత ముఖ్యమో, దస్తావేజులు, 'రెరా' వంటి అనుమతులుతో బాటు, ఇతర మౌలిక, సాంకేతిక విషయాలన్నీ కూడా అంతే ముఖ్యం. అన్నీ పరిశీలించాలి, తొందరపడొద్దు..." అంటున్న తండ్రి మాటల్ని మధ్యలో ఖండిస్తూ, "నాన్నా, మీది మరీ చాదస్తం, తొందరపడొద్దు కాదు, పడాలి. కోట్ల రూపాయల పెట్టుబడులు, ప్రభుత్వాన్ని కూడా శాసించగల బిగ్ షాట్స్, అక్కడ విల్లాలు కావాలని క్యూ కడుతున్నారు. ఋణాల మంజూరు కోసం తపిస్తున్నబ్యాంకు అధికారులు.. చూడండి మీకే తెలుస్తుంది!" అంటూ ఆ ప్రాజెక్టు తాలూకు బ్రోషర్లు తండ్రి ముందుంచి గదిలోకి విసవిసా నడిచాడు విష్ణు.



కళ్లజోడు సవరించుకొని, సావధానంగా ఆ బ్రోషర్లు చదువుతుంటే, ఆయన భార్య వర్ధనమ్మ వంటింటిలోంచి బయటకు వచ్చి, నెమ్మదిగా, "కాస్తంత పిల్లాడి మాట కూడా వినండి. పసిపిల్లాడు కాడుగా.. తమరంత కాకపోయినా, కాస్తంత బుద్ధీ , లోకజ్ఞానం వున్నవాడేగా. విల్లా కొనాలని మోజుగా వుందేమో... మీ కెందుకంత పంతం? రాజమండ్రి మనం వెళ్లేదా, వుండేదా? ఎందుకా వెర్రి కాపీనం? ఆ ఇల్లు అమ్మి పడేసి, డబ్బు సర్దుబాటు చేయడానికి ఏమిటట అభ్యంతరం? కాలాతీతమైతే, కాకులు తన్నుకు పోయాయట కలిసి వచ్చిన అదృష్టాన్ని" అంటూ కొడుకుకి వత్తాసు పలికి, మళ్లీ వంటింటిలోకి దూసుకు పోయింది.

'దీని వ్యవహారం ఎప్పుడూ ఇంతే. కొడుకు ఏమంటే దానికి 'తందాన తానా' అంటూ వంత పాడుతుంది' అని మనస్సులో అనుకొని, ఫోన్ తీసుకుని వారసత్వంగా వచ్చిన రాజమండ్రి ఇంటిని అమ్మకానికి బ్రోకర్‌తో మాట్లాడాడు.

★★★

"విష్ణూ మళ్లీ వారంలో అడ్వాన్స్ బుకింగ్‌గా ఇరవై శాతం కట్టేయాలి. నువ్వు రెడీ కదా? అతి కష్టం మీద బిల్డర్‌ని ఆపాను. నీ విల్లా కోసం మినిస్టర్ నుంచి ఒకటే ఒత్తిడి, తూర్పు ఈశన్యం గుమ్మానికి చాలా డిమాండ్.. తెలుసు కదా. సరే బిల్డర్ ఫోన్ చేస్తున్నాడు. మళ్లీ చేస్తా. వుంటా..." అంటూ ఫోన్ కట్ చేశాడు సాగర్.

ఫోన్ స్పీకర్ ద్వారా భార్య, తల్లి, తండ్రి కూడా వాళ్ల సంభాషణ విన్నారు.

"మన కోసం చాల కష్టపడుతున్నాడు సాగర్. డబ్బు కట్టేస్తే, విల్లా మన పేరున బుక్ అవుతుంది. మిగిలినది మూడు నాలుగు నెలల్లో .." విష్ణు కేసి చూస్తూ అంది అతని భార్య శ్వేత.

తన బంగారం నగల్ని కూడా అమ్మేసి, ఎలాగైనా విల్లా కొనాలని ఆమె పట్టుదలగా వుంది. అందమైన విల్లాలో, తనని మహారాణిగా తలచుకొంటూ ఊహాల్లో విహరిస్తోంది కూడా!!

★★★

డబ్బు సర్దుబాటు చేయడానికి సమయం సరిపోతుందో లేదోనని మనసులో బెంగగా వుంది విష్ణుకి. రాత్రి భోజనానంతరం వాకిట్లో నడుస్తున్న తండ్రి దగ్గరకెళ్ళి విషయం కదిపాడు. ఇద్దరు కలిసి జామచెట్టు క్రిందున్న సిమెంట్ బెంచ్ మీద చతికిలబడ్డారు.

"కోట్ల రూపాయల పెట్టుబడి! అన్ని కోణాల్లోంచి నిశితంగా పరిశీలించాలి." అన్నాడాయన ఉపోద్ఘాతంగా కొడుకు కళ్ళలోకి చూస్తూ. 'నువ్వు అన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేశావా?' అనే ప్రశ్న కూడా ధ్వనించేలా.

"అవును.,. అవును నాన్నా" అన్నాడు తత్తరపాటుగా.  ఆ తడబాటులోనే తెలుస్తుంది అతని పొరపాటు.

అది కప్పిపుచ్చుకోవడానికి "సాగర్ పేరు మోసిన లాయరుతో అన్ని విషయాలు వివరంగా చర్చించాడట, అన్నీ సక్రమంగా వున్నాయట." అన్నాడు గంభీరంగా.

"ఒక పెద్ద చెఱువుని కప్పిపెట్టి, వంద సంవత్సరాల చెట్లని నరికి, కొన్ని చోట్ల మురుగునీటి కాల్వలని కప్పేసి, మసి పూసి మారేడు కాయ చేసి..." అంటున్న తండ్రి మాటలకి ఖిన్నుడయ్యాడు విష్ణు.

"ఇవన్నీ న్యూస్‌పేపర్లో వచ్చిన సంగతులు నాన్నా. నమ్మలేం. లోపాలులేని ప్రాజెక్ట్ ఏదీ వుండదు నాన్నా." అన్నాడు.

"కావచ్చురా. అమ్ముకొని, జేబులో డబ్బులేసుకొని దర్జాగా జారిపోతాడు బిల్డరు. భవిష్యత్తులో సమస్యలు వస్తే, రక్షించగలిగేది ఎవరూ వుండరు, బ్యాంకులు తమ అప్పు తీర్చమని, మన పీకమీద కూర్చుంటాయి. అడకత్తెరలో పోకచెక్కలా వుంటుంది మన పరిస్థితి" అంటూ ఆగాడు ఆయన.

"మీరు చెప్పింది నిజమే కానీ, బిల్డర్ అలాంటి వాడు కాదు. ఈ ప్రాజెక్టులోని కస్టమర్స్ అందరూ పలుకుబడీ, హోదా వున్న వాళ్లు. బిల్డరు తోక జాడిస్తే, సాగర్ లాంటి వాళ్ళు, కోర్టుకి లాగి, వాడి మెడలు వంచి అంతు తేలుస్తారు. తోక తెగ కోస్తారు." అంటూ నవ్వాడు.

అప్పటి దాకా గుమ్మంలో నిలబడిన అత్తాకోడళ్ళు, విష్ణు దగ్గరకి వచ్చి నిలబడ్డారు.

"వాడికి పిరికి మందు నూరి పోయకండి, ఐనా అనుమానం ముందు పుట్టి తరువాత మీరు" అంది తల్లి కోపంగా.

"అమ్మా! ఆగు, డబ్బులు ఎలా సిద్ధం చేయాలా అని ఆలోచిస్తున్నా. రాజమండ్రి ఇంటి డబ్బులున్నాయి, కానీ, అనుకోకుండా నా లోను ఎమౌంట్ తగ్గడడం వలన సమస్య వచ్చింది. అప్పటికీ శ్వేత నగలమీద కూడా అప్పు తీసుకొన్నా" అంటున్న కొడుకు మాటల్ని వినకుండా

"ఒరే విష్ణు! ఇదిగో, నా నగలు అమ్మేసెయ్" అంది ఆవేశంగా చేతి గాజులు తీసిస్తూ.

నవ్వుతూ తల్లి కేసి చూస్తూ.. "అవన్నీ పాత నగలమ్మా! ఆ నగలతో వచ్చే సొమ్ము, ఎలాగూ సరిపోదు. వదిలేయ్. సాగర్‌తో మాట్లాడతా. చూద్దాం ఏమి జరుగుతుందో!" అన్నాడు విష్ణు.

అందరూ భారంగా కదిలి, నిద్రకుపమిక్రమించారు.

★★★

దాదాపు కిలోమీటర్ దూరంలో కారు ఆపి, నడవడం ప్రారంభించారు తండ్రి కొడుకులు. బెంగళూర్‌కి గర్వకారణంగా చెప్పబడిన ఆ గేటెడ్ కమ్యూనిటీ, కురిసిన భారీ వర్షాలకు దారుణంగా దెబ్బతిని, పెద్ద జలాయశాన్ని తలపిస్తోంది. మొలలోతు నీళ్లలో నడుస్తున్నారు వాళ్ళు. కొన్ని విల్లాలు పూర్తిగా మునిగిపోయాయి. వర్షంనీరు అన్ని ఇళ్ళలోనూ చేరింది. గృహోపకరణాలు, విలువైన ఫర్నీచర్, ఖరీదైన, విలాసవంతమైన విదేశీ కారులు నీట మునిగి నానుతున్నాయి. నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిన పాములు, కిటికీ చువ్వలకి చుట్టుకొన్నాయి. విద్యుత్ కోతలూ, చీకటిలో బిక్కు బిక్కుమంటూ, అరిచేతిలో ప్రాణాలు పెట్టుకొని భగవంతుడి మీద భారం వేసిన పెద్దలూ, ఆకలికి వెక్కి వెక్కి ఏడుస్తున్న పిల్లలూ.. అక్కడి పరిస్థితి అత్యంత దయనీయంగా వుంది!

మురికి కాలువలు పొంగిపోవడంతో, భరించలేని దుర్వాసన అంతా ఆక్రమించింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆ నీరు కూడా ఇటువైపు రావడంతో, అధికారగణం ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో తల పట్టుకొన్నారు. జాతీయ విపత్తు స్పందనా దళం బాధితులను రక్షించే పనిలో శ్రమిస్తున్నారు.

అతి కష్టం మీద సాగర్ ఇంటికి చేరుకుని, ఒక ట్రాక్టర్ మీద సాగర్ భార్య శ్రీదేవిని, వాళ్ల పిల్లల్ని ఎక్కించి, తెల్లవారిన తర్వాత కారులో తన ఇంటికి క్షేమంగా తీసుకొని వచ్చారు వాళ్ళు.

★★★

"అన్నీ మన మంచికే అంటారు కదా! రాజకీయ ఒత్తిడికి బిల్డరు తలొగ్గి, విష్ణుకి కేటాయించిన విల్లాను ఒక మినిస్టర్‌కి బదిలీ చేయడం మంచిదే అయ్యింది" అన్నాడు సీతారాం సాలోచనగా.

"ఆ రోజున సాగర్‌తో పాటు మనమందరం చాల నిరాశ నిస్పృహలు చెందాం. సాగర్ మీద కోప్పడ్డాను కూడా" అన్నాడు విష్ణు పశ్చాత్తాపంతో .

"భారీ వర్షాలు కురవడంతో ఈ ప్రాజెక్టు లోపాలూ, అసలు రంగూ బయటపడ్డాయి." అంది శ్రీదేవి. ప్రాణభయం తాలుకు ఛాయలు ఇంకా ఆమె కళ్ళలో కనిపిస్తున్నాయి.

"విచక్షణ లేకుండా, ప్లాస్టిక్ కవర్లు వాడి, ఎక్కడ పడితే అక్కడ పడేస్తాం. మురికికాలువలో కొబ్బరిబోండాల నుంచి ఏది పడితే అది విసురుతాం. మన బాధ్యతలనూ, కర్తవ్యాన్నీ నిర్లక్ష్యం చేస్తాం. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతాం. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు□ఆ పాపంలో మనమందరం కూడా భాగస్వాములమే" అని సీతారాం చెబుతూంటే,

"ఏవండీ చూశారా, ఆ బిల్డరుని జైలులో పెట్టాలని ముఖ్యమంత్రి ఇంటి ముందు ప్రతిపక్షపార్టీలు ధర్నా చేస్తున్నారట. టీవీలో చూపిస్తున్నారు, చూడండి." అంది వర్ధనమ్మ గొంతు చించుకొంటూ.

“ఇదో పెద్ద డ్రామా. మన విల్లా కొన్నది ఎవరో తెలుసా అత్తయ్యా?” అంది శ్వేత.

శ్రీదేవి, విష్ణు, శ్వేత నవ్వుతుంటే, “మీడియా ప్రతినిధుల ముందు, మైకులో గట్టిగా, ఇరవైనాలుగు గంటల్లో, వర్షం నీరు లేకుండా చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోతే, ఆత్మహత్య చేసుకొంటానని శపథం చేస్తున్నాడు కదా.. ఆ మహానుభావుడే!” అన్నాడు విష్ణు.

ఆశ్చర్యంతో, నోట మాట రాక బిగిసిపోయిన వర్ధనమ్మని చూసి, “ఇలాంటి వింతలు, విశేషాలు చాలా వున్నాయి. వీలు వెంబడి చెప్పుకుందాం కానీ, గదిలో నిద్రపోతున్న పిల్లల్ని లేపి, వేడివేడిగా టిఫిన్, టీ ఇవ్వు!” అన్నాడు సీతారాం భార్యతో.

★★★★★

# పడమర ప్రమిద

మాధురి ఇంగువ (ఇంగ్లండ్)



✆ 9581283839

***"కాదు పిన్నీ.. నేనే అదృష్టవంతుడిని. మా ఆవిడే నన్ను కెనడాకి తీసుకువెళ్ళింది. అక్కడే మాకు బాబు పుట్టాడు. వాడికి ఇంగ్లీష్ చదువు నేర్పుతూనే... వేదం కూడా నేర్పుతున్నాను"అన్నాడు. మరింత ఆశ్చర్యపోయింది వర్ధని. "ఆ పిల్ల సాఫ్ట్వేర్ ఇంజనీరా ? ఎలా తీసుకెళ్ళిందిరా కెనడాకి?"***

అది 2016. శ్రావణ మాసం.

హైదరాబాద్ లోని భాగ్యనగర్ కాలనీలో అచ్యుతరావు, ప్రమద్వరగార్ల ఇల్లు. ఆ రోజు వారి అమ్మాయి ప్రబంధకి పెళ్లిచూపులు.

"ఇదేనా అమ్మాయ్ నువ్వు రాసిన పుస్తకం" అంటూ ప్రబంధ రాసిన "అక్షరం" అనే పుస్తకం చొరవగా తీసుకొని చదవసాగింది వర్ధని.

ఆవిడ వయసు 56... ఒకప్పటి తెలుగక్షరాల్లా! కానీ బుద్ధి పూజ్యం. ఇప్పటి టెంగ్లీష్ లోని తెలుగులా!

ఆవిడ, మ్యారేజి బ్యూరో శ్రీనిధి గారితో కలిసి, ప్రబంధని చూసుకోడానికి వచ్చింది. ఆవిడకి నచ్చితే మర్నాడు పెళ్ళికొడుకుని మిగతా కుటుంబసభ్యులనీ తీసుకొని రావాలని ఆలోచన.

ప్రబంధతో పాటు ఆమె తల్లిదండ్రులు అచ్యుతరావు, ప్రమద్వర కూడా కూర్చున్నారు. ఆవిడ ఏమేమి అడుగుతుందో తెలియక, ఇంటర్వ్యూకి వచ్చిన కొత్త విద్యార్థిలాగా అవసరం ఉన్న, లేని అన్ని ప్రశ్నలకీ, సమాధానాలు చెప్పడానికి సిద్ధపడి కూర్చున్నారు. ఎలాగైనా ఈ సంబంధం ఖాయం అవ్వాలని తల్లిదండ్రులుగా వారి అభిలాష.

పుస్తకం తెరచి మొదటి పేజీలోని కవిత చదివింది వర్ధని.

"తన అక్షరాల ఆకారాలు

తొలి వెలుగుల శ్రీకారాలు

ఆ పదకుసుమాల సుకుమారాలు

తేనెల ప్రాకారాల


ఆవర్ణాల వర్ణనలు

వెన్నెల దీపాలు ..."

కవిత్వం చదివి పెదవి విరిచింది వర్ధని.

"అబ్బెబ్బే... ఏమిటో ఒక్క ముక్కకూడా అర్థం కాలేదు. అయినా కవిత్వం రాసి ఏం చేద్దామని? సీరియల్స్ కీ, సినిమాలకీ పాటలుగానీ రాస్తావా కొంపదీసి.... అహహ్హహా.. దానికన్నా ఏ మెడిసినో, ఎమ్.బీ.ఏ.నో చేసుంటే, ఈ ఖర్మ తప్పేదిగా... పోన్లే అయిందేదో అయిపోయింది. మావాడు ఎమ్.టెక్. చేశాడు, మైక్రోటెక్ లో టీమ్ లీడ్. నెలకి లక్షన్నర జీతం. జాతకాలు కలిసి,

ఈ సంబంధం సెట్ అయితే, ఆస్ట్రేలియా వెళ్లి సెటిల్ అవుతావు. అక్కడికెళ్ళాక మూడులక్షలు జీతం, చూస్కో.. ఎంత అదృష్టవంతురాలివో.. నువ్వు చదివిన ఎమ్.ఏ. కి అక్కడ ఏ హోటల్లోనో వెయిటర్‌గా పని దొరికినా నెలకి లక్ష సంపాదించుకోవచ్చులే. అయినా... అచ్యుతరావు గారూ అదేంటండి అమ్మాయిని ఎమ్.ఏ. తెలుగు చేయించారు? అందరూ విదేశాలెళ్ళి ఎమ్.ఎస్.లు చేస్తుంటేనూ..। అహహహ్హా. అంతేలెండి దేవుడు అందరికీ మాకిచ్చినంత ఆర్థిక స్థోమత ఇవ్వడులెండి!"



వర్ధని మాటల్లో నడిమంత్రపు సిరితో వచ్చిన మిడిసిపాటుతో పాటు, ఎదుటివారిని పురుగుల్లా తీసిపారేసే దురహంకారం కూడా గోచరించింది వారికి.

ఆవిడకున్న అహంకారం, మత్తేభాన్ని చూసి నవ్వే పిపీలికంలాగా కనిపించింది ప్రబంధకి.

'అసలు మ్యారేజీ బ్యూరో ఆవిడని అనాలి.. ఇలాంటి అహంకారపూరితమైన వాళ్ళతో సంబంధం కలుపుకోమన్నందుకు!' అనుకుంది మనసులోనే.

ఆ మ్యారేజి బ్యూరో ఆవిడ బిజీగా, క్యాండీ క్రష్ ఆడుకుంటోంది సెల్‌ఫోన్‌లో...

'ఎవరెటుపోతే నాకెందుకు, నా కమీషన్ నాకొస్తే చాల'న్నట్టుంది ఆవిడ తరహా.

"ఏం లేదండి.. మా అమ్మాయికి చిన్నప్పటినించీ తెలుగు కథలన్నా, ప్రబంధాలన్నా చాలా ఇష్టం, మా నాన్నగారు అవధాని, అయన పోలిక వచ్చింది అమ్మాయికి. దీనికి మా నాన్నగారే 'ప్రబంధ' అని పేరు పెట్టారు. పేరుకి తగ్గట్టే ఎదిగింది మా అమ్మాయి." అన్నారు ఆనందం తొణికిసలాడుతుండగా అచ్యుతరావు గారు.

ఆయన మాటకి మూతి ముప్పయ్యారు వంకర్లు తిప్పింది వర్ధని.

"అయితే పాత చింతకాయ పచ్చడి అన్నమాట! ఎక్కడో పల్లెటూర్లో ఉండాల్సిన పిల్ల, సిటీలో పుట్టి పెరిగిందన్నమాట. మావాడు ఫారిన్ రిటర్న్డ్. వాడికెలా నచ్చుతుంది ఇలాంటి పిల్ల! సర్లే పెళ్లయ్యాక మార్చుకుంటాంలే. అమ్మాయి రేపు ఆస్ట్రేలియా వెళ్ళాక ఈ ప్రబంధాలు, పకోడీ పొట్లాలు అంటే కుదరదు. వీలయితే అమీర్‌పేటలో ఏదన్నా కంప్యూటర్ కోర్స్ నేర్చుకో. సాఫ్ట్‌వేర్ సైడ్ మా అబ్బాయి ఇప్పిస్తాడులే ఉద్యోగం. పోన్లే... ఒక పిల్లకి లైఫ్ ఇచ్చిన వాళ్ళం అవుతాం. ఇంతకీ లాంఛనాలు, కట్నం, అదీ.. ఎంత ఇవ్వగలరు? ఒక మాట అనుకుంటే పోలా?" అన్నది వర్ధని కాలు మీద కాలు వేసుకుంటూ.

ప్రబంధకి అర్థం అయిపోయింది.. ఇది కుదిరే సంబంధం కాదని.

★★★

ఆరేళ్లు గడిచాయి.

ఒకనాడు కూకట్‌పల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళింది వర్ధని. ముఖం అంతా పీక్కుపోయి, వయసుకు మించిన వృద్ధాప్యంతో, ఆపసోపాలు పడుతూ ప్రదక్షిణాలు చేస్తోంది! పదకొండు ప్రదక్షిణాలు చేసి, దర్శనం ముగించుకొని, ప్రసాదం తీసుకొని, ఆయాసపడుతూ గుడి మెట్లు దిగి వస్తుంటే కనిపించాడు అతడు.

"ఏరా సోమయాజులూ. నువ్వేనా?" అన్నది ఆ కుర్రాడి వంక వెళ్తూ.

అతగాడు అయిదో మెట్టు మీంచి వెనక్కి తిరిగి చూసి ... "వర్ధని పిన్నీ నువ్వా? ఎలా ఉన్నావ్? ఎక్కడుంటున్నారు? అయ్యాయో ఏంటి ఇలా అయిపోయావు?" అని ఆప్యాయంగా పలకరిస్తూ దగ్గరకి వెళ్ళాడు. నీరసంగా నిట్టూర్చింది వర్ధని.

"ఏం అడుగుతావులేరా ... దెబ్బ మీద దెబ్బ పడి మొదలు నరికిన చెట్టులా కూలబడిపోయాం" అన్నది దిగాలుగా.

"ఏమైంది పిన్నీ? రా అలా కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు సోమయాజులు. ఆ గుడిలోని వేపచెట్టు చుట్టూ కట్టిన మట్టి అరుగు మీద కూర్చున్నారు ఇద్దరూ.

"చెప్పు పిన్నీ ఇన్నేళ్లు ఏమయిపోయారు?" అడిగాడు సోమయాజులు.

"ఏం చెప్పనురా యాజులూ. మీ బాబాయ్‌గారు రిటైర్ అయ్యాక వచ్చే పెన్షన్ మా మందులకే సరిపోతోంది. మా వాడు వంశీ, పెద్ద కంపెనీలో టీమ్‌లీడర్‌గా ఉన్నప్పుడే ఆస్ట్రేలియా వెళ్ళాల్సింది. రెసిషన్ పిరియడ్ వల్ల ఇరవైవేల మందికి ఉద్యోగాలు పోయాయి, అందులో మావాడొకడు. ఆ తరువాత కూడా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఏదో అప్పులు చేసి బ్రతకాల్సి వచ్చింది. మధ్యలో కరోనా వచ్చి మళ్ళీ సాఫ్ట్వేర్ రంగం కుదేలయింది. వీటికి తోడు మావాడికి ముప్ఫయ్యేళ్ళు దాటినా పెళ్లి సంబంధాలు కుదరటం లేదు. ఈ మధ్యనే సొంతిల్లు అమ్ముకొని అప్పులు తీర్చి చిన్న ఫ్లాట్ లో అద్దెకి ఉంటున్నాం. వంశీగాడు బీటెక్ పిల్లలకి ట్యూషన్లు చెప్తూ ఏదో అలా నెట్టుకొస్తున్నాడు. వాడి పెళ్లి గురించే ఈ గుళ్ళు గోపురాలు తిరగడం." అంటూ కన్నీళ్లు ఒత్తుకుంది.

"ఇంతకీ నువ్వెక్కడ ఉంటున్నావు? పెళ్లయిందా?" అడిగింది వర్ధని, పులిహోర ప్రసాదం కొద్దిగా అతడి చేతిలో పెడుతూ.

"ఆరేళ్ల క్రితం పెళ్లి చేసుకుని కెనడా వెళ్లాను పిన్నీ" చెప్పాడు సోమయాజులు.

ఉలికిపాటు, ఆశ్చర్యం, కుళ్ళు, జెలసీ కలగలిసి వచ్చాయి వర్ధనికి.

"అదేంట్రా ఎంటెక్ చేసిన మావాడి వల్లే కాలేదు, వేదం చదివిన నువ్వెలా వెళ్ళావురా కెనడాకి? ఏం ఉద్యోగం అక్కడ?" అన్నది నిష్ఠూరంగా.

"టొరొంటోలో శివాలయం పూజారిగా చేస్తున్నాను."

"ఏమిటీ ... టొరొంటోలో శివాలయమా? అక్కడ పూజారా? ఎంత సంపాదిస్తున్నావేమిటి?" కుతకుతలాడిపోతోంది వర్ధనికి లోలోపల.

"నేనూ మాఆవిడ కలిసి నెలకి అయిదులక్షలు సంపాదిస్తున్నాంలే పిన్నీ. అమ్మానాన్ననీ, అత్తామామని తీసుకువెళ్దాం అని వచ్చాము." అన్నాడు.

ఆశ్చర్యపోయింది వర్ధని.

"ఎలా వచ్చిందిరా కెనడా అవకాశం? ఎంతయినా మీ ఆవిడ అదృష్టవంతురాలు." అన్నది కళ్ళలో నిప్పులు పోసుకుంటూ.

"కాదు పిన్నీ, నేనే అదృష్టవంతుడిని! మా ఆవిడే నన్ను కెనడాకి తీసుకువెళ్ళింది. అక్కడే మాకు బాబు పుట్టాడు. వాడికి ఇంగ్లీష్ చదువు నేర్పుతూనే, వేదం కూడా నేర్పుతున్నాను." అన్నాడు.

మరింత ఆశ్చర్యపోయింది వర్ధని. "ఆ పిల్ల సాఫ్ట్వేర్ ఇంజనీరా? ఆ పిల్ల ఎలా తీసుకెళ్ళిందిరా కెనడాకి?"

ఒక స్త్రీ అయ్యి ఉండి, మరొక స్త్రీ వల్ల పురుషుడు ఉద్ధరింపబడ్డాడంటే ఆమోదించలేని కుంచితత్వం గమనించాడు యాజులు. చిన్నగా నవ్వి చెప్పసాగాడు.

"సాఫ్ట్వేర్ ఇంజనీర్ కాదు, కెనడాలో తెలుగు టీచర్! ఆశ్చర్యంగా ఉంది కదా. మా ఆవిడ కెనడాలో అక్షరం అనే బడి స్థాపించింది. అక్షరం అంటే క్షరం కానిది, నాశనం లేనిది అని కదా అర్థం. మన భాష కూడ అక్షరం కావాలని ఆ పేరు పెట్టిందిలే. కెనడాలోని ఎన్.ఆర్.ఐ. తెలుగు పిల్లలంతా, ఆ బడిలోనే చదువుకుంటున్నారు. మా ఆవిడ ఆ స్కూల్ కి హెడ్ మిస్ట్రెస్ మాత్రమే కాదు, తెలుగు టీచర్ కూడా! చాలామంది తెలుగువారికి ఉద్యోగాలిచ్చింది తన బడిలో. ఇప్పుడు ఆ బడిని అన్ని దేశాలకూ శాఖలుగా విస్తరించాలనే ఆలోచనలో ఉంది తను. తనతో వివాహం అవడం వల్లనే నేనూ కెనడా వెళ్ళి, అక్కడి శివాలయంలో పూజారిగా స్థిరపడ్డాను. ఇప్పుడు మా అమ్మానాన్ననీ, అత్తమామలని కూడా కెనడా తీసుకెళ్దాం అనుకుంటున్నాను." చెప్పుకుపోతున్నాడు యాజులు.

ఏమీ వినబడటం లేదు వర్ధనికి. దహించివేసే దుగ్ధతో ఒళ్ళంతా మండిపోతోంది ఆమెకి.

సోమయాజులు భార్య ఎవరో తనకి అర్థం అయిపోయింది.

"ఇదిగో పిన్నీ, మా ఆవిడ ప్రబంధ, మా అబ్బాయ్ వేద విహారి!" అంటూ సెల్ఫోన్లో ఫోటో చూపించాడు. కళ్ళు మసకబారాయి వర్ధనికి.

"వంశీ గురించి బాధపడకు పిన్నీ, ట్యూషన్లు చెప్పడం ఎలాగూ అలవాటయ్యింది కదా, చక్కగా తెలుగు నేర్చుకోమను, మా బళ్ళోనే తెలుగు టీచర్ ఉద్యోగం ఇస్తుంది మా ఆవిడ. వాడూ మీరూ కెనడా రావచ్చు." అంటున్నాడు యాజులు మనస్ఫూర్తిగా.

కానీ ఆ మాటలు మంటలు రేపాయి తన గుండెల్లో.

"వీలయితే అమీర్పేటలో ఏదన్నా కంప్యూటర్ కోర్స్ నేర్చుకో. సాఫ్ట్వేర్ సైడ్ మా అబ్బాయి ఇప్పిస్తాడులే ఉద్యోగం. పోన్లే... ఒక పిల్లకి లైఫ్ ఇచ్చిన వాళ్ళం అవుతాం."

గతంలో తాను మిడిసిపడుతూ అన్న మాటలు తనకే వినిపించి చెవులు గట్టిగా మూసుకొంది వర్ధని.

"అమ్మో! తుఫాను వచ్చేలా ఉంది పిన్నీ. త్వరగా ఇంటికి వెళ్లకపోతే మా పంతులమ్మ బెత్తం తీస్తుంది. వెళ్ళొస్తా. వంశీని తెలుగు నేర్చుకోమని చెప్పు. మర్చిపోకు." అంటూ తన కారు వైపు పరిగెత్తాడు వేదుల వేంకటకృష్ణ సోమయాజులు.

పడమటి దిక్కున అఖండజ్యోతిని వెలిగించే ప్రమిద ఏదో కనపడింది ఆమెకి

తూర్పున జడివాన మొదలయింది. నిండా మునిగి ఒంటరిగా నిలబడిపోయింది వర్ధని.

★★★★★

# నాగేటి సాళ్ళలో..

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి



**ప్రత్యేక కథ**

'నాగేటి సాళ్ళంటే కేవలం నాగలి కర్రు గీసే గీతలు కావు. ఒక జాతి సాంస్కృతిక వారసత్వాన్ని పండించే సృజనాత్మక గీతాలు.'

'నాగేటిసాలంటే సీత.'

'సీతంటే రామునిలోని నైతిక బలం.'

'రాముడంటే ఒకానొక భవ్యమైన నాగరికతను రమింపజేసేవాడు.'

పొలం దున్నుతూ ఆలోచిస్తున్నాడు పోతన.

మన సంస్కృతిలో పేర్లంటే కేవలం పేర్లు మాత్రమే కావు. ప్రతి పేరు వెనుకా ఎన్నోఅర్థాలూ–పరమార్థాలూ, కథలూ–ఇతిహాసాలూ ఉంటాయి. వాటి వెనుక మనసులకి క్రమశిక్షణను అలవరిచే నైతిక చలనసూత్రాలు ఉంటాయి. అవే మనుషుల్ని మనుషులతో ముడివేస్తుంటాయి. ఆ ముడులు వెయ్యడంలో ఒకోసారి చిక్కుముడులూ పీటముడులూ పడిపోతుంటాయి. అన్ని ముడులనీ కేవలం వేళ్ళతో మాత్రమే విడదీయలేము. కొన్నింటిని వివేకంతోనూ, మరికొన్నింటిని విజ్ఞానంతోనూ విడదీయాల్సి వస్తుంది.

జ్ఞానమనే క్షేత్రానికి ఆలోచనలే నాగలి కర్రులు. మెదడుతో ఆలోచిస్తే శాస్త్రం–మనసుతో ఆలోచిస్తే సృజన.

తనముందున్న చిక్కుముడిని విడదీయడానికి కల్పన మాత్రమే సరిపోదు. దానికి తగిన విశ్వసనీయతని కల్పించాలి. శాస్త్రీయతని జోడించాలి. అప్పుడే అది కాలానికి నిలబడగలదు. లేకపోతే కేవలం అభూత కల్పనలా మిగిలిపోతుందిగానీ సృజనాత్మకత అనిపించుకోదు. ఎలా?

దున్నుతూనే చుట్టూ కలియజూశాడు. దూరంగా చెట్లు.

తను ముందుకు వెళ్తుంటే అవి వెనక్కి నడుస్తున్నాయి. తను ముందుకు నడవడం నిజం. అవి వెనక్కి వెళ్ళడం అబద్ధం. అలాగని ఆ చెట్లు వెనక్కి నడుస్తున్నట్లు కనిపించడం కేవలం కనికట్టు కాదు. దానివెనక ఏదో శాస్త్రీయమైన భౌతిక సత్యం ఉంది. ఏమిటది?

★★★

గుర్రంబండి వేగంగా పరిగెడుతోంది. అందులో వస్తున్న బొమ్మనాయకుడికి, ఏదో ఆలోచించుకుంటూ పరధ్యానంగా నడుస్తున్న పోతన కనిపించాడు. ఆయన తన చిన్ననాటి స్నేహితుడు. స్నేహాన్ని స్వంతానికి ఉపయోగించుకోని సజ్జనుడు.

బండిమీద రమ్మని బలవంతపెట్టినా చిరునవ్వుతో నిరాకరిస్తాడే తప్ప, కనీసం స్నేహధర్మంగా అయినా బండెక్కడు. ఆయన పాండిత్యం ఆయనకి నేర్పిన సంస్కారం అలాంటిది. అలాంటి స్నేహితుడు ఉండటం తనకి గర్వకారణం.

పోతన దగ్గరకి రాగానే బొమ్మనాయకుడు బండి ఆపించి,"రా మిత్రమా బండెక్కు" అన్నాడు.

ఆ పిలుపు కోసమే ఎదురు చూస్తున్నవాడిలా బండెక్కి కూర్చున్నాడు పోతన.

ఆయన్ని పిలవకపోతే బాగుండదనే ఉద్దేశంతో మాత్రమే ఆహ్వానించాడు. కానీ, ఆయన నిజంగానే తన బండెక్కడం అంటే.., తన జన్మ తరింపజెయ్యడమే. అందుకే అబ్బురంగా పోతనవైపు చూస్తూ తన ఆనందాన్ని ప్రకటించబోయాడు. కానీ ఆయన దృష్టి తనమీదలేదు. తదేకచిత్తంతో బయటెక్కడో ఏదో వెతుక్కుంటున్నవాడిలా కనిపిస్తున్నారు. బహుశా ఏ పద్యం గురించో ఆలోచిస్తున్నట్లున్నారు. ఇలాంటప్పుడు ఆయన ఏకాగ్రతకి భంగం కలిగిస్తే సరస్వతీమాత క్షమించదు. అందుకే బొమ్మనాయకుడు కూడా మౌనాన్నే ఆశ్రయించాడు.

తదేకంగా బయటికి చూస్తున్నాడు పోతన. బండి వేగంగా పరుగులు తీస్తోంది. దగ్గరగా ఉన్న చెట్టుచేమలు కూడా అంతే వేగంగా వెనక్కి పరుగెడుతున్నాయి. కానీ, దూరంగా ఉన్న కొండగుట్టలు మాత్రం వెనక్కి కాకుండా ముందుకి నడుస్తున్నాయి. ఇవి వెనక్కీ, అవి ముందుకీ ఎందుకు వెళుతున్నాయి? ఎక్కడికెళుతున్నాయి? వేగం ఇంకాస్త పెరిగితే మరింత వివరం తెలుస్తుందేమో చూడాలి.

బండి వేగాన్ని పెంచమన్నాడు పోతన. దాని వేగం పెరుగుతున్నకొద్దీ ఇవతలివైపు చెట్లూ.., అవతలివైపు కొండలూ మరింత వేగంగా పరిగెడుతున్నాయి.

ఈసారి దృష్టిని ఒక తాడిచెట్టుమీద నిలిపి చూడటం మొదలుపెట్టాడు. అవి ముందుకీ, ఇవి వెనక్కీ మాత్రమే పరుగులు తీయడం లేదు. ఇటువైపు చెట్టుచేమలూ–అటువైపు కొండకోనలూ కలిసి ఒక దీర్ఘవృత్తాన్ని ఏర్పరుస్తూ, ఆ తాడిచెట్టు చుట్టూ పరుగులు తీస్తున్నట్లనిపిస్తోంది. చిన్నప్పుడు ఆడిన మట్టిబొంగరం గుర్తొచ్చింది. దానికి ముల్లుగా గుచ్చిన కొబ్బరిఈను పుల్లలా కనిపిస్తోందా తాటిచెట్టు.

వెంటనే బొమ్మనాయకుడిని అడిగి ఒక నాణెం తీసుకున్నాడు. ఏటవాలుగా చూస్తుంటే అది కూడా ఒక దీర్ఘవృత్తంలాగే కనిపించింది. కానీ దాన్ని చేతిలో పెట్టుకుని పైనుండి చూసినప్పుడు మాత్రం గుండ్రని వృత్తంలా కనిపిస్తోంది. అది వృత్తాకారమైతే దానికి కేంద్రం ఉండక తప్పదు. ఆ కేంద్రమే బిందువు.

బిందువంటే పరబ్రహ్మం. ఆది మిథునం. అర్ధనారీశ్వరం. రమారమణీయం. 'పూర్ణస్య పూర్ణమాదాయ' అంటే ఇదేనేమో.., ఈ లోకమే అతిపెద్ద శ్రీయంత్రమేమో.., ఈ ఊహ రాగానే ఆ శ్రీచక్ర ప్రకృతే ప్రాణం పోసుకువచ్చి తనని వాత్సల్యంతో గుండెల్లో పొదువుకున్నట్లుగా తోచింది.

అమ్మస్ఫురణకు వచ్చిన తరువాత చేతిలోని నాణెం కూడా శ్రీయంత్రంలా కనిపించింది. అంటే దాని కేంద్రకమైన బిందువునుండి కూడా అంతర్లోక జ్ఞానవలయాలు విస్తరిస్తూ వెలుగులీనుతాయన్నమాట.

కానీ ఆ వెలుగుల్ని కేవలం నాణెం పరిధి వరకే పరిమితం చేస్తున్నారీ మనుషులు. అందుకే డబ్బుని దాటి ముందుకు ఆలోచించ లేకపోతున్నారు.

ఈ ఊహ రాగానే నాణెం హఠాత్తుగా మొయ్యలేనంత బరువెక్కిపోయింది. తక్షణమే దాన్ని బొమ్మనాయకుడిచేతిలో పెట్టేసి, బండి దిగి వెళ్ళిపోయాడు పోతన.

★★★

పోతనని ఆవరించివున్న శ్రీచక్ర ప్రకృతిలోంచి ఏదో దివ్యవాణి వినిపిస్తోంది.

చూడాలి. ఇంకా లోతుగా చూడాలి. దాని ఆంతర్యాన్ని కనిపెట్టాలి.

ఇంట్లోకి రాగానే తనకి 'మహత్వ కవిత్వ పటుత్వ' సంపదలిచ్చిన దుర్గమ్మతల్లి మెడలోని గాజులహారం కనిపించింది. ఆ గాజుల్ని చూస్తున్నకొద్దీ అమ్మవారు తనకేదో రహస్యాన్ని చెబుతున్నట్లనిపించింది. వెంటనే ఓ గాజుని తీసుకున్నాడు. దాన్ని నిలువునా వేళ్ళమధ్య పట్టుకుని నేలమీద గిరగిరా తిప్పాడు. అది గుండ్రంగా తిరుగుతూ ముందుకీ వెనక్కీ కదులుతోంది. ఆ కదలికల్లో ఒక లయబద్ధత. ఒక నాట్యం. ఒక శాస్త్రీయత. అవన్నీ ఎక్కడనుంచి వచ్చాయా గాజుకి? మళ్ళీ తిప్పాడు. మళ్ళీ కొత్త కదలికలు. కొత్త లయలు. కొత్త హొయలు.

అంతేనా? వాటిలో ఇంకేమైనా ఉందా?

అప్పటికి అసురసంధ్య దాటింది.

చెరువునుండి నీళ్ళు తీసుకువస్తోంది నరసమాంబ. చిన్నపిల్లాడిలా అమ్మవారి గాజులతో ఆడుకుంటున్న భర్తని చూసి మురిపెంగా నవ్వుకుంటూ లోపలకి వెళ్ళిపోయింది. ఆ నీటికడవని లోపల దింపింది. దీపం వెలిగించి గూట్లో పెట్టింది. ఆ వెలుగు కిరణాలు నీటికడవని కేవలం తనవైపునుండి మాత్రమే చూపిస్తున్నాయి. రెండవ వైపున గుడ్డివెలుగులో మసక మసగ్గా కనిపిస్తోంది కడవ. చూస్తూండగానే పోతన మనసులో కడవ భూమండలమైంది. దీపం సూర్యుడైంది. ఆ కడవనే చూస్తున్న తన కన్ను చంద్రుడైంది. ఆలోచన పదమైంది. పదం పాదమైంది. పాదం పద్యమైంది.

★★★

"నీ ప్రశ్నకి సమాధానం దొరికింది. అది నువ్వన్నట్టు కల్పనా కాదు. నేనన్నట్టు భావనా కాదు. ఆ రెండింటినీ మించిన 'అనుభవం' కూడా కాదు. అందులో ఉన్నది శాస్త్రపరిజ్ఞానం!" అన్నాడు మల్లన.

"ఈ మాట చెప్పడానికేనా, హాయిగా నిద్రపోవడం మానేసి, నా మొహంలోకి చూస్తూ కూర్చున్నది?"అంటూ భర్త ముఖాన్ని ముద్దుల్తో నింపేసింది శారద.

ముదమారా ముద్దుల జడివానలో తడిసి ముద్దయ్యాడు మల్లన. తరువాత మెల్లగా భార్యని లేపి నిలబెట్టాడు. మంచానికి ఈ పక్క వేసిన ముక్కాలు పీటమీద కూర్చోబెట్టాడు.

బుద్ధిమంతురాల్లా చేతులు కట్టుకుని, భర్త ముఖంలోకి కొంటెగా చూస్తూ అడిగింది శారద, "చెప్పండి శ్రీశైలవాసా!"

మల్లన చిరునవ్వుతో, "శాస్త్రవిజ్ఞానమంటే చెప్పేది కాదనీ, సాక్ష్యాధారాల్తో సహా నిరూపించి చూపేదనీ తెలుసుకోండి భ్రమరాంబాదేవీ!" అంటూ మంచం పట్టిమీద కూర్చుని చెప్పాడు, "ముందా పద్యాన్ని గుర్తు చేసుకోండి!"

పద్యాన్ని భర్తకి అప్పగించింది శారద

"రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై, శిరో రత్నమై

శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణ కేయూరమై

ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర

ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్"

అయినా ఈ అర్ధరాత్రిపూట ఆకాశంలో రవిబింబాన్నెలా తీసుకొస్తారుగానీ నా మాట విని పడుకోండి సిరికొండ సామీ"

"తొందరపడకు దేవీ, నీకు రవిబింబం కావాలి. అంతేగా? క్షణంలో రప్పిస్తాను. ముందు నా మాట విను. నువ్విప్పుడు మీ మామగారనుకో. అదిగో ఆ పున్నమి చంద్రుడే రవిబింబమనుకో"

"మరి వామనుడెవరు?"

"ఇంకెవరు? నేనే! ఇప్పుడు చెప్పండి. చందమామ ఎక్కడున్నాడు?"

"తమరి తలకి నాలుగు మూరల పైనున్నాడు"

కొంచెం పైకి లేస్తూ అడిగాడు,"ఇప్పుడెక్కడున్నాడు? ఎలా ఉన్నాడు?"

"అడుగు ఎత్తులో కర్రలేని గొడుగులా ఉన్నాడు.

మరికొంచెం పైకి లేస్తూ అడిగాడు"ఇప్పుడెక్కడున్నాడు?"

"తలమీద కిరీటంలా ఉన్నాడు!"

తరువాత అతను కొద్ది కొద్దిగా పైకి లేస్తూంటే, అతను అడగక ముందే చంద్రుడు ఎక్కడున్నాడో ఎలా కనిపిస్తున్నాడో తన వ్యాఖ్యానంతో సహా చెప్పడం మొదలుపెట్టింది.

"ఇప్పుడు చెవి దుద్దులా ఉన్నాడు. అబ్బో ఎంత పెద్ద దుద్దో. ఏమిటలా చూస్తున్నారు? నాక్కూడా అలాంటి దుద్దులు చేయిద్దామనా? వద్దులెండి. అంతంత దుద్దులు పెట్టుకుంటే చెవి తమ్మెలు చీలిపోతాయి. అదిగో మెడకి నిండైన కంఠాభరణం. అహా ఎంతందమైన భుజకీర్తో! అంత పెద్ద దండకడియం పెట్టుకుంటే జబ్బలు పడిపోవా? అయినా నాలాంటి బక్కపీచులకి అంతలేసి కడియాలెందుకులెండి.

కాళ్ళా గజ్జె కంకాళమ్మా.., పండువెన్నెల్లో వెండిగజ్జెల వైభవం మురిపిస్తోంది. మరి పాదపీఠం ఏదీ? అదిగో ఒంటి పాదపీఠం! ఏమండోయ్ వామనమూర్తిగారూ, పొరపాటున ఆ రెండో కాలు కూడా ఎత్తారనుకోండి. కింద పడతారు. మావయ్యగారు దర్శించిన దృశ్యం త్రివిక్రముడిని కళ్ళకు కట్టింది పండిత పుత్రా!"అంటూ శారద నవ్వుతూంటే మల్లన కూడా శృతి కలిపాడు.

ఇద్దరూ కాసేపు నవ్వుల్లో మునిగి తేలాక, తనే ముందు తేరుకుంటూ అడిగింది శారద,"ఇప్పుడు మీరు చూపించింది నా కళ్ళకు కనిపించిన అనుభవం. బహుశా మామయ్యగారి అనుభవం కూడా అదే అయ్యుంటుంది. ఇందులో శాస్త్రం విజ్ఞానం

ఎక్కడున్నాయి?"

"అది కూడా చూద్దుగాని" అంటూ మళ్ళీ మంచం పట్టె మీద నిలబడ్డాడు. శారద ఇంకా ముక్కాలు పీటమీదే కూర్చుని ఉంది. ఆమె దృష్టిని తనమీదే కేంద్రీకరించి పైకి లేవమన్నాడు. ఆమె మెల్లగా పైకి లేచింది. పూర్తిగా లేచి నిలుచున్న భార్యని, "నువ్వు లేస్తున్నప్పుడు మీ మామకాని మామ ఏం చేశాడు?" అని అడిగాడు మల్లన.

"ఏముంది తమరి భుజంమీంచి మెల్లగా కిందికి జారాడు!"

ఈసారి ఎంత మెల్లగా లేచావో అంతే మెల్లగా కూర్చోమన్నాడు.

శారద మళ్ళీ ముక్కాలుపీట మీద కూర్చున్నాక అడిగాడు "ఈసారేం చేశాడు మీ మామ?"

"మళ్ళీ మీ చెయ్యి పట్టుకుని భుజం మీదకి పాకాడు. నేను ఇంకాస్త కిందకి దిగితే మీ నెత్తెక్కి కూర్చునేలా ఉన్నాడు!" అంటూ నవ్వింది శారద.

మళ్ళీ లేవమన్నాడు. మళ్ళీ కూర్చోమన్నాడు. తను పైకి లేస్తున్నప్పుడు చందమామ కిందికి దిగుతున్నాడు. తను కిందికి దిగుతున్నప్పుడు ఆయన పైకి లేస్తున్నాడు. అలా నాలుగైదుసార్లు లేచి కూర్చున్నాక.. "ఇంక ఈ గుంజీలు తియ్యడం నావల్ల కాదు బాబూ!" అంటూ మంచం పట్టె మీద కూలబడింది.

తను కూడా ఆమె పక్కనే కూర్చుంటూ చెప్పాడు,"నువ్వు కిందికి దిగడం క్రియ అనుకో.. అప్పుడు చందమామ పైకి లేవడం ప్రతిక్రియ. ఒకవేళ చందమామే క్రియ అనుకో.. అప్పుడు నువ్వు కిందికి దిగడం ప్రతిక్రియ. అంటే ప్రతి "క్రియ"కీ ఓ "ప్రతిక్రియ" ఉంటుంది. ఈ "క్రియ", "ప్రతిక్రియ"ల సమ్యక్ సంయోజనమే సృష్టిలోని చలనశీలతకు మూలం. ఇది భౌతికశాస్త్రం. ఇంక రసాయనశాస్త్రంలో నువ్వు చర్య అయితే నేను ప్రతిచర్య. మనిద్దరం కలవడమే ఒక యోగం. ఆ యోగఫలంగా ప్రకృతికి ప్రతిరూపమైన నీలో చలనం కలుగుతుంది. దానివల్ల జరిగేదే ప్రతిసృష్టి. ఇంక మనం జీవశాస్త్రం అధ్యయనం చేద్దాం!" అంటూ ఆమెపైకి వాలిపోయాడు.

★★★

మల్లన గుండెలమీద తల పెట్టుకుని ఆదమరచి నిద్రపోతోంది శారద. కానీ ఆమె ఎప్పట్లా తన గుండెల్లోకి ఇంకడంలేదు. అందుక్కారణం ఆలోచనలు. వాటినుండి బయట పడాలంటే నాన్నగారినుండి ఒక ప్రశ్నకి సమాధానం తెలుసుకోవాలి.

రెండు వరస పద్యాలు. రెండూ వామనుడు త్రివిక్రముడయ్యే క్రమాన్ని వర్ణించేవే. మొదటి పద్యంలో ఇంతింతై వటుడింతయై అంటూ రాత్రివేళ కనపడే ఆకాశం, మేఘమండలం, పాలపుంత, చంద్రమండలం, ధ్రువ మండలం దాటి మహర్లోకాన్నీ, సత్యలోకాన్నీ మించి బ్రహ్మాండాంతం వరకూ వృద్ధి చెందాడా వామనమూర్తి. తరువాతి పద్యంలో పగలు తప్ప రాత్రి కనపడని రవి బింబాన్ని ఉపమించారు. ఒకే సమయంలో పగలూ రాత్రీ కూడా ఎలా వస్తాయి?

నాన్నగారిలాంటి సహజకవి రాసిన పద్యాలలోకి ఈ అసామంజస్యం ఎలా వచ్చింది?

చూస్తే నాన్నగారింకా లేవలేదు. నిరంతరం భాగవత దర్శనంతోనే గడిపే ఆయనకి ఏ తెల్లవారుజామునో నిద్ర పడితే పట్టినట్టు. లేకపోతే లేనట్టు. కాబట్టి, ఆయన లేచేంతవరకూ ఎదురు చూడాలే తప్ప నిద్రాభంగం కలిగించకూడదు.

అందుకే కాళ్ళాలు తీర్చుకుని వచ్చి స్నానాదికాలు పూర్తి చేసి గుడిముందు కూర్చున్న భక్తుడిలా గాయత్రిని జపిస్తూ కూర్చున్నాడు.

★★★

తలుపు తెరిచిన పోతనకి ఎదురుగా జపం చేసుకుంటున్న మల్లన కనిపించాడు. అతని జపాన్ని భంగపరచడం ఇష్టంలేక, తనుకూడా వెళ్ళి స్నానం చేసి వచ్చాడు. మల్లన జపం ఇంకా కొనసాగుతూనే ఉంది. అందుకే లోపలికి వెళ్ళబోయాడు పోతన. కానీ మల్లన చేతులు ఆయన పాదాల్ని కదలనిస్తేగా?

"నాన్నా నిన్న రాత్రినించీ నన్నో అనుమానం తొలిచేస్తోంది. మొదటి పద్యంలో ఇంతింతై వటుడింతయై అంటూ రాత్రిని వర్ణించిన వెంటనే ఎటువంటి కాలావధీ లేకుండానే రవిబింబాన్నుపమించారు. మీ పద్యాల్లో ఇంతటి అనౌచిత్యాన్ని ఊహించలేకపోతున్నాను!"

కొడుకుని మెల్లగా లేవనెత్తాడు పోతన. లోపలకి తీసుకువెళ్ళాడు. అప్పటికింకా పూర్తిగా తెల్లవారలేదు. అందుకే లోపల మసగ్గా ఉంది. నిన్న రాత్రి నరసమాంబ పెట్టిన నీటికడవ ఇంకా అక్కడే ఉంది. గూట్లో దీపం కూడా వెలుగుతూనే ఉంది. దాన్ని చూపిస్తూ, "ఆ దీపం సూర్యుడనుకో! మధ్యలో ఉన్న ఈ కుండే భూమండలం అనుకో. ఇప్పుడా కుండమీద సూర్యుడి వెలుగు పడినవైపంతా పగలు. ఆ కుండకి ఇవతలి వైపు నీడే గానీ వెలుగు పడదు. కాబట్టీ ఈవైపు రాత్రి. భూమండలాన్ని మించి ఎదిగిన త్రివిక్రముడికి ఇప్పుడు నీకు కనిపిస్తున్నట్టుగానే పగలూ రాత్రీ ఒకేసారి కనిపించడంలో ఆశ్చర్యంగానీ దాన్ని వర్ణించడంలో అనౌచిత్యంగానీ ఏముంది నాన్నా?" అన్నాడు.

మల్లనకి నోట మాట పెగల్లేదు. అందుకే తండ్రివైపు అబ్బురంగా చూస్తూండిపోయాడు.

పక్కనే ఉన్న నరసమాంబకి కూడా ఓ అనుమానం వచ్చింది. వెంటనే తన తుంటరి అనుమానాన్ని సంధించింది, "మనక్కాబట్టి భూమి ఇక్కడ కుండలో ఉంది. సూర్యుడేమో ఈపక్కన గూట్లో ఉన్నాడు. ఆ చంద్రుడు చూస్తే కుండకి వెనకవైపున్నాడు. మరి మీ వామనుడూ, బలిచక్రవర్తీ నిలబడ్డానికి స్థలం ఎక్కడుంది స్వామీ?"

అప్పుడప్పుడే తెల్లవారుతోంది. ఆ వేకువ కువకువల్లో పోతన పెదాలపై విరిసిందో చిరు దరహాసం.

"మా వామనుడు ఆది మధ్యాంత రహితుడు. ఆ బలిచక్రవర్తేమో రాబోయే సావర్ణి మన్వంతరానికి కాబోయే దేవేంద్రుడు. వారి స్థల కాలాదుల్ని నిర్ధారించడం మనవంటి మానవమాత్రులవల్ల అయ్యేపనేనంటావా?"

మల్లన తండ్రివైపు సంభ్రమంగా చూస్తూ మెచ్చుకోలుగా అన్నాడు.. "నాన్నగారూ, రాసేప్పుడు మీరెంత గొప్పకవో.. ఆలోచించేప్పుడు అంతకంటే ఎన్నోరెట్లు గొప్ప శాస్త్రవిజ్ఞాని! మీరు తలుచుకుంటే లోకానికి ఎంతో విజ్ఞానాన్ని పంచగలరు!"

మల్లన మాటలకూ్కడా చిరునవ్వే సమాధానంగా ఇచ్చాడు పోతన.

"ఈ చిద్విలాసానికి భావమేమి పతిదేవా?" అంటూ సాగదీసింది నరసమాంబ.

దానికీ చిరునవ్వే సమాధానం.

అంతలోనే అటుగా వచ్చిన శారద చెప్పింది, "మామయ్యగారెంతటి ప్రాచీనులో అంతకు మించిన నవీనులు. తండ్రుల

పద్యాలే తనయుల ప్రయోగాలకి ప్రేరణలు. అంటే ఈనాటి సృజనాత్మక కల్పనలే రేపటి వైజ్ఞానిక ప్రగతికి మూలాలు. అంతేనా మామయ్యగారూ!"

పోతన చిరునవ్వు ఇంకా పద్యమై పరిమళిస్తూనే ఉంది.

★★★★★

*(అంకితం: పోతన దర్శించిన చలన సూత్రాల్ని రెండుశతాబ్దాల తరువాత నిరూపించి చూపిన భౌతికశాస్త్రవేత్త సర్ ఐజక్ న్యూటన్‌కి సభక్తికంగా)*

*సాక్షి ఫన్ డే 15.12.2019లో ప్రచురించిన కథ పునర్ముద్రణ*

# సరేనా...

భువనచంద్ర



***విశిష్ట అతిథి కథ***

వాళ్ళిద్దరూ ప్రతిరోజూ అదే పార్కులో అదే చోట, అలాగే ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ, మధ్యమధ్య అర్థంలేని చిరునవ్వులు నవ్వుకుంటూ కూర్చోవడం 'జనం' చాలా రోజుల్నుంచి గమనిస్తూనే ఉన్నారు! అమ్మాయి ముద్దబంతిలా అబ్బాయి మొగలిరేకులా, ఇద్దరూ 'పురివిప్పిన యవ్వనంలా' మిసమిసలాడుతుంటే, ఎవరికి చూడాలనిపించదూ!

చాలా రోజులు వాళ్ళు ఏమైనా మాట్లాడుకుంటారేమోనని 'జనం' ఎదురు చూశారు. ఉహు ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు. 'జనం' లో కుతూహలం రోజు రోజుకీ పెరిగిపోయింది! సామాన్యంగా ప్రేమికుల్లో ఎన్నో వేల అసందర్భపు వాగ్దానాలూ, పరస్పర పొగడ్తలూ, ఇంకా సినిమాల గురించో నవలల గురించో కాలక్షేపం కబుర్లూ

బోలెడన్ని విషయాలు దొర్లుతూ ఉంటాయి. కానీ ఈ 'యువజంట' వ్యవహారం చూస్తే 'పరమ' విచిత్రంగానూ, లోక విరుద్ధంగానూ ఉన్నదనీ, ఇదేమిటో వేచి' చూడాల్సిన వ్యవహారమేననీ.. 'జనం' ఓ నిర్ధారణ కొచ్చారు. 'కేవలం చూపుల్తోనూ నవ్వుల్తోనూ మాత్రమే తృప్తిపడటం ఎందుకూ? ఇంకొంచెం ఎడ్వాన్సు కావొచ్చు కదా?' అన్న కుతూహలం 'నా' బుర్రలోనూ మొలకెత్తింది. ఈ కుతూహలం పెరిగి పెరిగి 'జనం'తో పాటు 'నన్నూ' వాళ్ళు రోజూ కూర్చునే పొదకి 'తగినంత' దూరంలో కూర్చునేటట్లు చేసింది! నడివయస్సు దాటింది గనుక, ఏ పేపరో పట్టుకొని చదువుతున్నట్లు నటించినా 'వాళ్ళ మాటలు విందామన్న కుతూహలంతో వచ్చానని, నన్ను ఎవ్వరూ అనుమానించరనే నిర్ధారణ' చేసుకున్నాను. 'అదెందుకంటారా?' అది నా వృత్తి మరి!

ఇంకో పది రోజులు గడిచిపోయాయి.

వాళ్ళు అదే టైముకి, అదే పొద దగ్గరికి రావడం 'అక్కడే' కూర్చోవడం, ఒకరినొకరు కళ్ళల్లోకి చూసుకోవడం... చిరునవ్వులు నవ్వడం... బస్! ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంది.

ఓ రోజు వాళ్ళిద్దరూ ఆలస్యంగా వచ్చారు. నేను అప్పటికే వాళ్ళ కోసం ఆత్రంగా ఎదురుచూస్తూ కూర్చున్నాను.

వాళ్ళు వచ్చారు... అదే చోట్లో కూర్చున్నారు.

"హూ!" కూర్చుంటూ అబ్బాయి నిట్టూర్చాడు.

"హూ" అమ్మాయీ నిట్టూర్చింది.

ఇక వాళ్ళు 'గ్యారంటీగా మాట్లాడుకుంటారని' నా మనసు ఆనందంతో ఉరకలువేసింది. అరగంట సేపు చూసినా

ఒక్క మాట కూడా మాట్లాడుకోలా! నాలో మళ్ళీ నిరాశ చోటుచేసుకోబోయంతలో "హూ!" అన్ననిట్టూర్పు మళ్ళీ వినిపించింది. ఆ నిట్టూర్పు ఖచ్చితంగా అమ్మాయిదే! వీళ్ళ సంగతి ఇంటి దగ్గర తెలిసి ఉండాలి. తల్లిదండ్రులు 'తిట్టి' ఉండాలి. అందుకే యీ

సుదీర్ఘమైన నిట్టూర్పు అనుకున్నాను.

చీకటిపడుతోంది. పార్కులో ఇంకా దీపాలు వెలిగించలా! అబ్బాయి.. అమ్మాయి చేతిని తన చేతిలోకి తీసుకుని సుతిమెత్తగా 'నొక్కా'ల్సిన 'రొమాంటిక్ సంధ్య' ఇది. అయినా ఆ కుర్రాడా పని చెయ్యలా! కళ్ళజోడులోంచి జాగ్రత్తగా చూస్తూనే ఉన్నాను. వాళ్ళు మధ్య మధ్య చిరునవ్వులు నవ్వుకుంటున్నా ఆ నవ్వుల్లో 'ఏదో' నిర్లిప్తత నాక్కనిపించింది. కానీ ఏంచేస్తాం? పెద్దలు ఆంక్షలు విధిస్తే, 'ప్రేమలో పడ్డవాళ్ళు' నిర్లిప్తంగా ఉండక ఇంకెలా ఉండగలరు! చీకటి పడ్డాక ఇద్దరూ లేచారు. మౌనంగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు. నేనూ లేచాను.

'అసలు వాళ్ళు ఎందుకు మాట్లాడుకోరు?' అన్న ప్రశ్నమాత్రం నా బుర్రని తొలిచేస్తోంది. అసలీ కుతూహలం నాకెందుకంటే, ఒక 'టీనేజ్ లవ్' సబ్జక్టుమీద సినిమా తీద్దామని మా ఫ్రెండ్ ఆర్నెల్లుగా నా బుర్ర తినేస్తున్నాడు. పెళ్ళాన్ని తప్ప వేరే ఆడదాన్ని 'ప్రేమించిన' అనుభవం లేనందువల్ల ఇంత కాలమూ ప్రేమకథలు వ్రాయలేదు.వీళ్ళిద్దరినీ 'గమనించాక' ప్రేమకథ వ్రాసి తీరాలన్న పంతం పెరిగింది. అందుకనే ప్రేమికుల మాటలు ఎలా ఉంటాయో విందామన్న కుతూహలం!

మరికొన్ని రోజులు గడిచాయి. అయితే 'నేను' కూర్చునే పొద చుట్టూ చాలామంది చేరారు. వాళ్ళల్లో ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు కూడా ఉన్నారు. సామాన్యంగా ఈ పార్కులోకి ప్రేమికులు రావడం అరుదు. నడివయస్సు వాళ్ళు, పిల్లలూ మాత్రమే కనిపిస్తారు. అలాంటిది ఇంతమంది 'వాళ్ళు' కూర్చునే పొద సమీపంలోనే గాక, ఆ సమీపంలోనే కొంచెం అవతలగా ఉన్నపొద దగ్గరికీ చేరారంటే.. ఆ 'ప్రేమికులు' విచిత్ర ప్రవర్తన వీళ్ళనీ ఆకర్షించి ఉండాలి. వాళ్ళిద్దరూ వచ్చి కూర్చోంగానే, వీళ్ళందరూ మాటలు ఆపేసి చెవులు రిక్కించి, వాళ్ళేం మాట్లాడుకుంటారో అనే కుతూహలం.. ఇంత బాహాటంగా ప్రదర్శించడం నాకు కోపం తెప్పించింది. నాకైతే ఒక 'పర్పస్' ఉంది. కానీ వీళ్ళ కుతూహలం.. కేవలం 'అర్థం లేనిదీ అనవసరమైనదీ' అని గట్టిగా నిర్ణయించాను.

ఇంకో వారం గడిచింది.

'నో ప్రోగ్రెస్' అబ్జర్వు చేసే మాలో మాత్రం రోజు రోజుకీ 'టెన్షన్ పెరిగిపోతోంది. వాళ్ళకి దగ్గరగా ఉండే 'చోటు' చూసుకుని కూర్చోడానికి ఒకళ్ళకంటే ఒకళ్ళు పోటీపడి మరి ముందుగానే పార్కుకి వస్తున్నారు. ఒకనాడు కొంచెం లేట్ చేసేసరికి నా పొద అన్యాక్రాంతమయిపోయింది. దాంతో నేనూ మామూలు టైంకంటే ముందుగా రాక తప్పడంలా!

ఇంకా కొన్నాళ్లు గడిచాయి!

నా చోటు వదులుకోవడం ఇష్టం లేక, 'ప్రేమకథ' వ్రాయాలన్న 'తపన' ఆపుకోలేక ఇప్పుడు మరీ 'ముందుగా' రావాల్సొచ్చింది. "వాళ్ళు" మాత్రం అంగుళం మాత్రం ముందుకు జరగలా! అవే చూపులూ! అవే నవ్వులూ! నాతోటి 'అబ్జర్వర్స్' మాత్రం, వాళ్ళు వచ్చేంతవరకూ, వాళ్ళ 'లోకాతీత' 'విపరీత' ప్రేమని గురించే బాహాటంగా చర్చించుకుంటున్నారు. కొందరైతే ఇంకొంచెం ముందుకెళ్ళి.. ఆ వయస్సులో 'తామెంత ఫాస్టు'గా ప్రేమించారో, మిగతావాళ్ళకి కథలు కథలుగా చెప్పడం మొదలెట్టారు. నడివయస్సు ఆడవాళ్ళు కూడా ఈ చర్చల్లో పాల్గొనటం మొదలుపెట్టారు. ఇటువంటి 'చిత్రం' కనీ వినీ ఎరుగని పార్కు బెంచీని 'గుద్ది' మరీ చెప్పారు. ఆ తరుణీమణుల్లో ఒకావిడ పూర్వ సువాసిని. ఎర్రగా బుర్రగా బొద్దుగా బాగానే ఉంటుంది. బొట్టూ గాజులూ, తాళీ, మట్టెలూ లేవన్నమాటే గానీ రంగుచీరలూ, పౌడర్లు వగైరాలతో కళకళలాడుతుంది. మిగతా 'అబ్జర్వర్ల' లో ఉండే ఓ 'భార్య వియోగస్తుడు' ఈమెతో మాట్లాడటానికి ప్రయత్నించడమూ, ఆ ప్రయత్నంలో 'విజయం' సాధించి ఆమెకి తగినంత 'దగ్గర్లో' కూర్చోవడమూ.. నేనేగాక మిగతావాళ్ళు కూడా గమనించారు.

ఎవరెట్టా ఉన్నా, 'యువ ప్రేమికులు' మాత్రం' మౌనం వదలటంలా! ఇప్పటికి మూడునెలలు గడిచినా.. ఒక్క మిల్లీమీటరు కూడా వారి ప్రేమ ముందుకు జరగలా! మాలో 'టెన్షన్' పెరిగి పెరిగి హిమాలయాన్నిదాటిపోయింది. 'అబ్జర్వర్ల'లో కొంతమంది 'సిగ్గుశరాలు' విడిచి, వాళ్ళకి మరీ దగ్గర్లో కూర్చుంటున్నా... ఆ ప్రేమికులు మాత్రం ఎవర్నీగమనించనట్టే బిహేవ్ చేస్తున్నారు. నవ్వులూ, చూపులూ, అప్పుడప్పుడూ 'నిట్టూర్పులు' అంతే! అదివరకైతే పార్కు నలుమూలల్లోనూ జనాలు ఉండేవారు. ఇప్పుడు అందరూ 'ఇక్కడికే చేరటం వల్ల మేముండే చోటు తప్ప, మిగతా పార్కు అంతా నిర్మానుష్యమై పోయింది.

'విధవాయినా', 'విధవావిడా'.. ఈ మధ్య శ్రద్ధగా 'డ్రెస్' చేసుకురావడం మరో చర్చనీయాంశమైంది.

'విధవాయిన' రోజూ విధిగా వేరుసెనక్కాయలో, మిక్చర్ పొట్లం కట్టించి తీసుకురావడం, విధవావిడకి ఆప్యాయంగా, ఆరాధనతో అందించటం నేను ప్రత్యేకంగా గమనించాను. అంతేకాక 'వీళ్ళు' కూడా ఒకొరినొకరు చూసుకుంటూ చిర్నవ్వులు చిందించుకోవడం, ఆ తరువాత అనర్గళంగా మాట్లాడేసుకోవడం, అప్పుడప్పుడూ విధవాయన సన్నగా ఏదో అంటే.. 'పూర్వసువాసిని' సిగ్గుతో మెలికలు తిరగటం కూడా నేను శ్రద్ధగా గమనించా. ఆ యువజంట ఏమైనా, వాళ్ళ సంగతి ఎలా ఉన్నా, మరో 'మధ్య వయసు జంట' తమ కలల్ని కలబోసుకుని 'ప్రేమనగర్' ద్వారాలు ఏనాడో ఒకనాడు తెరుస్తారని నాకు నమ్మకం ఏర్పడిపోయింది!

రోజు రోజుకీ అబ్జర్వర్ల 'స్ట్రెంత్' పెరిగిపోతూనే ఉంది. 'తమ' కాలంలో తాము ఎంత గొప్పగా, ఎంత గాఢంగా ఎవర్ని ఎలా ప్రేమించారో, చర్వితచర్వణంగా కొందరు వివరిస్తూనే ఉన్నారు. 'సబ్జక్టు' ఎంత రసవత్తర ఘట్టంలో ఉన్నా, యువజంట రాగానే ఎక్కడి వాళ్ళు అక్కడే 'గప్‌చిప్'. కళ్ళు 'పెద్ద'వి చేసుకుని, చెవుల్ని నిటారుగా 'రిక్కించి' యువ ప్రేమికులు 'మాట'ల కోసం తహతహలాడుతున్నారు.

మూడు నెల్ల ఇరవై రోజులయ్యాయి!

అవ్వాళ నేను వెళ్ళేసరికి మిగతా వాళ్ళంతా ఒకచోట సభ తీరారు. యువజంట రావడానికి ఇంకో 'అరగంట టైమ్ ఉంది. అంతలో సన్నగా పొడుగ్గా పంచా, నల్లని కోటూ చేతిలో గొడుగూ ఉన్న ఓ ముసలి లాయరు గుమాస్తా లేచి, "ఇహ ఈ సస్పెన్సు భరించలేనండీ... ఇవాళ అడిగేస్తా! వాళ్ళు ప్రేమికులా కాదా అన్న విషయంలో నాకు ఎటువంటి అనుమానమూ లేదు. వాళ్ళ కళ్ళల్లో భావాలు చూడండి... ప్యూర్ ఆరాధన ఉంది! వాళ్ళ నవ్వులు చూడండి... ప్రేమతరంగాలు వీస్తున్నట్టు ఉంటుంది! ఆ నిట్టూర్పుల్లో ఎంత 'ప్రేమజ్వాల' ఉందో! ఇవాళ ఏమైనా వాళ్ళని అడిగేస్తాను!" అన్నాడు.

"మీరు అడగడం అంత భావ్యం కాదేమోనండీ! మా ఇష్టం మాది... చూసుకుంటే చూసుకుంటాం.. నవ్వుకుంటే

నవ్వుకుంటాం...మీకెందుకు? మీ కొచ్చిన నష్టం ఏమిటి? పెద్దవారు! మీ గొడవలు మీరు చూసుకోక.. మాసంగతి మీకెందుకు? అంటారనుకోండి... అప్పుడు మన గౌరవం నట్టేట్టో కలవదూ?" సందేహం వెలిబుచ్చారో యాయవారపు బ్రాహ్మడు. నశ్యం పీల్చడం ఆయన ప్రత్యేకత.

'పెద్ద వాళ్ళం గనకే అడుగుతాం! అందులో తప్పేంటి? అయినా పెద్దవాళ్ళని ఏమార్చి ఇలా పార్కుల్లో గంటల

తరబడి కూచోవడం, ప్రేమా ప్రేమా అంటూ పిచ్చిలో పడటం – ఈ కాలం పిల్లలకి ఫేషన్ అయిపోయింది!" విధవావిడ విమర్శించింది. ఆవిడ వంక మెచ్చుకోలుగా చూశాడు విధవాయన.

“మనం ఇంకోళ్ళని అనేముందూ ఇంకొకరి బాగోగులు చర్చించే ముందూ ‘మన’ సంగతి ఆలోచించుకుని మరీ మాట్లాడాలి!” ఎక సెక్కంగా అన్నాడో బట్టతలాయన విధవావిడతో.

విధవావిడ ప్రేమాయణాన్నిఆయనా గమనించడం నేను గమనించాను.

“ఎవర్నండీ మీరంటున్నదీ?” కోపంగా లేచింది పూర్వసువాసిని.

“మిమ్మల్ని పేరు పెట్టి నేనేమీ అనలేదే? ఎందుకు భుజాలు తడుముకుంటారు?” బట్టతలాయన రిటార్టిచ్చాడు.

“హూ! వయస్సు ఎంత వస్తే మాత్రం ఏం లాభం? బుద్ధికి చెదలు పడితే ఇలాంటి మాటలేవస్తాయి. ఒక ఆడదీ

ఒక మగాడూ మాట్లాడుకుంటే చాలు... లోకం కళ్ళల్లో నిప్పులు పోసుకుంటుంది! అయినా ఈ వయస్సులో

ప్రేమలు పుడతాయా మాకు?” యీసడిస్తూ అంది విధవావిడ.

“మాట్లాడితే ఎవరూ ఏమీ అనుకోరు! అయినా వెర్రికి వయసేమిటి! ఆ సిగ్గులు ఒలకబొయ్యడాలూ, పొట్లాలు దొబ్బితినడాలూ, ఆపైన నీతులు సెప్పడాలూ ప్రపంచలో కొత్తవేమీ కాదుగా!” హేళనగా అన్నాడు బట్టతలాయన.

“మాటలు మీరకండి! పొట్లాలు తెచ్చిస్తే మీకెందుకూ? పొర్లి ఏడిస్తే మీకెందుకు? మీ మొహానికి మేమే దొరికామా! మంచీ చెడ్డా ఏదో మాట్లాడుకుంటే పుకార్లు పుట్టిస్తారా? ముసలాడివని ఊరుకున్నాగానీ..” కోపంగా బట్టతలాయనతో అన్నాడు విధవాయన.

“ఓసోస్... నువ్వేదో మహా పడుచువాడి వయినట్టూ... నోర్ముయ్యవయ్యా బోడిలింగం! వెధవముండ ప్రేమ సంపాయించగానే పడుచువాడివై పోయావా? ఎగిరితంతే ఏలూర్లో పడతావు!” చొక్కా చేతులు మడుస్తూ అన్నాడు బట్టతలాయన.

“చూశారా? నన్ను వెధవముండా అంటాడా.. ఎంత పొగరు! చాచికొడితే చచ్చూరుకుంటాడు... చేతులు ముడుస్తాడా... వీడి జిమ్మడ.. వాడి పెళ్ళాం సాయిబుని తగులుకోను... వీడికి శ్రార్ధం పెట్టా...” హస్తవ్యాసం

చేస్తూ దండకం మొదలెట్టింది విధవావిడ.

“నోర్ముయ్యవే, నువ్వో రంభా...ఆ బోడిలింగంగాడొక నలకూబరుడు... ఈ ముండాపార్కొక నందనవనం! నాకు చిర్రెత్తితే చీరేస్తా!” తనూ లేచాడు బట్టతలాయన.

తన ప్రేయసిని విధవముండా అన్నందుకూ, తనని బోడిలింగం అన్నందుకూ, అక్కడితో ఆపక ఆ మాటల్నే

రిపీట్ చేసినందుకూ, విధవాయనకి వెర్రికోసం వచ్చి బట్టతలాయన చొక్కాపట్టుకుని ‘చాచి’ కొట్టాడు.

బట్టతలాయన ఒక్కక్షణం నిర్ఘాంతపోయినా, వెంటనే తేరుకుని “ఒరేయ్! విధవముండా ప్రేమ చూసుకుని

విర్రవీగుతున్నావేంట్రా? దాన్నీ నిన్నూకూడా క్షణంలో మట్టిగరిపిస్తా!” అంటూ విధవాయన వీపు మీద ‘ఛటేల్న’ ఒక్కటిచ్చాడు.

దాంతో రణగొణ ధ్వని మొదలైంది. కొంతమంది ఇటూ, కొంతమంది అటూ.. సపోర్టుగా నిలబడ్డారు. అరుపులూ వాదనలూ కేకలూ కీచులాటలూ నడుస్తుండగా మరికొంతమంది ‘మధ్యే’ మార్గంగా విధవాయిన్నీ బట్టతలాయన్నీ విడదీశారు. ఇప్పుడు

మొత్తంగా రెండు పార్టీలయ్యాయి.

“విధవముండ’ ‘బోడిలింగం’ అన్న పద ప్రయోగాలు చెయ్యడం ‘అసభ్యత’ అనిన్నూ, అసలామాటనే అనూయతో కూడుకొన్నవనిన్నూ, విధవావిడ సింపతైజర్స్ ‘క్లెయిమ్’ చేశారు.

అలాగే ‘లెంపకాయ’ కొట్టి ‘మేన్ హాడ్లింగ్’ చేయడం తప్పనిన్నూ,’తిట్లదండకం’ అనవసరమనిన్నూ.. బట్టతలాయన సపోర్టర్సు ‘ప్రొటెస్టు’ చేశారు.

నేనూ మధ్యలో చొరబడి ఇరువర్గాల్ని కాస్త సర్దుబాటు చేస్తుండగా ‘యువజంట’ నవ్వుతూ మమ్మల్నిచూడ్డం గమనించి అందరికీ సైగ చేశాను. దాంతో అందరూ సైలెంట్ అయిపోయారు.

“అసలీ గొడవకు కారణం మీరే!” కోపంగా యువజంట వంక చూసి అన్నాడు ప్లీడర్ గుమాస్తా.

“సారీ అంకుల్... నా పేరు నరేష్‌కుమార్..ఈమె మిస్ అనూరాధ! ఇద్దరం సైకాలజీలో రీసెర్చి చేస్తున్నాం. ఇద్దరు యువతీయువకులు ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంటే, మీ”నడివయసు’ వారిలో ఎలాంటి రియాక్షన్స్ వస్తాయో గమనించడానికి ఈ పార్కుని ఎన్నుకున్నాం. మీరెంత కుతూహలంతో మమ్మల్ని పరికించేవారో..మేమూ అంతే కుతూహలంగా మిమ్మల్ని పరిశీలించాం! చాలా చిత్రమైన విషయాలు, ఈ పరిశోధనలో బయటపడ్డాయి. నడివయసువారిలో వచ్చే విపరీత చేష్టలు విచిత్రమైన అలవాట్లు మానసిక వికారాలూ ఎలా ఏవిధంగా ఉంటాయో ప్రాక్టికల్గా తెలుసుకున్నాం. మీకందరికీ మా కృతజ్ఞతలు! మా వల్ల మీకు దెబ్బలాటలు వచ్చినందుకు చింతిస్తున్నాం. మరోసారి మీ అందరికీ థాంక్స్!” అంటూ ఆ అమ్మాయి భుజం మీద చెయ్యివేసి బయటికి నడిచాడు నరేష్‌కుమార్. అందరూ అవాక్కై నిలుచున్నారు.

“వీళ్ళిద్దరూ కేవలం స్టూడెంట్స్ అయితే ఆ చిరునవ్వుల్లోని ఆరాధన, ఆ చూపుల్లోని ప్రేమా నిజమైనవా కావా?

కేవలం ఇదంతా నటనేనా?” అన్న ప్రశ్నకి సమాధానం మాత్రం నాకు ఇప్పటిదాకా దొరకలా...

మీకేమైనా అర్థమైతే నాకు చెప్పండి!

సరేనా!!

★★★★★

*(తెలుగు తేజం, జులై 2010 సంచిక నుంచి పునర్ముద్రణ)*

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.

అవసరాల వెంకటరావు
*9989976688*

జయంతి ప్రకాశ శర్మ
*9848629151*

◈

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.
మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*
మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

◈

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
*www.kathamanjari.in*

◈

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*